మాగజైన్ నేటి నారాయణమ్మ పై కథనాలు
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



: fb.com/vaartha Digital

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

విజయవాడ
30-9-2026
బుధవారం
సంపుటి: 32
సంచిక: 241
పేజీలు: 10+4
వెల: 6.50

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam




రంగనాయకుల మండపంలో సింగపూర్ మంత్రి షణ్ముగం, మంత్రి లోకేశ్




## భారత్‌కు 2 గోల్డ్ మెడల్స్



మంగళవారం రామాపురంలో నిర్వహించిన పల్లె పండుగలో పాల్గొన్న సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్, మంత్రులు నిమ్మల, జనార్ధన్ రెడ్డి తదితరులు

# సేవకులమే..పెత్తందార్లం కాదు

### దూసుకు వెళ్తున్న డబులింజన్ పాలన

### గ్రామాభివృద్ధిలో పవన్ తనదైన ముద్ర వేశారు

### ఉదయగిరి పల్లె పండుగ 3.0 బహిరంగ సభలో సిఎం చంద్రబాబు

### రూ.11,085 కోట్ల అభివృద్ధి పనులకు సిఎం, డి.సిఎం శంకుస్థాపన

**వింజమూరు (నెల్లూరు), సెప్టెంబర్ 29, ప్రభాతవార్త :** ప్రజలకు సేవ చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, తాము ప్రజలకు సేవకులమే తప్ప పెత్తందార్లం కాదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. ఉదయగిరి నియోజకవర్గం వరికుంటంపాడు మండలం, రామాపురం గ్రామంలో నిర్వహించిన పల్లె పండుగ 3.0కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో కలిసి రూ.11,085 కోట్ల విలువైన గ్రామీణ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. పల్లె పండుగ 3.0లో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో రూ.2,700కోట్లతో 6వేల కిలోమీటర్ల మేర సీసీ రోడ్లు, రూ.7,550 కోట్లతో 9,500 కిలోమీటర్ల బీటీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనం చేశారు. అలాగే పాడి రైతుల కోసం రూ.300కోట్లతో 22వేల మినీ గోకులాలు నిర్మాణం, రూ. 225కోట్లతో 50వేల ఎకరాల్లో ఉద్యాన తోటల పెంపకానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, రూ.110కోట్లతో వెయ్యి కిలోమీటర్ల మేర మ్యాజిక్ డ్రెయి న్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు >>2

# కల్కి భగవాన్ అస్తమయం

### చెన్నైలోని ఆసుపత్రిలో అస్వస్థతతో కన్నుమూత


2లో

దాదాపు ఐదు దశాబ్దాలుగా ఆధ్యాత్మిక సేవలో భక్తులకు మార్గదర్శనం చేసిన కల్కి భగవాన్

# మళ్లీ అభిశంసన నోటీసు!



### సిఇసిని తొలగించడానికి దూకుడు పెంచిన విపక్షాలు

### మూడోసారి నోటీసు ఇచ్చేందుకు రంగం సిద్ధం

### నేటి ఇండియా కూటమి భేటీలో కార్యాచారణ ఖరారు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 29:** భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలంటూ విపక్షాలు మళ్లీ దూకుడు పెంచుతున్నాయి. దీనికి సంబంధించి పార్లమెంట్‌లో మరోసారి తొలగింపు నోటీసు ఇవ్వడానికి ప్రతిపక్ష పార్టీలు సమాయత్తమవుతున్నాయి. దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్‌ఐఆర్) ప్రక్రియపై, ఎలక్షన్ కమిషన్ తీరుపై పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమవుతున్న తరుణంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. జ్ఞానేష్ కుమార్‌పై అభిశంసన లేదా తొలగింపు నోటీసు ఇవ్వడం విపక్షాలకు ఇది మూడోసారి కావడం గమనార్హం. నిజానికి గతేడాది మార్చి 12న తొలిసారిగా >>2

## 1.58 కోట్ల రేషన్ కార్డులు రద్దు? 2లో

# భారీ సైబర్ మోసం

### విశ్రాంత ఇంజినీరుకు రూ.10కోట్ల టోకరా

2లో



## జ్ఞానేశ్, మోడీ రాజీనామా చేయాలి

### సిడబ్ల్యుసి సమావేశంలో తీర్మానం

# రూ.35కే కేజి ఉల్లిపాయలు

### నేటి నుంచి విజయవాడ రైతు బజార్లలో అమలు

### ఆధార్, రేషన్ కార్డు ఆధారంగా కుటుంబానికి నెలకు 2 కేజీలు

### మంత్రులు అచ్చెన్నాయుడు, మనోహర్ వెల్లడి


2లో






మంగళవారం ఉదయగిరి సభకు హాజరైన ప్రజలు, అభిమానులు

# సేవకులమే..పెత్తందార్లంకాదు

>>చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. పల్లెల్లో అభివృద్ధి కార్యక్రమాలకు పల్లె పండుగ ద్వారా నాందీ పలుకుతున్నామని తెలిపారు. ప్రతి ఇంటి ముందు సీసీ రోడ్ వేస్తున్నామన్నారు. పట్టణ ప్రాంతాల్లో రూ.50 వేల కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభించామని,పల్లెల్లోనూ కనివినీ రీతిలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని సీఎం వెల్లడించారు. స్వచ్ఛాంధ్రస్వర్ణాంధ్రకు గ్రామాలే నాందీ పలకాలని సూచించారు. చెత్త నుంచి సంపద సృష్టించే వ్యవస్థలను ఏర్పాటు చేస్తున్నామని పేదరికం లేని గ్రామాలను తీర్చిదిద్దేందుకు.. ఆర్థిక అసమానతలు తగ్గేలా చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు.

**పల్లె వికాసంలో పవన్ చొరవ అభినందనీయం:** డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ఇప్పటికే మూడు పల్లె పండుగ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించామని చెప్పారు. ఉద్యమ స్ఫూర్తితో పవన్ కళ్యాణ్ గ్రామాలను అభివృద్ధి చేస్తున్నారని, పల్లె వికాసంలో ఆయన తనదైన ముద్ర వేశారని చంద్రబాబు అభినందించారు. రాష్ట్రంలోని 13,326 గ్రామాల్లో ఒకేసారి గ్రామసభలు నిర్వహించి అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని సీఎం తెలిపారు. రెండున్నర దశాబ్దాల తర్వాత పంచాయతీరాజ్ వ్యవస్థలోని వివిధ హోదాల్లో ఉన్న 10 వేల మంది ఉద్యోగులకు పదోన్నతులు కల్పించామని, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.4,136 కోట్లు విడుదల చేశామని చెప్పారు. లక్షకు పైగా పంటకుంటలు తవ్వించడంతో పాటు పశువుల కోసం నీటి తొట్టెలు నిర్మించామని వివరించారు. పవన్‌నేతృత్వంలోని పంచాయతీరాజ్ శాఖకు 13 జాతీయ అవార్డులు రావడం అభినందనీయమన్నారు. 2024 ఎన్నికల్లో కూటమిగా ఏర్పడిన తర్వాత ప్రధాని నరేంద్ర మోదీతో కలిసి తాను, పవన్ కళ్యాణ్ ప్రజలకు వద్దకు వచ్చి రాష్ట్రాన్ని పునర్ నిర్మిస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. నాడు హామీ ఇచ్చిన విధంగానే రాష్ట్రాన్ని నడిపిస్తున్నామన్నారు. 2024 ఎన్నికల్లో ప్రజలు వేసిన ఓటు వృథా కాలేదని, ప్రజలు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటున్నామని ముఖ్యమంత్రి అన్నారు. చెప్పిన విధంగానే డబుల్ ఇంజిన్ ప్రభుత్వం రెండేళ్లలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తోందని చెప్పారు.

**మరింత సంక్షేమం... మరింత అభివృద్ధి:** విశాఖలో 28 వేల మందికి పైగా కుటుంబాలకు ఇళ్ల పట్టాలు అందించామని, విజయవాడలో మరో 24 వేల మందికి పట్టాలు అందించనున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. త్వరలో మూడు లక్షల ఇళ్లకు శంకుస్థాపన చేయనున్నామని చెప్పారు. రాయలసీమ హార్టికల్చర్ హబ్‌కు శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. అలాగే పొట్టి శ్రీరాములు జలధార పథకం పేరుతో కేంద్ర ప్రభుత్వ సహకారంతో జల్ జీవన్ పనులను భారీ ఎత్తున ప్రారంభించబోతున్నామని ముఖ్యమంత్రి చెప్పారు.ప్రజల జీవితాల్లో వెలుగులు నింపే బాధ్యత ప్రభుత్వానిదైతే.. ప్రభుత్వానికి అండగా నిలవాల్సిన బాధ్యత ప్రజలదని సీఎం చెప్పారు.

**ఉదయగిరి సభలో ముఖ్యమంత్రి కీలక ప్రకటనలు:** పల్లె పండుగ3.0 కార్యక్రమం సందర్భంగా జరిగిన సభలో వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబు కొన్ని కీలక ప్రకటనలు చేశారు. పెద్దిరెడ్డిపల్లె రిజర్వాయర్ కాల్వ పనులకు రూ.52 కోట్లు, సోమశిల హైలెవల్ కెనాల్ ఫేజ్1 నిర్మాణానికి అవసరమైన రూ.85 కోట్లు అందిస్తామని తెలిపారు. డిఫెన్స్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌కు అవసరమైన క్లియరెన్సులు మంజూరు చేస్తామని, సీబీజీ ప్లాంట్‌కు నిరంతర విద్యుత్ సరఫరాకు సహకరిస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. సోమశిల డ్యామ్ భద్రతకు అవసరమైన నిధులు సమకూరుస్తామని వెల్లడించారు. క్రాకటూరు డిస్ట్రిబ్యూటరీకి నిధులను సమకూర్చడంతోపాటు వింజమూరు ప్రాంత పరిధిలో తాగు, సాగునీటి అవసరాల కోసం రాజవోలు ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తామని సీఎం తెలిపారు. కనిగిరి ప్రాంతంలో రోడ్ల నిర్మాణానికి.. బీటీ రోడ్ల పునర్నిర్మాణానికి వీబీజీ రామ్‌జీ గ్రాంట్ అందిస్తామని చెప్పారు. కనిగిరిలోని 189 ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు రూ.100 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. రాళ్లపాడు రిజర్వాయర్ ద్వారా ఒలేటివారిపాలెం, గూడూరు, లింగసముద్రం మండలాల్లో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. కనిగిరిబల్లిపల్లె వద్ద ట్రిపుల్‌ఐటీ ఏర్పాటుకు సహకరిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. అనంతరం కాకొల్లువారిపల్లి గ్రామంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ శ్రమదానం చేశారు. వీబీజీ రాంజీ శ్రామికుల వద్దకు వెళ్లి పొలాల మధ్య డొంక రోడ్డు పనులను ప్రారంభించారు. కాలినడకన పల్లెపండుగ అభివృద్ధి పనుల పరిశీలనించారు. అనంతరం గ్రామ సచివాలయం వద్ద ఖీవీబీ జీ రాంజీఖి శ్రామికులతో కలిసి సీఎం, డిప్యూటీ సీఎం, మాధవ్ గ్రూప్ ఫొటో దిగారు.

**ఆసక్తిగా ర్యాంప్ వాక్... ఆకట్టుకున్న ఏర్పాట్లు:** సీఎం, డిప్యూటీ సీఎంలు సభా వేదిక మీదకు రాగానే సభికుల నుంచి అపూర్వ స్వాగతం లభించింది. తమ మెళ్లో వేసుకున్న కండువాలను గాల్లో ఊపుతూ సభికులు స్వాగతం పలికారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ర్యాంప్ మీద సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ నడుస్తూ ప్రజలకు అభివాదం చేశారు. ర్యాంప్ వాక్ చేసిన సీఎం, డిప్యూటీ సీఎంలను ఫొటోలు తీసేందుకు పలువురు సభికులు ప్రయత్నించారు. తమ కుర్చీల్లో నుంచి లేచి ఫోన్లల్లో ఫొటోలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నారాయణ, ఆనం రామ్ నారాయణ రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్, నిమ్మల రామానాయుడు, బీసీ జనార్దన్ రెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సహా నెల్లూరు, ప్రకాశం జిల్లాల ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# మాది పేదలకు పట్టాభిషేకం.. వాళ్లది విధ్వంసంతో రక్తాభిషేకం

## ఉదయగిరి సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**వింజమూరు (నెల్లూరు), సెప్టెంబరు 29, ప్రభాతవార్త :** కూటమి ప్రభుత్వం పేదలకు పట్టాభిషేకం చేస్తుంటే.. మరోవైపు కొందరు విధ్వంసంతో రక్తాభిషేకం చేస్తామంటున్నారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. నాటి విధ్వంసానికి, నేటి వికాసానికి.. నాటి సంక్షోభానికి, నేటి సంక్షేమానికి మధ్య ఉన్న తేడాను ప్రజలు గమనించాలని పిలుపునిచ్చారు. పల్లె పండుగ3.0 కార్యక్రమం సందర్భంగా ఉదయగిరి నియోజకవర్గం, వరికుంటంపాడు మండలం, రామాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగసభలో గత ప్రభుత్వ తీరును ముఖ్యమంత్రి చంద్రబాబు ఎండగట్టారు. ఓటమి చెందిన తర్వాత కూడా వైసీపీ చేస్తున్న విధ్వంసాన్ని... కుట్రలను సభికులకు వివరించారు. ఈ సందర్భంగా సీఎం 2024 ఎన్నికలకు ముందు కూటమిగా ఏర్పడి ప్రధాని నరేంద్ర మోదీ, తాను, పవన్ కళ్యాణ్ ప్రజల ముందుకు వచ్చామని, రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తామని, అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చామని చెప్పారు. ప్రజలు ఎన్నడూ ఇవ్వనంత మెజార్టీని 2024 ఎన్నికల్లో కూటమికి అందించారని, 94 శాతం స్ట్రైక్‌రేట్‌తో చరిత్ర సృష్టించారని తెలిపారు. నాడు ప్రజలు అద్భుతమైన గెలుపును అందిస్తూ చేసిన విజయధ్వానాలు ఇప్పటికీ తమ చెవుల్లో మార్మోగుతూనే ఉన్నాయని అన్నారు. 2024 ఎన్నికల నాటి కంటే ఇప్పుడు ఎన్డీఏ హవా మరింత పెరిగిందని చంద్రబాబు అన్నారు. స్థానిక ఎన్నికల్లో కూటమిని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ప్రధాని మోదీ అందిస్తున్న కేంద్ర సహకారంతో తన అనుభవం, పవన్ హుషారుతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం చేసిన విధ్వంసంతో నాడు పల్లెలు కన్నీళ్లు పెట్టుకున్నాయని సీఎం విమర్శించారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో 880 కిలోమీటర్ల సీసీ రోడ్లు మాత్రమే వేస్తే.. కూటమి ప్రభుత్వం రెండేళ్లలోనే 6,500 కిలోమీటర్ల సీసీ రోడ్లు నిర్మించి చరిత్ర సృష్టించిందని తెలిపారు. **అభివృద్ధిని అడ్డుకుంటే సహించం :** వెలిగొండ ప్రాజెక్టు విషయంలో గత ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని చంద్రబాబు అన్నారు. రూ.4 వేల కోట్ల పనులు పెండింగ్‌లో ఉండగానే వెలిగొండ ప్రాజెక్టుకు రిబ్బన్ కట్ చేశారని విమర్శించారు. వెలిగొండ ఫేజ్2ను కూడా పూర్తి చేసి ఉదయగిరి నియోజకవర్గానికి నీళ్లు అందిస్తామని, మార్కాపురం జిల్లాను సస్యశ్యామలం చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని కొందరు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని... ఇక్కడుండేది నరేంద్ర మోదీ, సీబీఎన్, పవన్ కళ్యాణ్ అనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. అభివృద్ధికి అడ్డొస్తే ఎంత మాత్రం ఉపేక్షించమని సీఎం చంద్రబాబు హెచ్చరించారు.

# రూ.35కే కేజి ఉల్లిపాయలు

**అమరావతి, సెప్టెంబరు 29 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ఉల్లిపాయల ధరల పెరుగుదల నేపథ్యంలో ప్రజ లపై ఆర్థిక భారం తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ధరల స్థిరీకరణ చర్యలను మరింత పటిష్టంగా అమలు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా నేటి నుంచి రైతు బజార్ల ద్వారా కేజీ ఉల్లిపాయలను రూ.35కే ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. తొలి దశలో విజయవాడ నగరంలోని అన్ని రైతు బజార్లలో సబ్సిడీ ధరకు ఉల్లిపాయల విక్రయాలను ప్రారంభిస్తున్నట్లు మంత్రులు వెల్లడించారు. ఆధార్ కార్డు లేదా రేషన్ కార్డు ఆధారంగా ప్రతి కుటుంబానికి నెలకు 2 కేజీల చొప్పున, కేజీ రూ.35ధరకు ఉల్లిపాయలను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. నిత్యావసర సరుకుల ధరల పెరుగుదలవల్ల సామాన్య ప్రజలపై అదనపు భారంపడకుండా ప్రభుత్వం ఎప్ప టికప్పుడు మార్కెట్ పరిస్థితులను సమీక్షి స్తూ అవసరమైన చర్యలు తీసుకుంటోందని మంత్రులు తెలిపారు.

# తిరుమలేశుని దర్శనం ఓ దివ్యానుభూతి

## సింగపూర్ మంత్రి షణ్ముగంతో కలిసి శ్రీవారి సేవలో మంత్రి లోకేశ్

**తిరుమల,సెప్టెంబరు 29ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచ వ్యాప్తంగా తిరుమల చాలా ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రమని, మంగళవారం వేకువజామున స్వామివారిని దర్శిం చుకోవడం చాలా సంతోషంగా ఉందని సింగపూర్‌హోంమంత్రి షణ్ముగం పేర్కొన్నారు.తిరుమలలో ఇటీవల బ్రహ్మోత్సవాల ఏర్పాట్లన్నీ అద్భుతంగా ఉన్నాయని అభినందించారు.టిటిడి బోర్డు, అధికారులు భక్తులకు చక్కటి దర్శన విధానం అమలు చేస్తున్నారని అన్నారు. రాష్ట్రమంత్రి నారాలోకేశ్‌తో కలసి సింగపూర్‌మంత్రి షణ్ముగం మంగళవారం వేకువజామున వైకుంఠమ్ 1క్యూకాంప్లెక్స్ మీదుగా ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ మహద్వారం వద్ద టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఆలయ సాంప్రదా యంగా స్వాగతం పలికారు. తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించిన వీళ్ళు ఆనందనిలయంలో వేకువ జామున శ్రీవారి సుప్రభాతవసేవ, తోమాల, అర్చన సేవల్లో ఆలయంలోపల ఉండి వరుస సేవల్లో దర్శనం చేసుకున్నారు.మొక్కులు చెల్లించుకున్నారు.రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఇఒ రవిచంద్ర, అదనపు ఇఒ వెంకయ్యచౌదరి శ్రీవారి శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.సింగపూర్ మంత్రి షణ్ముగంతోబాటు మంత్రి లోకేశ్ తో టిటిడి బోర్డుసభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి, సి.దివాకర్‌రెడ్డి,ఎస్‌విబిసి ఛైర్మన్ బి.శ్రీధర్ వర్మ ఉన్నారు. శ్రీవారి దర్శనం ముగించుకొని ఆలయం వెలుపలకు వచ్చిన ఇరువురు భక్తులకు అభివాదం చేశారు.ఆలయం ముందు గ్యాలరీల్లో వేచివున్న చిన్నారులను మంత్రి లోకేశ్ ఆప్యాయంగా పలకరించారు.వారికిఆశీస్సులందించారు. స్వామి దర్శనం బాగా జరిగిందని షణ్ముగం పరవశులయ్యారు.

# భారీ సైబర్ మోసం

**విజయవాడ, సెప్టెంబరు 29 ప్రభాతవార్త :** విజయవాడ నగరంలో భారీ మోసం వెలుగు చూసింది. పోలీసుల పేరు చెప్పి విశ్రాంత ఇంజినీరుకు ఫోన్ చేసిన సైబర్ నేరగాళ్లు నాలుగు విడతల్లో రూ.10 కోట్లు దోచుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం వారం రోజుల క్రితం విజయవాడ గురునానక్ కాలనీకి చెందిన ఓ విశ్రాంత ఇంజినీరుకు అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్ కాల్ వచ్చింది. మీ ఫోన్ నంబరు వివిధ నేరాల్లో తమకు లభించిందని, మీపై కేసులు ఉన్నాయని చెప్పారు. ఆ తర్వాత వీడియోకాల్ చేసి, డిజిటల్ అరెస్టు చేసినట్టు బెదిరించారు.కేసుల నుంచి బయటపడాలంటే భారీగా డబ్బులు ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు. దీంతో భయపడి పోయిన విశ్రాంత ఇంజినీరు సైబర్ నేరగాళ్ల చెప్పినట్టు చేశారు. కృష్ణలంకలోని కెనరా బ్యాంకు ద్వారా నాలుగు లావాదేవీల్లో నిందితులు చెప్పిన బ్యాంకు ఖాతాల్లోకి రూ.10 కోట్లు డిపాజిట్ చేశారు. ఇంకా డబ్బులు కావాలని డిమాండ్ చేయడంతో అనుమానం వచ్చిన బాధితుడు మంగళవారం సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన విజయవాడ సైబర్ క్రైమ్ పోలీసులు సైబర్ నేరగాళ్ల బ్యాంకు ఖాతాలను స్తంభింపజేశారు. బాధితుడు ఇచ్చిన వివరాల ఆధారంగా నిందితులకు సంబంధించిన రెండు ఖాతాల్లో ఉన్న సుమారు రూ.7కోట్లు ఫ్రీజ్ చేశారు. విశ్రాంత ఇంజినీరు బ్యాంకులో తనకున్న ఫిక్స్ డ్ డిపాజిట్ చేసిన నగదు తీసిమరీ సైబర్ నేరగాళ్లకు చెల్లించినట్టు సమాచారం.

# జ్ఞానేశ్, మోడీ రాజీనామా చేయాలి

## 'సర్'ను వెంటనే నిలిపివేయాలి

## తొలగించిన ఓటర్ల పేర్లు పునరుద్ధరించాలి: ఖర్గే

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 29:** ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌పై ప్రతిపక్షాలు, సీజేపీ వంటి పార్టీలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. తాజాగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వానికి జ్ఞానేష్ కుమార్ కీలుబొమ్మగా మారారని ఆరోపించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ వివాదం వేళ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఢిల్లీలో సమావేశమైంది. ఈ సమావేశంలోనే ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారు. జ్ఞానేష్ కుమార్‌కు పదవిలో కొనసాగేందుకు హక్కు లేదని, వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. తీవ్ర విమర్శలు వస్తున్న వేళ జ్ఞానేష్ కుమార్ పదవిలో కొనసాగేందుకు హక్కు లేదని ఖర్గే పేర్కొన్నారు. ప్రధాని మోడీ జ్ఞానేష్ కుమార్‌పై ఒత్తిడి తెచ్చారని ఆరోపిస్తూ ప్రధాని కూడా నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని ఖర్గే డిమాండ్ చేశారు. సర్ ప్రక్రియ వెంటనే నిలిపేయాలని, తొలగించిన ఓటర్ల పేర్లను మళ్లీ పునరుద్ధరించాలని తీర్మానాలు చేశారు. పార్లమెంట్, కోర్టులు, వీధి పోరాటాలతో పోరాడుతామని సీడబ్ల్యూసీలో నిర్ణయాలు తీసుకున్నారు.ఓటర్ల జాబితాలో జరిగే ప్రతీ కీలక మార్పుకు సంబంధించిన పూర్తి డేటాను ప్రజలకు అందుబాటులో ఉంచాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఓటర్ల జాబితా నుంచి పేరు తొలగించిన వారికి పూర్తి సమాచారం ఇవ్వడంతో పాటు, తమ పేర్లను తిరిగి నమోదు చేసుకునేందుకు అప్పీల్ చేసే అవకాశం కల్పించాలని కోరింది. రాజకీయ పార్టీలకు ఓటర్ల జాబివతా, అవసరమైన సంబంధిత డేటాను సులభంగా అర్థం చేసుకునే ఫార్మాట్‌లో సకాలంలో అందించాలని ఖర్గే డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా, ఎన్నికల ప్రక్రియలో తీవ్రమైన అక్రమాలు, అసమానతలకు ఆధారాలు బయటపడితే వాటిపై స్వతంత్రంగా, కాలపరిమితిలో విచారణ జరపాలని కోరారు.ఎన్నికలకు సంబంధించిన కీలక డేటా, నిర్ణయాల విషయంలో సమాచారం దాచి పెట్టారనే అవకాశం లేకుండా మరింత పారదర్శకత ఉండాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది.

# మళ్లీ అభిశంసన నోటీసు!

>> విపక్షాలు రెండు సభల్లోనూ నోటీసులు ఇచ్చాయి. రాజ్యసభలో 63 మంది, లోక్‌సభలో 130 మంది ఎంపీలు సంతకాలు చేసిన ఈ నోటీసులను రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాలు తిరస్కరించారు. ఆ తర్వాత ఏప్రిల్ 24న వివిధ పార్టీలకు చెందిన 73 మంది ఎంపీల సంతకాలతో రాజ్యసభలో మరో నోటీసు ఇచ్చారు. అందులో కుమార్‌పై తొమ్మిది తీవ్రమైన ఆరోపణలు చేస్తూ, ఆయన నిరూపితమైన అపచారం (ప్రూవ్‌డ్ మిస్‌బిహేవియర్) చేశారని పేర్కొన్నారు. ఈ నోటీసు ఇప్పటికీ రాజ్యసభ ఛైర్మన్ పరిశీలనలోనే పెండింగ్‌లో ఉంది. ఇదిలా ఉండగా, ఇప్పుడు మూడోసారి రెండు సభల్లోనూ కొత్తగా నోటీసులు ఇవ్వాలని విపక్షాలు ప్లాన్ చేస్తున్నాయి. ఈసారి ఎలక్షన్ కమిషన్ లోపల కమిషనర్ల మధ్య వచ్చిన విభేదాలు, ఎస్ఐఆర్ ప్రక్రియపై వ్యక్తమైన అభ్యంతరాల ఆధారంగా తయారుచేసిన కొత్త నివేదికను ప్రధాన అస్త్రంగా మార్చుకోనున్నాయి. మరోవైపు జ్ఞానేష్ కుమార్‌తో పాటు ఎలక్షన్ కమిషన్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళనలు మిన్నంటాయి. ఢిల్లీ, శ్రీనగర్, పట్నా, రాంచీ, జైపూర్ వంటి ప్రధాన నగరాల్లో ప్రతిపక్షాలు నిరసన ప్రదర్శనలు చేపట్టాయి. ఢిల్లీలోని ఎలక్షన్ కమిషన్ హెడ్‌క్వార్టర్స్‌కు మార్చ్‌గా వెళ్తున్న ఆందోళనకారులపై భద్రతా సిబ్బంది వాటర్ క్యానన్లను ఉపయోగించారు. సెప్టెంబర్ 25న కాంగ్రెస్ ఆధ్వర్యంలో పట్నా, ఛండీగఢ్ సహా పలు రాష్ట్రాల రాజధానుల్లో పెద్ద ఎత్తున నిరసనలు జరిగాయి. సీఈసీ వెంటనే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ అంశంపై కాంగ్రెస్ తీవ్రంగా స్పందిస్తోంది. నేడు కాంగ్రెస్ అధినేత మల్లికార్జున ఖర్గే ప్రత్యేకంగా కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషిలు ఎస్ఐఆర్ ప్రక్రియ, కొత్త ఓటర్ల నమోదుకు వాడే ఫామ్6 మార్పులు, ఓటర్ల పేర్ల తొలగింపులు చేరికలు, డిజిటల్ డేటాబేస్ నిర్వహణపై పలు అనుమానాలు వ్యక్తం చేశారని ఖర్గే తెలిపారు. ఇది చాలా తీవ్రమైన అంశమని, దీనిపై వెంటనే చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ పట్టుబడుతోంది. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, జైరామ్ రమేష్, కేసీ వేణుగోపాల్ వంటి అగ్రనేతలు ఈ సమావేశంలో పాల్గొని భవిష్యత్ కార్యాచరణను ఖరారు చేయనున్నారు. అంతేకాకుండా, సెప్టెంబర్ 30న న్యూఢిల్లీలో సుమారు 21 విపక్ష పార్టీలు భేటీ అయి సంయుక్త వ్యూహాన్ని, కొత్త తొలగింపు నోటీసు రూపురేఖలను చర్చించనున్నాయి. మరోవైపు విపక్షాలు చేస్తున్న ఆరోపణలను ఎలక్షన్ కమిషన్ గట్టిగా ఖండించింది. కమిషన్ సభ్యుల మధ్య అభిప్రాయభేదాలు ఉన్నంత మాత్రాన సంస్థ పనితీరు దెబ్బతిన్నట్లు కాదని స్పష్టం చేసింది. రాజ్యాంగబద్ధ సంస్థల్లో భిన్నాభిప్రాయాలు సాధారణమేనని, ఎస్ఐఆర్‌కి సంబంధించిన నిర్ణయాలన్నీ ముగ్గురు కమిషనర్ల ఏకగ్రీవ ఆమోదంతోనే జరిగాయని పేర్కొంది. ఫామ్6లో చేసిన మార్పులను సుప్రీంకోర్టు కూడా సమర్థించిందని, చట్టబద్ధమైన నిబంధనల ప్రకారమే నిర్ణయాలు తీసుకుంటున్నామని తెలిపింది. అయితే, గత 10 నెలల కాలంలో ఓటర్ల జాబితాలు, రిజిస్ట్రేషన్ల విధానం, డిజిటల్ వ్యవస్థలపై ఇతర కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషిలు కనీసం 14 అధికారిక అభ్యంతరాలు వ్యక్తం చేశారంటూ ఓ పత్రిక ప్రచురించిన కథనమే ఈ రాజకీయ దుమారానికి కారణమైంది. విపక్షాలు ఈకథనాన్ని అడ్డుపెట్టుకుని ఈసీపై విరుచుకు పడుతుండగా, అధికార బీజేపీ మాత్రం ఈసీ చర్యలను సమర్థిస్తూ సంస్థల్లో భిన్నాభిప్రాయాలు ఉండటం సహజమేనని పేర్కొంది.





తిరుపతిలో నిర్మాణభవనం వద్ద క్రేన్‌పడిపోయిన దృశ్యం

# క్రేన్ పడి ముగ్గురు ఒడిశా కూలీలు మృతి

**తిరుపతిక్రైమ్,సెప్టెంబరు 29ప్రభాతవార్త:** తిరుపతి నగరంలో మంగళవారం మధ్యాహ్నం నిర్మాణంలో ఉన్న భవనం క్రేన్ కూలి ముగ్గురు కూలీలు దుర్మరణం చెందారు. ఈ సంఘటనతో తిరుపతిలో కలకలం రేగింది. తిరుపతినగరంలో ఆర్టీసి బస్టాండ్‌కు సమీపంలోని టిటిడి శ్రీనివాసంకు కూతవేటు దూరంలో ఓ ప్రైవేట్ హోటల్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. పనులు చేస్తున్న సమయంలో ఒక్కసారిగా భారీ క్రేన్ ఒక పక్కకు ఒరిగి లోతైన గుంతలోపడి పోవడంతో దానిక్రింద పనిచేస్తున్న ముగ్గురు కార్మికులు అక్కడికక్కడే మృతి చెందారు. ఒరిస్సాకు చెందిన రామారావు(45) వలస కూలీ,సైట్ ఇంజనీర్ శ్రీకాకుళంకు చెందిన సందీప్ (35)తోబాటు వాచ్‌మెన్ గంగయ్య (40)ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో గాయపడిన ఇద్దరినీ తిరుపతి రుయాసుపత్రికి తరలించారు .పోలీసులు భారీ క్రేన్ ను తొలగించే పనులు చేపట్టారు. తీవ్రంగా గాయపడిన వారిలో బీహార్ కు చెందిన షేక్ ఫరహాన్,నౌషాన్ క్రేన్ ఆపరేటర్స్,తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం ఆర్ మల్లవరం కు చెందిన మురగయ్య కూలీ ఉన్నారు. కాగా ప్రమాద స్థలాన్ని టిడిపి ఇన్‌ఛార్జి జెబి శ్రీనివాసులు సందర్శించారు.

భవన నిర్మాణ పనులు చేస్తూ చెట్లు తొలగించే ప్రయత్నంలో క్రేన్ కూలిపడి ముగ్గురు మృతిచెందడం బాధాకరమని అన్నారు. ఘటనకు సంబంధించిన వివరాలు అధికారులు, పోలీసులను అడిగి తెలుసుకున్నారు. ఘటన పై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# 1.58 కోట్ల రేషన్ కార్డులు రద్దు?

## అక్టోబరు 1 నుంచి అమల్లోకి

## ఇకెవైసితో 3 నెలల్లోగా పునరుద్ధరణకు అవకాశం

## కేంద్ర ప్రభుత్వం తాజా నిర్ణయం





**న్యూఢిల్లీ, సెప్టెంబరు 29:** ప్రజా పంపిణీ వ్యవస్థ (పిడిఎస్)లో ఉన్న రేషన్ కార్డుల ప్రక్షాళనలో భాగంగా కేంద్ర ప్రభుత్వం మరో సంచలన నిర్ణయం తీసుకుంది. బోగస్, అర్హత లేని లబ్ధిదారులను తొలగించే చర్యల్లో భాగంగా అనూహ్య నిర్ణయాన్ని అక్టోబరు 1 నుంచి అమలు చేయబోతోంది. ఆరు నెలలుగా రేషన్ సరుకులు తీసుకోని లబ్ధిదారుల కార్డులను తాత్కాలికంగా నిలిపివేయబోతున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా వచ్చే నెలలో దాదాపు 1.58 కోట్ల లబ్ధిదారుల రేషన్ కార్డుల అర్హతలను తాత్కాలికంగా నిలిపివేయడానికి కేంద్రం సన్నాహాలు చేస్తున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. అయితే, లబ్ధిదారుల పేర్లను వెంటనే డేటాబేస్ నుండి పూర్తిగా తొలగించబోరని తొలుత ఆ కార్డులను తాత్కాలికంగా డిసేబుల్ చేస్తారని కేంద్ర ఆహార మంత్రిత్వ శాఖకు చెందిన ఒక సీనియర్ అధికారి వివరించారు. కార్డులు డిసేబుల్ అయిన లబ్ధిదారులు తాము నిజమైన అర్హులమేనని నిరూపించుకోవడానికి 3 నెలల సమయం ఇవ్వనున్నారు. ఈ మూడు నెలల వ్యవధిలో క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేసుకొని ఇకెవైసి ప్రక్రియను పూర్తి చేస్తే ఆ రేషన్ కార్డులను మళ్లీ యాక్టివేట్ చేయనున్నట్లు తెలుస్తోంది. గత ఆరునెలలుగా ఎలాంటి బియ్యం లేదా ఆహార ధాన్యాలు పొందని కార్డులను ప్రభుత్వం సైలెంట్ రేషన్ కార్డులుగా వర్గీకరించి ఈ చర్యలకు శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది.

డేటాబేస్ ప్రక్షాళన, స్మార్ట్‌పిడిఎస్ నకిలీ, డూప్లికేట్, మరణించిన వ్యక్తుల పేర్లు, అనర్హుల కారణంగా జరుగుతున్న అక్రమాలను గుర్తించి వాటిని అరికట్టేందుకు ప్రభుత్వం ఈ చర్యలకు సిద్ధమైంది. ఆధార్ అనుసంధానం, డిజిటలైజేషన్, ఇకెవైసి వంటి విధానాలను ఉపయోగించి పిడిఎస్ డేటాబేస్‌ను ఇప్పటికే ప్రక్షాళన చేస్తున్నారు. ఈక్రమంలో నవంబరు 2024 నాటికి డిజిటైజేషన్, బయోమెట్రిక్ సీడింగ్, ఇకెవైసి ద్వారా దేశవ్యాప్తంగా దాదాపు 5.8 కోట్ల బోగస్ రేషన్ కార్డులను తొలగించినట్లు ఆహార శాఖ తెలిపింది. ఈ చర్యల వల్ల రేషన్ ధాన్యాల వృథా తగ్గుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అయితే ఈ విధానంపై పలువురు నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# కల్కి భగవాన్ అస్తమయం

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త:** దేశ,విదేశాల భక్తులను తన ఆధ్యాత్మిక శక్తితో ఆకట్టుకున్న కల్కి భగవాన్ (77) మంగళవారం సాయంత్రం చెన్నైలోని ఓ ఆస్పత్రిలో తుది శ్వాస విడిచినట్లు సమాచారం అందింది. ఆయన మృతదేహాన్ని వరదయ్యపాళెం సమీపంలో ఏకమ్ ఆలయంలో నిర్మించిన హిరణ్యగర్భాలయంలో ఖననం చేయనున్నట్లు తెలిసింది. మూడు రోజుల పాటు ఆయన మృతదేహాన్ని భక్తుల దర్శనార్థం ఏర్పాటు చేసినట్లు తెలిసింది. వృత్తిరీత్యా ఉపాధ్యా యుడైన కల్కిభగవాన్ పేరు విజయ్‌కుమార్ యోగా సాధనతో అద్భుతాలు సృష్టించారు. 1994 వరకు కుప్పంలో సత్యలోకం పేరుతో ఆశ్రమాన్ని నిర్వహించారు. 1980లో కుప్పం చేరిన ఆయన 1994 వరకు అక్కడే తన కార్యక్రమాలను సాగించారు. 1994లో శ్రీకాళహస్తి సమీపంలోని సత్యవేడు నియోజకవర్గం వరదయ్యపాళెం సమీపంలో గల ఉబ్బలమడుగు దారితో భూములను కొనుగోలు చేసి ఆశ్రమాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఇక్కడ నుండి తమ యోగా కార్యక్రమాలతో దేశ,విదేశీ భక్తులను ఆకర్షించారు. ఆయన దర్శనానికి ప్రతి రోజూ వేలాది మంది తరలివచ్చేవారు. తరువాత వరదయ్యపాళెం సమీపంలోని చిన్నపాండూరు వద్ద ఏకమ్ ఆలయాన్ని పాలరాతితో నిర్మించారు. ఆయన దర్శనం కోసం సినీనటులు, వాణిజ్య ప్రముఖులు, రాజకీయ నాయకులు, మేధావులుక్యూ కట్టేవారు. 6 సంవత్సరాలుగా ఆయన అనారోగ్యంతో కనుమరుగయ్యారు. కల్కి కార్యక్రమాలను ఆయన తనయుడు క్రిష్ణాజీ, దాసాజీ, కోడలు ప్రీతీజీ పర్యవేక్షిస్తున్నారు. మంగళవారం రాత్రి భక్తులు ఆశ్చర్యపోయేటట్లు కల్కి భగవాన్ ఇక లేరనే వార్త దిగ్భ్రాంతికి గురి చేసింది.మంగళవారం రాత్రికే ఆయన అభిమానులు,భక్తులు వరదయ్యపాళెంలోని ఏకం ఆశ్రమానికి చేరుకుంటున్నారు.

## వారం - వర్జ్యం

**30-09-2026, బుధవారం**
**శ్రీ పరాభవ నామ సంవత్సరం,**
**భాద్రపద మాసం, దక్షిణాయణం**
**వర్ష ఋతువు, కృష్ణపక్షం, చిత్త కార్తె**
తి. చవితి మ.2.55, న.భరణి ఉ.7.36
వ.సా.6.49 - రా.8.19
దు.ఉ.11.33 - మ.12.21
రాహు. మ.12.00-మ.1.30
శుభ స. లేదు

## వార్తాఫలం

**మేషం :** ఉన్నత స్థానంలోని వారికి సలహాదారునిగా రాణించే సూచనలు. మిత్రులతో కలిసి ఇష్టాగోష్టిని సాగిస్తారు.

**వృషభం:** మొండి బాకీలను రాబట్టుకోవడానికి చేసే ప్రయత్నాలు కొంత వరకు ఫలిస్తాయి. వాహన యోగం.

**మిథునం :** అవాంతరాలను అధిగమించి కార్యవిజయాలను సాధిస్తారు. సహోదరీ వర్గంతో కలిసి సంభాషణలు సాగిస్తారు.

**కర్కాటకం :** వ్యాపార విస్తరణ అంశాలు కలిసి వస్తాయి. టెండర్స్ అనుకూలిస్తాయి. కార్య విజయాలను సాధిస్తారు.

**సింహం :** కోపాన్ని ఆవేశాన్ని మీ అదుపులో ఉంచుకొనగలిగితే మంచి ఫలితాలనే చాలా వరకు సాధించగలుగుతారు.

**కన్య :** అనాలోచిత నిర్ణయాలు చోటు చేసుకుంటాయి. ఆదాయ వ్యవహారాలు బాగుంటాయి. టెండర్స్ అనుకూలిస్తాయి.

**తుల:** గంటలు గంటలుగా ప్రతి విషయంలోనూ ఆలోచించే విధానాలకు స్వస్తి చెబుతారు. వాహనయోగం.

**వృశ్చికం :** పొరపాటు సమాచారాన్ని విని నిజమని నమ్ముతారు. దుందుడుకుతనం వల్ల నష్టమే తప్ప లాభం ఏర్పడదు.

**ధనుస్సు :** అనుకూలమైన ఉత్తర్వులను అందుకుంటారు. సంతాన పురోగతి బాగుంటుంది. అధిక ధనవ్యయం.

**మకరం :** విధి నిర్వహణలో సంతృప్తిని వ్యక్తపరుస్తారు. రిజిస్ట్రేషన్ పనులు సానుకూల పడతాయి.

**కుంభం :** ఆధునిక కాలానికి తగిన విధంగా వ్యవహార శైలిలో కొన్ని మార్పులను చేయాలని భావిస్తారు.

**మీనం :** ఓదార్పు కలిగే సంఘటనలు చోటు చేసుకుంటాయి. అభిప్రాయ భేదాలు తొలగిపోతాయి.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# అమ్మకానికి ఓ ఊరు..

## నీళ్లిస్తే చాలు.. 'తులసి'ని ఇచ్చేస్తాం

## ఊరి ప్రవేశద్వారం వద్ద వేలాడుతున్న బ్యానర్లు

**సోలాపూర్, సెప్టెంబరు 29:** అది మహారాష్ట్రలోని ఓ అందమైన పల్లెటూరు. కానీ ఆ ఊరి రాత మాత్రం దారుణంగా మారిపోయింది. తాగడానికి గుక్కెడు నీళ్లు దొరక్క, పంటలు పండక, కనీసం మూగజీవాలకు తాగునీరు కూడా అందక ఆ ఊరి ప్రజలు పడుతున్న నరకం అంతా ఇంతా కాదు. సంవత్సరాల తరబడి ప్రభుత్వాలు మారుతున్నా, హామీలు వస్తున్నా తమ ఊరి నీటి గోస మాత్రం తీరడం లేదని ఆ గ్రామస్థులు తీవ్ర ఆగ్రహంతో ఊగిపోయారు. అధికారుల కళ్లు తెరిపించేందుకు ఏకంగా తమ ఊరినే అమ్మకానికి పెట్టామంటూ సరికొత్త, వినూత్న నిరసనకు తెరతీశారు. "మా ఊరు అమ్మకానికి ఉంది. దీని ధర కేవలం నీళ్ల మాత్రమే" అంటూ ఊరి ప్రవేశ ద్వారాల వద్ద బ్యానర్లు కట్టి వారు చేసిన నిరసన ఇప్పుడు దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. అలంకారప్రాయంగా మారిన సాగునీటి కాలువలు మహారాష్ట్ర సోలాపూర్ జిల్లాలోని "తులసి" గ్రామంలో సుమారు 7,000 మంది జనాభా నివసిస్తున్నారు. ఈ ఊరికి కూతవేటు దూరంలోనే సినామధా ఎత్తిపోతల నీటిపారుదల పథకం కాలువలు వెళుతున్నాయి. కానీ ఆశ్చర్యకరంగా ఆ కాలువల్లో మాత్రం చుక్క నీరు పారడం లేదు. గత 26 సంవత్సరాలుగా ఈ ప్రాజెక్టుకు సంబంధించిన కేవలం 800 మీటర్ల తవ్వకం పనులు మాత్రమే అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఆ కొద్దిపాటి పనులు పూర్తి చేస్తే తమ ఊరి నీటి కష్టాలు శాశ్వతంగా తీరిపోతాయని గ్రామస్థులు వాపోతున్నారు.

అధికారుల నిర్లక్ష్యం వల్ల కాలువలు దగ్గర్లోనే ఉన్నా తమ గొంతులు మాత్రం ఎండుకుపోతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ట్యాంకర్ల నీళ్లే గతి ఎండిపోయిన బావులు, చెరువులు ఈ గ్రామం లోని 14 చెరువులు, బావులు పూర్తిగా ఎండిపోయి నెర్రెలు బారాయి. దీంతో గ్రామం పూర్తిగా వాటర్ ట్యాంకర్లపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఈ వర్షాకా లంలో సరిగా వర్షాలు కురవకపోవడంతో పరిస్థితి మరింత దిగజారింది. తాగునీరు లేక వ్యవసాయం, పశుపోషణ పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ నీటి కష్టాల వల్ల ఊర్లో యువకులకు పెళ్లిళ్లు కూడా కావడం లేదని సర్పంచ్ శరద్ మోరే ఆవేదన వ్యక్తం చేశారు.

# దేశాభివృద్ధిలో వచ్చే 20ఏళ్లు అత్యంత కీలకం

• ప్రభుత్వ వ్యవస్థలు, సంస్థల్లో విప్లవాత్మక మార్పులు రావాలి • పాలనలో కొత్త ఒరవడి... నైపుణ్యాలే అభివృద్ధికి చోదకశక్తి • టెక్నాలజీతో పాలనా విధానాలు మరింత సరళీకృతం • పౌరసేవల్లో నాణ్యతే సామర్థ్యాల పెరుగుదలకు గీటురాయి • మిషన్ కర్మయోగి దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు • ఉద్యోగుల కెపాసిటీ బిల్డింగ్‌లో ఎపికి మొదటి స్థానం, తదుపరి స్థానాల్లో కర్ణాటక, ఒడిశా • సిఎం చేతుల మీదుగా అవార్డులు అందుకున్న మూడు రాష్ట్రాల అధికారులు



మిషన్ కర్మయోగి దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ తొలి సదస్సులో ప్రసంగిస్తున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ, సెప్టెంబరు 29 ప్రభాతవార్తప్రతినిధి:** దేశాభివృద్ధిలో వచ్చే 20 ఏళ్లు అత్యంత కీలకమని, ఈ కాలంలో ప్రభుత్వ వ్యవస్థలు, సంస్థల్లో విప్లవాత్మక మార్పులు రావాల్సిన అవసరం ఉందని ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. దేశ ప్రజల ఆకాంక్షలు వేగంగా మారుతున్నాయని, వాటికి అనుగుణంగా ప్రభుత్వ పాలనా విధానాలు, ప్రక్రియలు, ఉద్యోగుల నైపుణ్యాలు కూడా నిరంతరం మెరుగుపడాలని పేర్కొన్నారు. సాంకేతికతను వినియోగించుకోవడంతో పాటు పాత విధానాలు, అనవసర నిబంధనలను సరళీకరించి పాలనను ప్రజలకు మరింత చేరువ చేయాలని సూచించారు. విజయవాడలోని అంబేద్కర్ కళావేదికలో కెపాసిటీ బిల్డింగ్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాధన శృంఖల2026 మిషన్ కర్మయోగి ప్రాంతీయ సదస్సును ముఖ్యమంత్రి జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు, ఒడిశా, పుదుచ్చేరి రాష్ట్రాలకు చెందిన అధికారులు, శిక్షణ సంస్థల ప్రతినిధులు ఈ రెండు రోజుల సదస్సుకు హాజరయ్యారు. ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్యాల పెంపు, పరిపాలనా నైపుణ్యాల మెరుగుదల, ప్రభుత్వ శిక్షణ సంస్థల సామర్థ్య నిర్మాణంపై ఈ సదస్సులో ప్రధానంగా చర్చించారు. ప్రభుత్వ శిక్షణ సంస్థలు కేవలం ఉద్యోగులకు కోర్సులు నిర్వహించే కేంద్రాలుగా ఉండకూడదని సీఎం అన్నారు. సవాళ్లను పరిష్కరించడంలో ఉద్యోగుల నైపుణ్యాలను పెంచే సంస్థలుగా అవి మారాలని సూచించారు. ఉద్యోగులకు శిక్షణ ఇవ్వడమే కాకుండా, ఆ శిక్షణ వల్ల పాలనలో ఎలాంటి మార్పు వచ్చిందో, ప్రజలకు అందే సేవల్లో ఎలాంటి మెరుగుదల కనిపించిందో కూడా కొలవాల్సిన అవసరం ఉందన్నారు. కోర్సులు పూర్తి చేసి సర్టిఫికెట్లు పొందడం మాత్రమే కెపాసిటీ బిల్డింగ్ కాదని, నేర్చుకున్న అంశాలను ఉద్యోగులు తమ విధుల్లో ఎంతవరకు అమలు చేస్తున్నారు. ప్రజలకు అందే సేవల నాణ్యత ఎంత మెరుగుపడుతోందన్న అంశమే ప్రామాణికత అని సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

**కెపాసిటీ బిల్డింగ్‌లో ఎపికి మొదటి స్థానం:** ప్రభుత్వ ఉద్యోగుల కెపాసిటీ బిల్డింగ్‌లో ఆంధ్రప్రదేశ్ అత్యుత్తమ రాష్ట్రంగా మొదటి స్థానాన్ని సాధించింది. ఈ అవార్డును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్ కుమార్, ఎపిఎస్‌డిపిఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వీఆర్ అలపర్తి అందుకున్నారు. రెండో స్థానంలో నిలిచిన కర్ణాటక, మూడో స్థానంలో నిలిచిన ఒడిశా రాష్ట్రాలకు కూడా సిఎం అవార్డులు అందజేశారు. మిషన్ కర్మయోగి కింద ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 7.89 లక్షల మంది ఉద్యోగులు ఐగాట్‌లో నమోదు అయ్యారని సిఎం తెలిపారు. రాష్ట్రంలో రెండు కోట్లకు పైగా కోర్సులు పూర్తి చేసి దేశంలోని రాష్ట్రాల్లో ఎపి మొదటి స్థానంలో నిలిచిందన్నారు. రెండు కోట్ల సర్టిఫికెట్ల కంటే నేర్చుకున్న అంశాలే కీలకమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు అందే సేవల్లో మార్పుగా ఈ అంశాలు కనిపించాలని అని సిఎం అన్నారు. శిక్షణతో ఓ రెవెన్యూ అధికారి పౌరుడి సమస్యను వేగంగా పరిష్కరించటం, ఉపాధ్యాయుడు తరగతి గదిలో మెరుగైన బోధన అందించటం.. పోలీసు అధికారి మరింత మానవీయంగా స్పందించటం ముఖ్యమని స్పష్టం చేశారు.

**టెక్నాలజీ మారింది.. పాలనా విధానాలు మారాలి:** భారత్‌లో సాంకేతిక పరిజ్ఞానం వేగంగా మారుతున్నా, కొన్ని చోట్ల పాత నిబంధనలు, విధానాలు కొనసాగుతున్నాయని సిఎం చంద్రబాబు అన్నారు. కంప్యూటర్లు వచ్చినా అనవసరమైన పేపర్‌వర్క్ కొనసాగడం, దరఖాస్తులను డిజిటల్ చేసినా అనేక అనుమతులు అవసరం కావడం, ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వచ్చినా పౌరులను కార్యాలయాలకు రప్పించడం వంటి విధానాలను మార్చాల్సిన అవసరం ఉందన్నారు. పాత విధానాన్ని డిజిటలైజ్ చేయడం మాత్రమే ఆధునిక పాలన కాదని, మొత్తం ప్రక్రియను మార్పు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రగతిని నిరోధించే అనవసర నిబంధనలను సరళీకరించాలన్నారు.

**శాఖల మధ్య సమాచార మార్పిడి కీలకం:** ప్రభుత్వ శాఖల మధ్య నిరంతరాయంగా సమాచార పంపిణీ జరగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. సమాచార వ్యవస్థలు పరస్పరం అనుసంధానమై ఉంటే సమస్యలను సంక్షోభంగా మారక ముందే గుర్తించి పరిష్కరించే అవకాశం ఉంటుందన్నారు. సాంకేతికత, విధానాలు, ప్రక్రియలు, ఉద్యోగుల సామర్థ్యాలను సమన్వయం చేసినప్పుడే వేగవంతమైన నిర్ణయాలు తీసుకోవచ్చని చెప్పారు. 1978లో సంస్కరణలు ప్రారంభించిన చైనా కొన్ని దశాబ్దాల్లోనే తన సామర్థ్యాలను భారీగా పెంచుకుని ఆర్థికంగా ఉన్నతస్థాయికి చేరిందని సిఎం పేర్కొన్నారు. భారత్‌లోనూ అపారమైన అవకాశాలు, వనరులు ఉన్నాయని, ప్రపంచవ్యాప్తంగా భారతీయులు తమ నైపుణ్యాలను నిరూపించుకున్నారని అన్నారు. ఆర్థిక సంస్కరణల తర్వాత భారతీయుల ఆకాంక్షలు మారాయని, వాటికి అనుగుణంగా ప్రభుత్వ వ్యవస్థలు కూడా మారాలని సూచించారు. ప్రపంచంలోని ప్రముఖ సంస్థలకు భారతీయులు నాయకత్వం వహిస్తున్నారని, ఆ సామర్థ్యాలను దేశాభివృద్ధికి వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ శిక్షణ సంస్థలు భవిష్యత్తు సవాళ్లను ముందుగానే అంచనా వేసి ఉద్యోగులను సిద్ధం చేయాలని సీఎం సూచించారు. రాష్ట్రంలోని గుర్తించిన 61 శిక్షణ సంస్థలను ఉన్నతి కింద ఐగాట్‌లో అనుసంధానించామని తెలిపారు. అమరావతిలో గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ఏర్పాటు దిశగా కూడా పనిచేస్తున్నామని చెప్పారు.

**ఎపికి కెపాసిటీ బిల్డింగ్ పాలసీ:** ఆంధ్రప్రదేశ్ కెపాసిటీ బిల్డింగ్ పాలసీని ప్రవేశపెట్టి, రాష్ట్రంలోని 38 శాఖలకు కెపాసిటీ బిల్డింగ్ ప్రణాళికలు రూపొందించినట్లు సిఎం చంద్రబాబు తెలిపారు. భవిష్యత్తులో ఉద్యోగుల సామర్థ్యాలు, నిరంతర అభ్యసనకు కెరీర్ అభివృద్ధిలో తగిన గుర్తింపు ఇవ్వాలని సూచించారు. ప్రతి ఉద్యోగికి ఎదిగే అవకాశం, ప్రతి సంస్థకు మెరుగుపడే అవకాశం, ప్రతి పౌరుడికి దాని ప్రయోజనం అందేలా వ్యవస్థను తీర్చిదిద్దాలన్నారు. ప్రభుత్వం నియంత్రించే వ్యవస్థగా కాకుండా ప్రజలను సాధికారత వైపు నడిపే వ్యవస్థగా మారాలని సీఎం అన్నారు. ప్రజలకు జ్ఞానం, మౌలిక సదుపాయాలు, సాంకేతికత, అవకాశాలను అందించి వారు తమ భవిష్యత్తును తామే నిర్మించుకునేలా చేయడం ప్రభుత్వ బాధ్యతగా పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధి, సంపద సృష్టి దిశగా ప్రభుత్వ యంత్రాంగం సమాయత్తం కావాలని, పి4 వంటి కార్యక్రమాల ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరిచే అవకాశం ఉందన్నారు. మిషన్ కర్మయోగి ద్వారా ఉద్యోగులు కేవలం కోర్సులు పూర్తి చేయడం కాకుండా, నేర్చుకున్నదాన్ని విధుల్లో అమలు చేయాలని సూచించారు. లెర్నింగ్ వర్క్‌ఫోర్స్ నుంచి లెర్నింగ్ నేషన్‌గా భారత్‌ను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. 2047 వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాలకు ప్రతీ పౌరుడి జీవన ప్రమాణాలు పెంచేందుకు ప్రభుత్వ యంత్రాంగాలు కలిసి పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కెపాసిటీ బిల్డింగ్ కమిషన్ చైర్ పర్సన్ రాధా చౌహాన్, సభ్యురాలు ఆల్కా, ఆ సంస్థ కార్యదర్శి జగదీప్ గుప్తా, ఎపి ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి పీయుష్ కుమార్, మానవ వనరుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ జనరల్ కాటమనేని భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## అమరావతిలో మరో కీలక వైద్య సంస్థ

**విజయవాడ, సెప్టెంబరు 29 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని అమరావతిలో మరో కీలక వైద్య సంస్థ ఏర్పాటు కానుంది. తుళ్లూరు, అనంతవరం పరిధిలో రెయిన్‌బో చిల్డ్రన్స్ ఆస్పత్రి నిర్మాణానికి సంబంధించి ఒప్పందం పూర్తయింది. ఈ మేరకు రెయిన్‌బో చిల్డ్రన్స్ మెడికేర్, ఎపిసిఆర్‌డిఎ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. అమరావతి పరిధిలోని రెండు ఎకరాల స్థలంలో 250 పడకల సామర్థ్యంతో ఈ ఆస్పత్రిని నిర్మించనున్నారు. రెయిన్‌బో చిల్డ్రన్స్ ఆస్పత్రి ఏర్పాటుతో అమరావతి, తుళ్లూరు, అనంతవరం పరిసర ప్రాంతాలతో పాటు రాజధాని ప్రాంత ప్రజలకు చిన్నారుల వైద్యం మరింత అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

## నూతన డిహెచ్‌గా డాక్టర్ వెంకటరమణ

రాష్ట్ర ప్రజారోగ్య శాఖ (డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్) ఇంఛార్జి సంచాలకులుగా డాక్టర్ వెంకట రమణ నియమించాలని ప్రభుత్వ నిర్ణయించింది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి మంగళవారం తెలిపిన ఆమోదం మేరకు వెంకటరమణ డిహెచ్‌గా అధికార బాధ్యతలు స్వీకరించనున్నారు. గత 33 నెలల నుంచి డిహెచ్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్‌గా సేవలు అందించిన డాక్టర్ కె. పద్మావతి బుధవారం పదవీ విరమణ చేయనున్నారు. అడిషనల్ డైరెక్టర్ (ఎన్ఎల్ఇపి) హోదాలో పద్మావతి డిహెచ్ ఇంచార్జిగా వ్యవహరించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖలో ఆమె 37 ఏళ్ల పాటు వివిధ స్థాయిల్లో పనిచేశారు. పోస్టు భర్తీ కోసం ఏడుగురు అధికారుల పేర్లను మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు మంత్రిత్వ శాఖ సూచించింది. వీరిలో ఇద్దరిపై నమోదైన ఆరోపణలపై విచారణ సాగుతోంది. మరో ఇద్దరికి కీలకమైన డీఎంఅండ్ హెచ్ఓగా పనిచేసిన అనుభవంలేదు. ఒకరు కేవలం మూడు నెలలు మాత్రమే డిఎం అండ్ హెచ్ఓగా (అదనపు బాధ్యతలు) పనిచేశారు. మరొకరు జూన్ మాసంలో పదవీ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో డిపిహెచ్‌గా వెంకటరమణ నియామకం జరిగింది. ఈయన ప్రస్తుతం డిపిహెచ్ కార్యాలయంలో అదనపు డైరెక్టర్ (డిసీజ్ కంట్రోల్ ప్రోగ్రాం)గా పనిచేస్తున్నారు.

## రెడ్డిగూడెంలో విద్యుద్ఘాతంతో ఇద్దరు మృతి

ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెం మండలం పరిధిలో విద్యుత్ షాక్‌తో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. ఈ విషాద ఘటన మంగళవారం రాఘవాపురం సమీపంలోని ఒక మామిడి తోటలో చోటుచేసుకుంది. రాఘవాపురం గ్రామం సమీపంలోని మామిడి తోటలో విద్యుత్ వైర్లను దొంగిలించడానికి వెళ్లిన సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. అక్కడ విద్యుత్ లైన్ల నుంచి తీవ్రమైన విద్యుదాఘాతానికి (కరెంట్ షాక్) గురై ఇద్దరూ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరణించిన వారిని జంగాలపల్లి గ్రామానికి చెందిన ఆరేపల్లి చెన్నారావు, రెడ్డి నాగరాజులుగా పోలీసులు గుర్తించారు. సమాచారం అందుకున్న రెడ్డిగూడెం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిని అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

## ఫోన్ విషయంలో గొడవ: ఒకరి దారుణ హత్య

విజయవాడ ఆటోనగర్‌లో ఫోన్ పోయిందన్న విషయంపై తలెత్తిన వివాదం చివరకు హత్యకు దారితీసింది. లారీ క్లీనర్‌గా పనిచేస్తున్న ఓ వ్యక్తి రాయితో దాడి చేసి హత్య చేసిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఫోన్ కనిపించకపోవడంతో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి తీవ్ర వాగ్వాదానికి దారితీసినట్లు సమాచారం. ఈ క్రమంలో ఆగ్రహానికి గురైన నిందితుడు లారీ క్లీనర్‌పై రాయితో బలంగా దాడి చేసినట్లు తెలుస్తోంది. తీవ్ర గాయాలతో బాధితుడు అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. ఘటనపై సమాచారం అందుకున్న పటమట పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మృతదేహాన్ని పరిశీలించి ఘటనకు సంబంధించిన వివరాలను స్థానికులు, ప్రత్యక్ష సాక్షుల నుంచి సేకరించారు. ఘటనకు దారితీసిన పరిస్థితులు, హత్యకు సంబంధించిన పూర్తి కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ ఘటనలో హత్యకు పాల్పడిన వ్యక్తిని పటమట పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఘటనపై కేసు నమోదు చేసిన పటమట పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## ఈశ్వర్ కిరణ్‌కుమార్‌రెడ్డి రిమాండ్ పొడిగింపు

మద్యం కేసులో ఈశ్వర్ కిరణ్‌కుమార్‌రెడ్డి రిమాండ్‌ను కోర్టు పొడిగించింది. నేటితో మద్యం కేసులో ఈశ్వర్ కిరణ్‌కుమార్‌రెడ్డి రిమాండ్ ముగిసింది. గుంటూరు జైలులో ఈశ్వర్ కిరణ్‌కుమార్‌రెడ్డి జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు. ఈ క్రమంలో ఈశ్వర్ కిరణ్‌కుమార్‌రెడ్డిని జైలు నుంచి వర్చువల్‌గా ఎసిబి కోర్టులో సిట్ అధికారులు హాజరుపరిచారు. ఈశ్వర్ రిమాండ్‌ను వచ్చే నెల 11కు ఎసిబి న్యాయస్థానం పొడిగించింది. అప్రూవర్‌గా మారేందుకు వేసిన సత్యప్రసాద్ పిటిషన్‌పై విచారణ ఎల్లుండికి వాయిదా వేసింది.

## హోంగార్డు వెంకటరాజుకు బెయిల్

రౌడీ షీటరు గాదె సాయికృష్ణ లాకప్‌డెత్ కేసులో హోంగార్డు వెంకటరాజుకు కోర్టు బెయిల్ ఇచ్చింది. రూ.30 వేల పూచీకత్తుతో రెండు ష్యూరిటీలు ఇవ్వాలని విజయవాడ కోర్టు పేర్కొంది. ప్రస్తుతం విజయవాడ జైలులో వెంకటరాజు జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు. గాదె సాయికృష్ణ కేసులో వెంకటరాజు కీలకంగా వ్యవహరించినట్లు అభియోగాలు ఉన్నాయి. ఈ విషయాన్నే అతని రిమాండ్ రిపోర్టులో సిట్ పేర్కొంది.

## రాజశేఖర్ కుటుంబానికి అండగా ఉంటా

• వైసిపి అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్ పరామర్శ



**ఒంగోలు, సెప్టెంబరు 29 ప్రభాతవార్త:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం ఒంగోలులో పర్యటించారు. ఒంగోలు క్లౌ పేటలోని వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ లిడ్‌క్యాప్ ఛైర్మన్ దివంగత కాకుమాను రాజశేఖర్ నివాసానికి వెళ్లిన వైయస్ జగన్, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాకుమాను రాజశేఖర్ మృతిపై తీవ్ర సంతాపం వ్యక్తం చేసిన వైయస్ జగన్, ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కష్టసమయంలో ధైర్యంగా ఉండాలని వారిని ఓదార్చారు. కాకుమాను రాజశేఖర్ పార్టీకి అందించిన సేవలను ఈ సందర్భంగా వైయస్ జగన్ గుర్తుచేసుకున్నారు. పార్టీ పట్ల నిబద్ధతతో, అంకితభావంతో ఆయన పనిచేశారని పేర్కొన్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. రాజశేఖర్ కుటుంబం ఒంటరిది కాదని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటుందని వైయస్ జగన్ భరోసా ఇచ్చారు. కుటుంబానికి అవసరమైన అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కుటుంబ సభ్యులతో కొద్దిసేపు మాట్లాడి, వారికి ధైర్యం చెప్పిన అనంతరం వైయస్ జగన్ అక్కడి నుంచి తిరుగు ప్రయాణమయ్యారు.

## విశాఖ ఉక్కులో తప్పిన ముప్పు

• ఎస్ఎమ్ఎస్1లో నేలపాలైన ఉక్కు ద్రవం



**గాజువాక, సెప్టెంబరు 29 ప్రభాతవార్త:** విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లోని స్టీల్ మెల్ట్ షాప్ (ఎస్ఎమ్ఎస్1) విభాగంలో మంగళవారం మధ్యాహ్నం ప్రమాదం చోటుచేసుకుంది. సిసిడి సెక్షన్‌లోని మెషిన్2 వద్ద లేడిల్ నంబరు26 ద్వారా వేడి ఉక్కు ద్రవాన్ని బయటకు పంపుతుండగా సాంకేతిక లోపం తలెత్తింది. లేడిల్ స్లైడ్ గేట్ సరిగ్గా మూతపడక పోవడంతో ద్రవీభవించిన ఉక్కు పెద్ద ఎత్తున నేలపాలైంది. ఘటనను గమనించిన సిబ్బంది తక్షణమే అప్రమత్తమయ్యారు. సమయస్ఫూర్తితో వ్యవహరించి సాంకేతిక లోపాన్ని సరిదిద్ది స్లైడ్ గేట్‌ను మూసివేయడంతో సంభవించాల్సిన ప్రాణ, ఆస్తి నష్టం తప్పిపోయింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో ప్లాంట్ అధికారులు, కార్మికులు ఊపిరి పీల్చుకున్నారు.

**తీరని భయం.. మరోసారి అవే లోపాలు:** సరిగ్గా రెండు నెలల క్రితం ఇదే విభాగంలో లేడిల్ పేలిపోయి క్రూరమైన అగ్నిప్రమాదం సంభవించిన సంగతి విదితమే. ఆ ఘోర దుర్ఘటనలో పలువురు ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు సజీవదహనమై ప్రాణాలు కోల్పోయారు. మళ్లీ అదే సున్నితమైన ప్రాంతంలో సాంకేతిక లోపాలు తలెత్తడం, ఉక్కు ద్రవం లీక్ అవ్వడంపై కార్మిక సంఘాలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నాయి. యాజమాన్యం తక్షణమే భద్రతా చర్యలు సమీక్షించాలని, రక్షణ ప్రమాణాలను కఠినతరం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## తెలంగాణలో పెరిగిన విద్యుత్ వినియోగం

**హైదరాబాద్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** తెలంగాణలో విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరుగుతోంది. ట్రాన్స్‌కో వర్గాల నివేదిక ప్రకారం ఈ నెల 28, మధ్యాహ్నం 12:56 గంటలకు రాష్ట్రవ్యాప్తంగా 19,133 మెగావాట్ల (326.70 మిలియన్ యూనిట్ల) గరిష్ట విద్యుత్ డిమాండ్ నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు రాష్ట్రంలో నమోదైన గరిష్ట విద్యుత్ డిమాండ్ ఈ నెల 9న 19,543 మెగావాట్ల మేర నమోదైంది.

## ప్రాణాధార మందులు ఇంత భారమా?

ఔషధాల ధరలపై 'సుప్రీం' సీరియస్

అన్నిరకాల మెడిసిన్స్‌పై ఒకే రిటైలర్ మార్జిన్ ఎందుకు అమలుచేయరని ప్రశ్న





**న్యూఢిల్లీ, సెప్టెంబరు 29:** ప్రాణాలను కాపాడే మెడికల్ ట్యాబ్లెట్లు, ఇంజెక్షన్స్ ధరలు సామాన్యుడికి మోయరాని భారంగా మారుతున్నాయని దేశ అత్యున్నత న్యాయస్థానం కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ప్రశ్నల వర్షం కురిపించింది. దేశంలోని అన్ని రకాల మందులపై ఒకే రకమైన రిటైలర్ మార్జిన్‌ను ఎందుకు అమలు చేయకూడదని సుప్రీంకోర్టు సూటిగా నిలదీసింది. ఔషధ ధరల నియంత్రణ విధానంలో భాగంగా కొన్ని మందులకు ఇస్తున్న 16 శాతం మార్జిన్‌ను అన్ని రకాల నిత్యావసర, నాన్‌ఇసెన్షియల్, పేటెంట్ జెనరిక్ మందులన్నింటికీ ఎందుకు వర్తింపజేయలేరని జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం కేంద్రాన్ని ప్రశ్నించింది.

మందుల తయారీదారులకు, సామాన్యులకు విక్రయించే ఎంఆర్పీ మధ్య ఉండే భారీ వ్యత్యాసాన్ని గత వార విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. ఒక క్యాన్సర్ మందు రిటైలర్లకు కేవలం రూ.2,700కే అందజేయబడుతుండగా, అదే మందును పేషెంట్లకు మాత్రం రూ.27,000 ఎమ్ఆర్‌పికి అమ్ముతున్న వైనాన్ని న్యాయస్థానం ఉదాహరణగా పేర్కొంది. దేశంలోని సుమారు 82 శాతం మందులు ధరల నియంత్రణ ఉత్తర్వుల పరిధిలోకి రాకుండా స్వేచ్ఛగా అమ్ముడవు తున్నాయని పిటిషనర్ కిషన్ చంద్ జైన్ కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ భారీ వ్యత్యాసంపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉందని న్యాయమూర్తులు అభిప్రాయపడ్డారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లోని ఫార్మసీల ద్వారానే రోగులు మందులు, వైద్య పరికరాలు కొనుగోలు చేయాలంటూ బలవంతం చేయడంపై కూడా సుప్రీంకోర్టు మండిపడింది. ఆసుపత్రుల లోపల ఉండే ఫార్మసీలు చెప్పినంత ధర చెల్లించి మందులు కొనాల్సి వస్తోందని, అసలు రోగులకు బయట కొనుగోలు చేసే స్వేచ్ఛ ఎక్కడ ఉందని కోర్టు ప్రశ్నించింది. ఆసుపత్రులు వసూలు చేస్తున్న గరిష్ట ధరల వల్ల పేద, మధ్యతరగతి ప్రజలు అప్పులపాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. రోగుల బలహీనతను ఆసరా చేసుకుని ఆసుపత్రులు చేస్తున్న ఈ వ్యాపార ధోరణికి అడ్డుకట్ట వేయాల్సిన సమయం ఆసన్నమైందని స్పష్టం చేసింది. ప్రభుత్వం తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ కేఎం నటరాజ్ మాట్లాడుతూ పేదలకు సరసమైన ధరలకే మందులు అందించేందుకు కేంద్రం కట్టుబడి ఉందని, మెరుగైన విధానాల రూపకల్పనకు సిద్ధంగా ఉన్నామని కోర్టుకు తెలిపారు. మరోవైపు, ఫార్మా కంపెనీల తరఫున సీనియర్ అడ్వకేట్ కపిల్ సిబల్ వాదిస్తూ రిటైలర్ ధరలకు, ఎంఆర్‌పీకి మధ్య కనిపించే భారీ లాభం పూర్తిగా ఫార్మా కంపెనీల వద్దే ఉండిపోదని, సరఫరా గొలుసులోనివివిధ దశలను పరిశీలించాలని కోర్టును కోరారు. తదుపరి విచారణ అక్టోబర్ 12కి వాయిదా ప్రస్తుతానికి మందుల ధరల నియంత్రణపై సుప్రీంకోర్టు ఎలాంటి తుది ఉత్తర్వులు జారీ చేయనప్పటికీ, న్యాయస్థానం లేవనెత్తిన ప్రశ్నలు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. మెడికల్ పరికరాలు, మందుల ధరలు మరియు జెనరిక్ మందుల విధివిధానాలపై దాఖలైన పలు పిటిషన్లను విచారించిన ధర్మాసనం తదుపరి విచారణను అక్టోబర్ 12వ తేదీకి వాయిదా వేసింది. ఈ లోపు ఈ అంశంపై సమగ్ర నివేదిక అందజేయాలని కోర్టు భావిస్తోంది.

## మిలటరీ ఆయుధాల చోరీ కేసు కొత్తమలుపు

నిందితుడు మల్లేష్‌కు మరో ఇద్దరి సహకారం

పోలీసుల అదుపులో ఆయుధాగారం ఇన్‌ఛార్జిలు

**హైదరాబాద్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా సంచలనం రేపిన బొల్లారంలోని మిలటరీ కేంద్రంలో ఆయుధాలు, మందుగుండు సామాగ్రి చోరీ కేసు సంచలన మలుపు తిరిగింది. గత నెల 30వ తేదీ రాత్రి ఈ చోరీ జరగడం తెలిసిందే. ఈ చోరీ తాలూకు నిందితుడు ఇదే రెజిమెంట్‌లో పనిచేసిన మాజీ సైనికుడు బలవంతంగా పదవీవిరమణ అయిన హవల్దార్ మల్లేష్ అలియాస్ రాజుగా తేలడం తెలిసిందే. పక్కా వ్యూహంతో ఉన్నతాధికారులపై కక్షగట్టిన మల్లేష్ ఈ నేరానికి పాల్పడినట్లు పోలీసులు తేల్చారు. తనను బలవంతంగా పదవీ విరమణ చేయి ంచినందుకు రెండు నెలల ముందుగానే ఈ చోరీకి ఇతను స్కెచ్ వేసినట్లు తెలిసింది. ఈ కేసులో మల్లేష్ పట్టుబడిన తరువాత ఆయుధాలు, మందు గుండు సామాగ్రి పట్టుబడగా దీనిపై మరింత లోతుగా విచారించేందుకు నిందితుడిని పది రోజుల కస్టడీ నిమిత్తం బొల్లారం పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మంగళవారం నాటికి ఎనిమిది రోజుల కస్టడీ పూర్తయ్యింది. గురువారం నాడు ఇతన్ని తిరిగి చంచల్‌గూ డ జైలుకు తరలించాల్సి వున్న తరుణంలో అనూహ్యంగా ఈ కేసులో కొత్త అంశాలు వెలుగు చూశాయి. మిలటరీ అధికారులు, పోలీసులు ఊహించినట్లుగానే ఆయుధాలు, మందు గుండు సామాగ్రి చోరీ కేసులో మల్లేష్‌కు మరో ఇద్దరు సహకరించినట్లు తేలింది. ఆయుధాలు, మందుగుండు సామాగ్రి భద్రపరిచే ఆయుధగారం ఇంఛార్జిలుగా వున్న హవల్దార్లు వినోద్, శేషులు చోరీ సమయంలో మల్లేష్‌కు సహకరించినట్లు కస్టడీ వి చారణలో వెలుగు చూసింది.

ఆగస్టు 30వ తేదీ రాత్రి వినోద్, శేషులు ఆయుధగారం వద్ద డ్యూటీలో వున్నారు. వీరిద్దరే ఆయుధగారం తాళా లు బద్దలుకొట్టి మల్లేష్‌కు ఆయుధాలు, మందు గుండు సామాగ్రిని ఇచ్చినట్లు పోలీసుల తాజా విచారణలో తేలింది. ఆయుధాలు, మందు గుం డు సామాగ్రిని చోరీ చేసిన తరువాత వాటిని కారులో తరలించేందుకు మల్లేష్‌కు వీరిద్దరు సహకరించినట్లు తేలింది. కాగా ఈ ఘటనలో తనకు సహకరించినందుకు వినోద్, శేషులకు సుమారు మల్లేష్ మూడు లక్షల రూపాయల నగదు చెల్లించినట్లు తేలింది.

## ముగిసిన 'రిస్టామ్-2026' అంతర్జాతీయ సదస్సు

**తిరుపతి, సెప్టెంబరు 29 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం హోమ్ సైన్స్ విభాగం న్యూట్రిషన్ సొసైటీ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్ఐ) తిరుపతి చాప్టర్, బెంగళూరు విశ్వవిద్యాలయంలోని మైక్రోబయాలజీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ సదస్సు ముగిసింది. పీఎం-ఉషా సౌజన్యంతో రెండు రోజుల పాటు నిర్వహించిన "సైన్స్, టెక్నాలజీ మేనేజ్‌మెంట్‌లో పరిశోధనా ఆవిష్కరణలు (రిస్టామ్-2026)" జరిగాయి. హైబ్రిడ్ విధానంలో నిర్వహించిన ఈ సదస్సుకు దేశ, విదేశాల నుండి విద్యావేత్తలు, శాస్త్రవేత్తలు, పరిశోధకులు, విద్యార్థులు నిపుణులు పాల్గొన్నారు. సదస్సు ముగింపు సమావేశంలో సదస్సు అధ్యక్షురాలు ఆచార్య ఎన్. రజని సదస్సు నిర్వహణ ఉద్దేశ్యం ప్రాధాన్యతను వివరించారు. శాస్త్ర, సాంకేతిక నిర్వహణ రంగాల్లో జరుగుతున్న వేగవంతమైన మార్పులకు అనుగుణంగా పరిశోధనలను ప్రోత్సహించడం, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడం, పరిశోధకుల మధ్య అంతర్జాతీయ సహకారాన్ని పెంపొందించడం రిస్టామ్-2026 ప్రధాన లక్ష్యాలని పేర్కొన్నారు. సదస్సు సమన్వయకర్త ఆచార్య ఎం. అరుణ రెండు రోజుల సదస్సు నివేదికను సమర్పించారు. సదస్సులో నిర్వహించిన వివిధ సాంకేతిక సమావేశాలు, కీలక ఉపన్యాసాలు, పరిశోధనా పత్రాల సమర్పణలు, దేశీయ అంతర్జాతీయ ప్రతినిధుల భాగస్వామ్యం తదితర అంశాలను ఆమె వివరించారు.

ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం మాజీ డీన్ ప్రొఫెసర్ విజయ ఖేదర్ నూతన పరిణామాలను పరిశోధకులు నిరంతరం అధ్యయనం చేసి, సమాజ అవసరాలకు అనుగుణంగా పరిశోధనలను కొనసాగించాలని సూచించారు. పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఆర్. ఉష, పీఎం-ఉషా సమన్వయకర్త ప్రొఫెసర్ సి. వాణి, ఈజిప్ట్‌లోని జాతీయ పరిశోధనా కేంద్రం ప్రతినిధి ప్రొఫెసర్ మెర్వత్ ఫోడా"వృద్ధుల కోసం డెయిరీ రంగంలో నూతన ఆవిష్కరణల ప్రాముఖ్యత" అనే అంశంపై ప్రసంగించారు. మలేషియాలోని యూనివర్సిటీ మలేషియా తెరెంగాను సీనియర్ లెక్చరర్ టి.ఎస్. డాక్టర్ తిరుకాంతన్, ప్రతినిధి డాక్టర్ లేథు మాచ్ ప్రతినిధులతో పాటు ఈజిప్ట్, మలేషియా, వియత్నాంతదితర దేశాల నుంచి అంతర్జాతీయ ప్రతినిధులు ఆన్‌లైన్ ప్రత్యక్ష విధానంలో పాల్గొన్నారు.

వార్త

మతం మానవుని కోసమే గాని,
మానవుడు మతం కోసం కాదు.
- అంబేద్కర్

# ప్రజారోగ్యాన్ని పీలుస్తున్నదెవరు?

జనారోగ్యమే జాతి మహాభాగ్యమనే లక్ష్యంతో దేశ ప్రజలను పరిపూర్ణ ఆరోగ్యవంతులుగా చేసేందుకు స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి లక్షలాది కోట్ల రూపాయలు ఖర్చు చేశారు, చేస్తూనే ఉన్నారు. అటు కేంద్ర ప్రభుత్వం కానీ, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు లెక్కలేనన్ని పథకాలు ప్రవేశపెట్టాయి. ఏ పథకం కింద ఎన్ని కోట్ల రూపాయలు వెచ్చించారో లెక్కలకే అందదు. మన రాజ్యాంగ నిర్మాతలు ప్రజారోగ్యం విషయంలోపాలకులు తీసుకోవాల్సిన చర్యల గూర్చి రాజ్యాంగంలో పొందుపరిచారు. స్వాతంత్ర్యంవచ్చి ఎనిమిది దశాబ్దాలు కావస్తున్నా నేటికీ అందరికీ ఆరోగ్య వసతులు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర పాలకులు విఫలమవుతున్నారనే చెప్పొచ్చు. ప్రజారోగ్యంపై రోగాల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. కొన్ని వ్యాధులను కొందరు వ్యక్తులు తమకు తాముగా తెచ్చుకొని సమాజంపై వదులుతుంటే మరికొన్ని ప్రకృతి విసురుతున్నట్లుగా చెప్పొచ్చు. ఇవన్నీ కలిసి ప్రజారోగ్యంపై దాడుల పరంపర కొనసాగుతూనే ఉన్నాయి. ఇందులో కొన్ని వ్యాధులను నియంత్రించడం డాక్టర్లకు కూడా సాధ్యంకావడం లేదు. ఎంతో ఆధునిక విజ్ఞానం సముపార్జించుకున్నామనివిర్రవీగే మానవజాతిపై ప్రకృతి విసురుతున్న సవాళ్లకు వారూవీరు అని తేడా లేకుండా అందరూ బలైపోతున్నారు. ఆ శక్తిముందు మానవుడు ఎప్పుడూ తలదించుకోవాలనే వాస్తవాన్ని చాటుతూ వ్యాధులు ప్రబలిపోతున్నాయి. మొన్నటివరకు ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా రక్కసి బారినపడినవారు ఆ మందుల ప్రభావం నుండి ఇప్పటికీ కోలుకోలేకపోతున్నారు. అవి కాక దోమల ద్వారా వస్తున్న వ్యాధులు అన్నీఇన్నీ కావు. గతంలో వచ్చిన స్వైన్‌ఫ్లూ, ఎబోలా, డెంగ్యూ, చికెన్ గున్యా, ఒకటేమిటి రకరకాల విషజ్వరాలు విస్తరిస్తూనే ఉన్నాయి. డెంగ్యూకు సంబంధించి నిరోధక టీకాలు వచ్చాయని చెప్పినా అవి అంతగా పనిచేయడం లేదనే వార్తలు వెల్లుబుకుతున్నాయి. చికెన్‌గున్యా వదిలిపెట్టడం లేదు. దానివల్ల ప్రాణహాని లేకపోయినా నాలుగైదు వారాల పాటు మంచానికే పరిమితం కావాల్సి వస్తున్నది. దీంతో లక్ష్మీపుత్రులకు ఇబ్బంది లేదుకానీ రోజువారీ కూలీనాలి చేసుకునే బీదాబిక్కి చిన్నచిన్న వ్యాపారులు తదితర బడుగు వర్గాల పరిస్థితి అగమ్య గోచరంగామారుతున్నది. ఇక కేన్సర్, గుండెజబ్బులు, కిడ్నీ వ్యాధులు గురించి చెప్పక్కర్లేదు. అయితే ఈ వ్యాధుల నుండి రోగనిరోధక శక్తి ఉన్నవారు బయటపడే అవకాశాలున్నట్లు డాక్టర్లు చెబుతున్నారు. ఒక్క అల్లోపతే కాదు, ఆయుర్వేదం, హోమియో, తదితర అన్ని విభాగాలు డాక్టర్లు వైద్యరంగ నిపుణులు శరీరంలో ఇమ్యూనిటీ పెంచుకోవాలని సూచనలు ఇస్తున్నారు. ఇప్పుడు ఈవిషయం కొత్తగా చెప్పడం లేదు. ఏనాటి నుంచో చెబుతున్నారు. అయితే ఈ వాస్తవాలు ప్రజలకు తెలిసి కూడా రోగనిరోధక శక్తి ఎందుకు పెంచుకోలేకపో తున్నారు? అందుకు కారణాలు ఏమిటి? కారకులు ఎవరు? తదితర అంశాలు పరిశీలించాల్సిన తరుణమిది. రోగనిరోధక శక్తి ఒక్క రోజుల్లోనో, వారంలోనూ, నెల రోజుల్లోనో పెరిగేది కాదు. బాల్యం నుంచి సమతుల్య మైన మంచి పోషకవిలువలు కలిగిన పౌష్టికాహారాన్ని అందించాలి. ఏమేరకు అందిస్తున్నామో ప్రత్యేకంగా చెప్ప క్కర్లేదు. పౌష్టికాహార లోపంతో ప్రధానంగా నిరుపేదలు అల్లాడిపోతున్నారు. అసలు పౌష్టికాహారం సంగతి దేవుడెరుగు. అర్ధాకలితో అలమటిస్తున్నవారు దేశంలో కోట్ల సంఖ్యలో ఉన్నారు. వారిలో రోగనిరోధక శక్తి ఎలా వస్తుంది. ఎక్కడ నుంచి వస్తుంది? మరొకపక్క కాలుష్యం, ప్రజారోగ్యాన్ని కాటేస్తున్నది. కాలుష్య నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు దాదాపు కాగితాలకే పరిమితమవుతున్నాయి. వాయు, నీటి కాలుష్యాలు అంతకంతకు పెరిగిపోతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో అక్టోబరు ఒకటి నుంచి కాలుష్యనియంత్రణ కోసంప్రత్యేక చర్యలకు అధి కారగణం శ్రీకారం చుట్టారు. వర్క్‌ఫ్రమ్ హోం లాంటివి కాకుండా కార్ల పార్కింగ్‌కు రెట్టింపు ఫీజులు విధించే కార్యక్రమం చేపట్టారు. దేశవ్యాప్తంగా కాలుష్య నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు దాదాపు కాగితాలకే పరిమితమవుతున్నాయి. వాయుకాలుష్యంతో పాటు నీటికాలుష్యం అంతకంతకు పెరిగిపోతున్నది. భారత్‌లో దాదాపు వంద నగరాలకుపైగా ఈ వాయు, నీటి కాలుష్యాలతో అతలాకుతలమవుతున్నాయి. మరొక పక్క వాహనాలు వదులుతున్న పొగ దీనికి తోడవుతున్నది. ఇంకొకపక్క ధూమపానం కూడా ప్రజారోగ్యాన్నిపాడు చేస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా 130 కోట్ల మందికిపైగా ధూమపానం లో మునిగి తేలుతున్నట్లు చెబుతున్నారు. భారత్‌లో ఇరవై కోట్ల మందికిపైగా పొగాకుకు అలవాటు పడ్డారు. ఇందులో బీడిలు తాగేవారే ఎక్కువ. సిగరెట్లు, బీడిలు తాగడం సరదాగా ఆరంభమై ఆ తర్వాత అలవాటుగా మారిపోతున్నది. బీడి, చుట్టా, సిగరెట్, హుక్కా రూపు రేఖలు, విలాసాల్లో తేడాలే కానీ వాటన్నింటికి మూలం పొగాకే. ధూమపానం చేసేవారికే కాదు, వారి చుట్టు పక్కల ఉన్నవారికి కూడా రకరకాల వ్యాధులు వ్యాపింప చేయగల శక్తి దానికిఉంది. మద్యపానం కూడా ప్రజా రోగ్యానికి హానికలిగిస్తున్న విషయం పెద్దలకు తెలియంది కాదు. ప్రజాసంక్షేమమే తమ లక్ష్యమని పదేపదే చెప్పు కునే పాలకపెద్దలు ప్రజారోగ్యాన్ని పణంగా పెట్టి ధనార్జన చేయడం ఎంతవరకు సమంజసమోమనసుపెట్టి ఆలోచించాలి. ఇవేకాదు కల్తీ ప్రజారోగ్యంపై తీవ్రప్రభావం చూపుతున్నది. ఇటీవల తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో జరుగుతున్న ఆకస్మిక దాడుల్లో వందల టన్నుల కొద్దీ కల్తీ వస్తువులు బయటపడుతున్నాయి. ఇలాంటివి ఎన్నో ప్రజల అనారోగ్యాలకు కారణమవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో రోగనిరోధక శక్తి ఎలా పెరుగుతుందో, ఎలా పెంచుకోవాలో, ఈ వ్యాధుల నుంచి ఎలా బయటపడాలో పాలక పెద్దలు విజ్ఞతతో ఆలోచించాలి.

పువ్వును గాని, సీతాకోక చిలుకను గాని రూపాన్ని బట్టి నిర్ణయించు గాని, మనిషి విషయంలో మాత్రం అలా చేయకు.



రవీంద్రనాథ్ ఠాగూర్

దూరంగా ఉన్నా ఎప్పుడూ మనసులో ఉండేవారు నిజంగా దగ్గరగా ఉన్నట్లే. దగ్గరగా ఉన్నా ఎప్పుడూ మనసులో లేనివారు దూరంగా ఉన్నట్లే.



చాణుక్యుడు

## ప్రజావాక్కు

### లోకాయుక్త విచారణ నెలకొకసారి జరగాలి

లోకాయుక్త విచారణ నెలకొకసారి జరగాలి లేదా లోకాయుక్త కార్యాలయం విజయవాడలో పెట్టాలి. కర్నూలులో లోకాయుక్త ఉన్నందున శ్రీకాకుళం, విశాఖల నుండి వచ్చేవారు రెండు రోజులు ముందుగా ప్రయాణ సన్నాహాలు చేసుకోవాలి. కర్నూలుకు రైలుసౌకర్యం లేదు. బస్సులు అడవిలో నుండి ఐదారు గంటలు ఘాట్ రోడ్డు ప్రయాణం చెయ్యాలి. చాలాఇబ్బందిగా ఉంటుంది. లోకాయుక్త కార్యాలయం విజయవాడ ఐతే అన్ని జిల్లాలకు అనుకూలంగా ఉంటుంది. నెలకొకసారి విచారణ జరపాలనిలోకాయుక్త ఫిర్యాదుదారులు కోరుకుంటున్నారు. వాయిదాలు కూడా ఎక్కువగా వెయ్యకుండా త్వరగా తీర్పులు చెప్పాలి. అధికారులు సమాచారం ఇవ్వకుండా వాయిదాలు కోరుతున్నారు. ఫైలు కనపడలేదు అంటూ అధికారులు వాయిదాలు కోరుతున్నారు. లోకాయుక్త గారు అలాంటిఅధికారులకు గట్టిగా వార్నింగ్ లాంటిది ఇవ్వాలి.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### భస్మాసుర వాస్తం కాబోతున్న కృత్రిమ మేధ

మనిషి సృష్టించిన కృత్రిమమేధవల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశంగా పరిగణింపబడాలంటే ఈ రంగంలో మనిషికంటే వేగంగా పనిచేసేయంత్రాంగం ఉండాలనుకోవడంలో తప్పులేదు. కానీ ఈ మేధవల్ల లాభాల కన్నా నష్టాలే ఎక్కువ కనిపిస్తున్నాయి. ముఖ్యంగా వేలఉద్యోగాలకు ఉద్వాసన చెప్పడం జరిగింది. కొత్తఉద్యోగాలకు గండిపడుతోంది. సైబర్ నేరాలు ఉధృత మవుతున్నాయి. మరొక భయంకరమైన విషయం ఏమంటే ఈ మేధ మనిషి మీదే అధికారం చలాయించే రోజులొచ్చాయని మేధావులు హెచ్చరిస్తున్నారు. మానవ జాతి మొత్తం వినాశానికి దారి తీయగలదని అప్పట్లో స్టీఫెన్ హాకింగ్ ఈమధ్య బిల్‌గేట్స్ హెచ్చరించిన సంగతి మరువకూడదు.

- డా. ఎన్.ఎస్.ఆర్. మూర్తి, సికింద్రాబాద్

### పెరుగుతున్న అవినీతి

ప్రభుత్వం నెల నెల ఠంచన్‌గా అందించే వేలాది రూపాయల జీతాలతో ఎంతోహుందాగా ఉండాల్సిన కొంతమంది ఉద్యోగులు తమ దగ్గరకు ఏదేని పని నిమిత్తమై వచ్చిన సామాన్యప్రజలనుంచి, చిన్న, సన్న కారు రైతుల నుంచి తమకు కావలసినంత సొమ్మును వసూలు చేస్తున్నారు. కాస్తో, కూస్తో కాసులు గుంజనిదే పని చేయడం లేదు.

- కె.రామారావు, నల్గొండజిల్లా

### పర్యాటకం ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక

పర్యాటకం అంటే కేవలం విహారయాత్ర కాదు, అది జీవితాన్ని సమృద్ధిగా మార్చే అనుభవాల ప్రయాణం. ముఖ్యంగా పిల్లలకు పర్యాటకం ఒక ప్రత్యక్ష పాఠశాల వంటిది. తరగతి గదిలో పుస్తకాల ద్వారా నేర్చుకున్న చరిత్ర, భూగోళ శాస్త్రం, సంస్కృతి వంటి అంశాలను స్వయంగా చూసి అర్థం చేసుకునే అవకాశం పర్యాటకం కల్పిస్తుంది. చారిత్రక కట్టడాలు, పుణ్యక్షేత్రాలు, సముద్రతీరాలు, కొండప్రాంతాలు, వన్యప్రాణుల అభయారణ్యాలు సందర్శించడం ద్వారా జ్ఞానం విశాలమవుతుంది. తన గ్రామం లేదా పట్టణం దాటి ఎక్కడికీ వెళ్లని వ్యక్తి జీవిత పుస్తకంలో ఒక్క పేజీ మాత్రమే చదివినట్లే" అనే సామెతలో గొప్ప సందేశం ఉంది. పర్యాటకం మనలో విశాల దృక్పథాన్ని పెంపొందిస్తుంది. వివిధ సంస్కృతులు, జీవనశైలులు, సంప్రదాయాలను అర్థంచేసుకోవడం ద్వారా పరస్పర గౌరవం పెరుగుతుంది. ప్రకృతికి చేరువ కావడం వల్ల మానసిక ఒత్తిడి తగ్గి ఆరోగ్యం మెరుగుపడుతుంది. అందుకే పర్యాటకాన్ని జీవిత కాలాన్ని, జీవిత నాణ్యతను పెంచేసాధనంగా కూడా భావిస్తారు. పర్యాటకం స్థానిక ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### కూరగాయల సాగును పెంచాలి

తెలంగాణలో 47శాతం అంటే దాదాపు సగంభూములు ఎర్ర చెలక లేదా ఎర్ర చెక్క భూములు అయినా ఇతర రాష్ట్రాలా నుండి కూరగాయలు దిగుమతిచేసుకోవలసిన పరిస్థితి వచ్చింది. అయితే తెలంగాణలో గతంలో 5.45 లక్షల ఎకరాలలో సాగు అయిన ఎర్ర చెక్క భూముల విస్తీర్ణం నేడు 1.13 లక్షల ఎకరాలకు మాత్రమే పరిమితం అయింది. ఇది రాష్ట్రానికి శారాఘాతమే. తెలంగాణకు అవసరం అయినా కూరగాయలు 40 లక్షల మెట్రిక్ టన్నులు ఐతే తెలంగాణ సమకూర్చేది 25 లక్షల మెట్రిక్ టన్నులు అని గుర్తుపెట్టుకోవాలి. ప్రభుత్వం ఉపాధి హామీ, వీ బీరామ్‌జీని పథకాలను అమలు చేయాలి.

- భారత అవినాష్, జనగామ

### ఆరోగ్యమే మహాభాగ్యం

ప్రస్తుత మానవ జీవిత పరిణామ క్రమంలో అన్నింటికంటే మొదటి ప్రాధాన్యత మన విలువైన ఆరోగ్యానికి మాత్రమే ఇవ్వాలి. ఆరోగ్యం బాగున్నప్పుడే మనం ఏదైనా సాధించగలం. ఆరుబయట ఆహారం పూర్తిగా విరమించి పౌష్టికాహారం తీసుకుంటేనే మన ఆరోగ్యం బాగుండడంతో పాటు ఎక్కువ కాలం జీవించే అవకాశం ఉంటుంది.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# ఎల్‌ఎన్‌జి రైళ్లతో కొత్త ఇంధన విప్లవం

**ఎల్ఎన్‌జీ రైలు ప్రయోగాన్ని కేవలం ఒక కొత్త రైలు ప్రారంభంగా కాకుండా, రైల్వే ఇంధన విధానంలో జరుగుతున్న మార్పుకు సూచనగా చూడాలి. రేపటి రైల్వే ఎలా ఉండాలి? తక్కువ ఖర్చుతో, తక్కువ కాలుష్యంతో, అధిక సామర్థ్యంతో, సురక్షితంగా, అందుబాటులో ఉండే రవాణా వ్యవస్థగా ఉండాలి. ఆ లక్ష్యాన్ని చేరుకోవడానికి విద్యుత్, ఎల్ఎన్‌జీ, హైడ్రోజన్ వంటి వివిధ సాంకేతిక మార్గాలను శాస్త్రీయంగా పరిశీలించాల్సి ఉంటుంది. సబర్మతి పట్టాలపైకి వచ్చిన తొలి ఎల్ఎన్‌జీ రైలు అందుకే ఒక చిన్న ప్రయోగం కాదు. అది భారతీయ రైల్వే అడుగులు వేస్తున్న కొత్త ఇంధన మార్గానికి ఒక ప్రారంభ సంకేతం. ఈ ప్రయోగం ఎంతవరకు విజయవంతమవుతుంది? దేశ వ్యాప్తంగా ఎన్ని రైళ్లకు విస్తరిస్తుంది? నిజంగా ఎంత ఇంధనం, ఎంత వ్యయం, ఎంత కాలుష్యం తగ్గుతుంది? ఈ ప్రశ్నలకు సమాధానం రాబోయే సంవత్సరాల పనితీరే ఇవ్వాలి.**

తిప్పర్తి శ్రీనివాస్

భారతీయ రైల్వే చరిత్రలో మరో కొత్త అధ్యాయం మొదలైంది. ఇన్నాళ్లూ విద్యుత్, డీజిల్ ఆధారంగా సాగిన రైలు ప్రయాణంలో ఇప్పుడు సహజవాయువు ఆధారిత ద్రవీకృత సహజవాయువు ఎల్ఎన్‌జీ అడుగుపెట్టింది. దేశంలోనే తొలి ఎల్ఎన్‌జీ ఆధారిత రైలును కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్ షా సెప్టెంబర్ 27న గుజరాత్‌లోని సబర్మతి రైల్వే స్టేషన్ నుంచి ప్రారంభించారు. ఇది కేవలం మరో రైలును ప్రారంభించడం కాదు. ఇంధన పొదుపు, కాలుష్య నియంత్రణ, నిర్వహణ వ్యయ తగ్గింపు వంటి అంశాలను కలిపి చూస్తే భారతీయ రైల్వే భవిష్యత్తులో మారుతున్న దిశకు ఇది ఒక సంకేతంగా కనిపిస్తోంది. అయితే ఈ రైలు ప్రత్యేకత ఏమిటో ముందుగా తెలుసుకోవాలి. ఇది పూర్తిగా ఎల్ఎన్‌జీతో మాత్రమే నడిచే రైలు కాదు. ఎల్ఎన్‌జీ-డీజిల్ ద్వంద్వ ఇంధన సాంకేతికతతో పనిచేస్తుంది. అంటే అవసరాన్ని బట్టి అదే ఇంజిన్ ఎల్ఎన్‌జీతోనూ, డీజిల్‌తోనూ నడవగలదు. ఎల్ఎన్‌జీ అందుబాటులో లేని పరిస్థితుల్లో డీజిల్‌తో ప్రయాణాన్ని కొనసాగించవచ్చు. ఈ సౌలభ్యం ఈ ప్రయోగాన్ని మరింత ఆచరణాత్మకంగా మారుస్తోంది. సబర్మతి సమగ్ర కోచింగ్ డిపోలో 1,400హార్స్ పవర్‌సామర్థ్యం కలిగిన రెండు డ్రైవింగ్ పవర్ కార్లను ఈ ద్వంద్వ ఇంధన వ్యవస్థకు అనుగుణంగా మార్చారు. వీటిపై 2,000 కిలో మీటర్లకు పైగా ప్రయోగాత్మక పరీక్షలు నిర్వహించినతర్వాత సేవలోకి తీసుకొచ్చారు. అంటే సాంకేతికతను కేవలం ప్రయోగశాలలో పరీక్షించి పట్టాలపైకి తీసుకురాలేదు. వాస్తవ రైలు నిర్వహణ పరిస్థితుల్లోనూ దాని పనితీరును పరిశీలించిన తర్వాతే ప్రారంభించారు. ఈ ప్రయోగంలో ప్రధాన ఆకర్షణ డీజిల్ వినియోగాన్ని తగ్గించడమే. అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం ఈ వ్యవస్థలో సుమారు 40 శాతంవరకు డీజిల్ వినియోగాన్ని ఎల్ఎన్‌జీ భర్తీ చేయగలదని రైల్వే అంచనా వేస్తోంది. ఒక డ్రైవింగ్ పవర్ కారుకు సంవత్సరానికి సుమారు రూ.11.9 లక్షల వరకు ఇంధన వ్యయం తగ్గవచ్చని, ఎనిమిది బోగీల రైలుకు ఏడాదికి సుమారు రూ.23.9 లక్షల వరకు ఆదా ఉండవచ్చని పరీక్షల ఆధారంగా అంచనా వేసింది. ఇక్కడే అసలు ప్రశ్న వస్తుంది. రైల్వేకు ఇంధన వ్యయం తగ్గితే ప్రజలకు ప్రయోజనం ఏమిటి? ప్రత్యక్షంగా రైలు టికెట్ ధర తగ్గకపోయినా, రైల్వే నిర్వహణ వ్యయం తగ్గడం సంస్థ ఆర్థిక సామర్థ్యాన్ని పెంచుతుంది. దేశవ్యాప్తంగా ఇలాంటి సాంకేతికతను అవసరమైన మార్గాల్లో విస్తరించగలిగితే దీర్ఘకాలంలో ఇంధన వ్యయం, నిర్వహణ ఖర్చులు తగ్గే అవకాశం ఉంటుంది. అంతేకాదు, దిగుమతి చేసుకునే చమురు ఆధారాన్ని కొంత మేర తగ్గించడానికి కూడా ప్రత్యామ్నాయ ఇంధనాల వినియోగం తోడ్పడవచ్చు. మరో ముఖ్యమైన అంశం పర్యావరణం. డీజిల్ దహనం వల్ల కార్బన్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్లు, సూక్ష్మ ధూళికణాలు వంటి కాలుష్య కారకాలు విడుదలవుతాయి. ఎల్ఎన్‌జీ వినియోగంతో వీటి ఉద్గారాలను తగ్గించే అవకాశం ఉంది. అందువల్ల రైల్వే రవాణాను మరింత పర్యావరణహితంగా మార్చే ప్రయత్నాల్లో ఈ



సాంకేతికతకు స్థానం ఉంది. అయితే ఎల్ఎన్‌జీని పూర్తిస్థాయి పరిష్కారంగా చూడటం తొందరపాటు అవుతుంది. భారతీయ రైల్వే ఇప్పటికే విస్తృతంగా విద్యుదీకరణ దిశగా పయనిస్తోంది. విద్యుత్ రైళ్లు పెరుగుతున్న నేపథ్యంలో ఎల్ఎన్‌జీ రైళ్ల అవసరం ఏ మార్గాల్లో ఉంటుందన్నది భవిష్యత్తులో కీలకమైన ప్రశ్న. విద్యుదీకరణ సాధ్యం కాని లేదా ఆర్థికంగా తక్షణం సాధ్యంకానిమార్గాల్లో ప్రత్యామ్నాయ ఇంధన సాంకేతికతలు ఉపయోగపడవచ్చు. అందువల్ల ఎల్ఎన్‌జీని విద్యుత్‌కు ప్రత్యామ్నాయంగా కాకుండా, అవసరమైన చోట ఉపయోగపడే మధ్యంతర సాంకేతిక పరిష్కారంగా చూడటం సముచితం. ఇక మరోఅంశం ఇంధన మౌలికసదుపాయాలు. ఎల్ఎన్‌జీ రైలు పట్టాలపై పరుగులు తీయడం ఒక విషయం. దేశవ్యాప్తంగా వందలాది రైళ్లకు అవసరమైన ఎల్ఎన్‌జీ నిల్వ, రవాణా, నింపే కేంద్రాలు ఏర్పాటు చేయడం మరో విషయం. రైలు ఎక్కడ ఆగితే అక్కడ ఎల్ఎన్‌జీ అందుబాటులో ఉండేలా మౌలిక సదుపాయాలు లేకపోతే ఈ సాంకేతికత విస్తరణకు పరిమితులు ఏర్పడవచ్చు. కాబట్టి రైలు ప్రారంభంతో పాటు ఇంధన సరఫరా వ్యవస్థపైనా సమగ్ర ప్రణాళిక అవసరం. ఇదే సమయంలో భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి. ఎల్ఎన్‌జీ అత్యంత తక్కువ ఉష్ణోగ్రత వద్ద ద్రవ రూపంలో నిల్వ చేయబడుతుంది. దాని నిల్వ ట్యాంకులు, సరఫరా వ్యవస్థ, నింపే కేంద్రాలు, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలుఇవన్నీ అత్యున్నత భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలి. ప్రయాణికుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదు. భారతదేశం రవాణా రంగంలో కొత్త ఇంధనాల వైపు అడుగులు వేస్తున్న సమయంలో ఈ ప్రయోగానికి మరో ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. 2026లోనే దేశంలో ప్రత్యామ్నాయ ఇంధన ఆధారిత రైలు సాంకేతికతలపై దృష్టి పెరుగుతున్న నేపథ్యంలో ఎల్ఎన్‌జీ రైలు ఆ ప్రయాణంలో మరో అడుగుగా నిలిచింది. అయితే ఒక రైలును ప్రారంభించడం కంటే ఆ సాంకేతికతను విజయవంతంగా విస్తరించడం చాలా పెద్ద సవాలు. ఇంధనధరలు, సరఫరా స్థిరత్వం, నిర్వహణ ఖర్చులు, భద్రత, ఉద్గారాల వాస్తవ తగ్గింపు, విద్యుదీకరణతో పోలిస్తే దీర్ఘకాలిక ఆర్థికప్రయోజనం వంటి అంశాలపై నిరంతర అధ్యయనం అవసరం. ప్రయోగాత్మక దశలో వచ్చిన ఫలితాలు సానుకూలంగా ఉన్నప్పటికీ, దేశవ్యాప్త విస్తరణకు ముందు మరింత విస్తృతమైన అనుభవం అవసరం. భారతీయ రైల్వే కేవలం ప్రయాణ సాధనం కాదు. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక. కోట్లాది మంది ప్రజలను, వేలాది టన్నుల సరుకును ప్రతిరోజూ ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తీసుకెళ్లే ఈ వ్యవస్థలో చిన్న ఇంధన పొదుపు కూడా పెద్ద స్థాయిలో గణనీయమైన ఫలితాన్ని ఇవ్వగలదు. అందుకే ఎల్ఎన్‌జీ రైలు ప్రయోగాన్ని కేవలం ఒక కొత్త రైలు ప్రారంభంగా కాకుండా, రైల్వే ఇంధన విధానంలో జరుగుతున్న మార్పుకు సూచనగా చూడాలి. రేపటి రైల్వే ఎలా ఉండాలి? తక్కువ ఖర్చుతో, తక్కువ కాలుష్యంతో, అధిక సామర్థ్యంతో, సురక్షితంగా, అందుబాటులో ఉండే రవాణా వ్యవస్థగా ఉండాలి. ఆ లక్ష్యాన్ని చేరుకోవడానికి విద్యుత్, ఎల్ఎన్‌జీ, హైడ్రోజన్ వంటి వివిధ సాంకేతిక మార్గాలను శాస్త్రీయంగా పరిశీలించాల్సి ఉంటుంది. సబర్మతి పట్టాలపైకి వచ్చిన తొలి ఎల్ఎన్‌జీ రైలు అందుకే ఒక చిన్న ప్రయోగం కాదు. అది భారతీయ రైల్వే అడుగులు వేస్తున్న కొత్త ఇంధన మార్గానికి ఒక ప్రారంభ సంకేతం. ఈ ప్రయోగం ఎంతవరకు విజయవంతమవుతుంది? దేశ వ్యాప్తంగా ఎన్ని రైళ్లకు విస్తరిస్తుంది? నిజంగా ఎంత ఇంధనం, ఎంత వ్యయం, ఎంత కాలుష్యం తగ్గుతుంది? ఈ ప్రశ్నలకు సమాధానం రాబోయే సంవత్సరాల పనితీరే ఇవ్వాలి. పట్టాలపైకి వచ్చిన ఈ కొత్త రైలు ప్రయాణికులను మాత్రమే కాదు భారతీయ రైల్వే భవిష్యత్తును కూడా కొత్త దిశలో నడిపిస్తుందా? అన్నది కాలమే తేల్చాలి. •

# మత్తును వీడితేనే మేలైన భవిష్యత్తు!

డా.మోటె చిరంజీవి

మాదకద్రవ్యాల వినియోగం ఒక వ్యక్తి జీవితాన్ని మాత్రమే కాదు, కుటుంబాన్ని, సమాజాన్ని, చివరకు దేశ భవిష్యత్తును ప్రభావితం చేసే తీవ్రమైన సమస్య. ముఖ్యంగా యువతలో మత్తు పదార్థాల వినియోగం పెరగడం ఆందోళన కలిగించే అంశం. విద్య, ఉద్యోగ, ఉపాధి, ఆరోగ్యం, కుటుంబ సంబంధాలు, సామాజిక భద్రతపై దీని ప్రభావం పడుతోంది. అందుకే మాదకద్రవ్యాల వ్యతిరేక పోరాటాన్ని కేవలం పోలీసు వ్యవస్థకు పరిమితం చేయకుండా ప్రజా ఉద్యమంగా మార్చాల్సిన అవసరం ఉంది. ఈ లక్ష్యంతో కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వశాఖ 2020 ఆగస్టు 15న నషా ముక్త్ భారత్ అభియాన్‌ను ప్రారంభించింది. తొలుత 272 జిల్లాల్లో ప్రారంభమైన ఈ కార్యక్రమం 2023 ఆగస్టు నుంచి దేశంలోని అన్ని జిల్లాలకు విస్తరించింది. అవగాహన, సమాజ భాగస్వామ్యం, చికిత్స, పునరావాసం, తిరిగి సామాజిక జీవితంలోకి తీసుకురావడం ఈ కార్యక్రమంలో ప్రధానఅంశాలుగా ఉన్నాయి. 2026 జూలైలో కేంద్ర ప్రభుత్వం వెల్లడించిన వివరాల ప్రకారం, దేశవ్యాప్తంగా నషా ముక్త్ భారత్ అభియాన్ ద్వారా 29.68 కోట్లకు పైగా ప్రజలకు అవగాహన కల్పించగా, 28.29 లక్షల మందికి పైగా చికిత్స, పునరావాస సేవలు అందాయి. విద్యా సంస్థల్లోనూ పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. అయితే గణాంకాలు మాత్రమే సమస్యకు పరిష్కారం కావు. మత్తుకు బానిసైన వ్యక్తిని నేరస్థుడిగా మాత్రమే చూడటంవల్ల సమస్య మరింత సంక్లిష్టమవుతుంది. చికిత్స, కౌన్సెలింగ్, కుటుంబ సహకారం, పునరావాసం, ఉపాధి అవకాశాలు కల్పించడంకూడా అంతే ముఖ్యం. మాదకద్రవ్యాల వినియోగాన్ని తగ్గించడం తోపాటు, దాని బారిన పడిన వారికి తిరిగి గౌరవప్రదమైన జీవితం అందించే వ్యవస్థబలపడాలి. ఇందులో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, వైద్యులు, పోలీసులు, అందరూకీలక పాత్ర పోషించాలి. పాఠశాలలు, కళాశాలల్లో కేవలం హెచ్చరికలు ఇవ్వడం కాకుండా మానసిక ఆరోగ్యం, ఒత్తిడి నిర్వహణ, చెడు స్నేహాల ప్రభావం, మత్తు పదార్థాల వల్ల కలిగే దీర్ఘకాలిక నష్టాలపై నిరంతర అవగాహన అవసరం. మత్తు పదార్థాల సరఫరాను అరికట్టడం ఎంత అవసరమో, వాటికి డిమాండ్‌ను తగ్గించడం కూడా అంతే అవసరం. అందుకే నషా ముక్త్ భారత్ అభియాన్‌లో పోలీసు, ప్రభుత్వ విభాగాలు, వైద్య, విద్యా సంస్థలు, ప్రజా సంఘాలసమన్వయం కీలకం. ప్రభుత్వం కూడా ఈ కార్యక్రమాన్ని అవగాహనతో పాటు చికిత్స, పునరావాస సేవలతో అనుసంధానిస్తోంది. మత్తు నుంచి బయటపడాలనికోరుకునే వారికి సహాయం అందుబాటులో ఉందనే నమ్మకం కల్పించాలి. కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో 2018 లో నిర్వహించిన సమగ్రజాతీయ సర్వే మత్తుపదార్థాల వినియోగం తీవ్రతనుస్పష్టంగా వెల్లడించింది. దేశంలో సుమారు 16కోట్లమంది మద్యం, 3.1కోట్ల మంది గంజాయి ఉత్పత్తులు, 2.26కోట్ల మంది ఓపియాయిడ్లు వినియోగిస్తున్నట్లు సర్వే అంచనావేసింది. వీరిలో తీవ్రంగా ప్రభావితమైన వారికి చికిత్స, సహాయం అవసరమని కూడాసర్వే గుర్తించింది. ఓపియాయిడ్ల వినియోగదారుల్లో సుమారు 77లక్షలమందికి సహాయం అవసరమని అంచనావేసింది. అత్యంత ఆందోళన కలిగించే అంశం పిల్లలు, కిశోరుల పరిస్థితి. 10-17ఏళ్ల వయస్సులో సుమారు 40లక్షల మంది ఓపియాయిడ్లు, 20లక్షల మంది గంజాయి, 20లక్షలమంది సెడేటివ్స్, 30లక్షల మంది ఇన్హేలెంట్స్ వినియోగిస్తున్నట్లు 2018 సర్వేఅంచనా వేసింది. ఇవి ప్రస్తుత పరిస్థితికి సంబంధించిన తాజా లెక్కలు కావు. అందుబాటులో ఉన్న జాతీయ స్థాయి అధికారిక సర్వే గణాంకాలు. నషా ముక్త్ భారత్ అంటే మాదకద్రవ్యాలకు దూరంగా ఉండండి అనే నినాదం కాదు. యువతకు ఆరోగ్యకరమైన జీవితం, కుటుంబాలకు భద్రత, సమాజానికి బాధ్యత, బాధితులకు పునరావాసం కల్పించే సమగ్ర ఉద్యమం. మత్తును నిర్మూలించాలంటే భయంతో కాదు. అవగాహనతో ముందుకు సాగాలి. •

# ఆర్థిక వ్యవస్థలో అన్నదాత స్థానమెక్కడ?

గౌని ఐలయ్య

భారతదేశం ప్రపంచంలోనే నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని, 200 సంవత్సరాలు మన దేశాన్ని వలసగా పాలించిన బ్రిటన్‌ను కూడా దాటి ముందుకు పోయామని ప్రధాని, కేంద్రమంత్రులు గొప్పగా చెపుతున్నారు. 2047 నాటికి మన దేశాన్ని ప్రపంచంలోనే శక్తివంతమైన ఆర్థిక వ్యవస్థగా నిలబెట్టడం కోసం 'వికసిత్ భారత్' లక్ష్యంతో పనిచేస్తున్నామని, అందులో వ్యవసాయ అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని కూడా చెప్పున్నారు. దేశ జనాభాలో సగం మంది వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తుండడం, గ్రామీణ ప్రాంతాల్లో ఆ సంఖ్య 70 శాతానికి పైగా ఉండడం, రూపొందించుకున్న రాజ్యాంగం ప్రకారం ఐదు సంవత్సరాలకోసారి ఎన్నికలు జరిపి ప్రభుత్వాలని ఎన్నుకోవాల్సి వున్నకారణంగా వ్యవసాయ రంగం గురించి, రైతు కూలీల అభివృద్ధి గురించి అందరూ మాట్లాడక తప్పటం లేదు. స్వాతంత్ర్యం పొందిన కాలం నుండి వ్యవసాయ అభివృద్ధి, రైతాంగ అభివృద్ధి అనే మాటలు మాట్లాడని నేతలు లేరు, ప్రణాళికలు వేయని ప్రభుత్వాలు లేవు. స్వాతంత్ర్యం వచ్చిన గత 80 సంవత్సరాల నుండి అమలు చేస్తున్న ఈ ప్రణాళికలు, పథకాలు అన్నీ కాగితాలకే పరిమితమయ్యాయి తప్ప రైతు కూలీల నిజ జీవితాలలో మార్పులు తీసుకురాలేదు. ప్రపంచీకరణ విధానాలు, ప్రధానంగా ప్రపంచ వాణిజ్య సంస్థలో భారతదేశం భాగస్వామిగా చేరడం, వ్యవసాయ రంగాన్ని కూడా అందులో చేర్చడానికి అంగీకరించడం మన మెడకు ఉరి తాడుగా మారింది. అప్పటి నుండి రైతు కుటుంబాలు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యల బారిన పడటం పెరుగుతూనే వుంది. 1995 నుండి 2018 మధ్యకాలంలో సుమారు నాలుగు లక్షల మంది రైతుకూలీలు ఆత్మహత్యలు చేసుకున్నారు. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ దుస్థితి మరింత పెరిగింది. ఒక్క 2023 సంవత్సరంలోనే 10700 మంది రైతు కూలీలు ఆత్మహత్యలు చేసుకున్నారు. ప్రమాదకరంగా మారిన రైతు కూలీల దుస్థితికి ఇది అద్దం పడుతుంది. నరేంద్ర మోడీ ప్రభుత్వం రైతుల ఆదాయాన్ని 2022 నాటికి రెట్టింపు చేస్తామని, స్వామినాథన్ సిఫారసులకు అనుగుణంగా పంటలకు మద్దతు ధర ఇస్తామని హామీ ఇచ్చింది. వాటిని అమలు చేయకపోగా రైతు కూలీలకు నష్టకరమైన కార్పొరేట్ అనుకూల వ్యవసాయ విధానాలను ముందుకు తెచ్చింది. కరోనా కాలంలో తీసుకొచ్చిన మూడు వ్యవసాయ చట్టాలు రైతుల కోపాగ్నికి కారణమయ్యాయి. ఢిల్లీ కేంద్రంగా రైతాంగం సంవత్సర కాలానికి పైగా సాగించిన సమరశీల పోరాటం ఫలితంగా కేంద్ర ప్రభుత్వం ఆ చట్టాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించి, కనీస మద్దతు ధర చట్టం కోసం ఒక కమిటీని వేసింది. ఐదు సంవత్సరాలు గడిచినా అది ఇసుమంత కూడా ముందుకు సాగలేదు. పైగా మరో రూపంలో వాటిని తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నది. అందులో భాగంగానే డిజిటల్ అగ్రికల్చరల్ మిషన్, నేషనల్ పాలసీ ఫ్రేమ్ వర్క్ ఆన్ అగ్రికల్చర్ మార్కెట్, జాతీయ సహకారవిధానం పేరుతో కార్పొరేట్ అనుకూల చట్టాలను తీసుకువచ్చింది. రైతులకు తీవ్ర నష్టం కలిగించి కార్పొరేట్ శక్తులకు లాభం కలిగించేందుకు



ఇప్పుడు నూతన విద్యుత్ బిల్లు, విత్తన బిల్లులను సిద్ధం చేసింది. ఇప్పటికే విత్తన రంగంలో 100శాతం విదేశీ పెట్టబడులను అనుమతిస్తూ ఇప్పుడు విత్తనాలపై బహుళ జాతి సంస్థల ఆధిపత్యాన్ని సుస్థిరం చేయడానికి విత్తన బిల్లులో అవకాశం కల్పించారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించటంతో పాటు వ్యవసాయ రంగానికి, ఇతర పేద వర్గాలకు ఇస్తున్న ఉచిత విద్యుత్ పథకాలకు మంగళం పాడేందుకు డిస్కంల ఏర్పాటును, విద్యుత్ బిల్లును ముందుకు తెస్తున్నారు. అటవీ సంరక్షణ నియమాలు కూడా ఆదివాసి రైతు కూలీలకు, వారి హక్కులకు భంగం కలిగించేవే. ఒకవైపు రైతు కూలీల కనీస హక్కులు, సబ్సిడీలను రద్దు చేస్తూ వ్యవసాయ రంగంలో కార్పొరేట్ల చొరబాటుకుబాటలు వేస్తూ దానినే వ్యవసాయ రంగ అభివృద్ధిగా చెపుతున్నారు. ఇప్పటికే భారత రైతాంగం రుణభారంతో కునారిల్లుతున్నది. 52 శాతం వ్యవసాయ కుటుంబాలు అప్పుల్లో ఉన్నాయని గణాంకాలు తెలియజేస్తున్నాయి. వారిని అప్పుల ఊబినుండి బయట పడవేయడానికి ప్రభుత్వాలు తీసుకున్న చర్యలు శూన్యం. కేంద్రప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఇప్పటివరకు 20లక్షల కోట్లకు పైగా కార్పొరేట్ కంపెనీల అప్పులను రద్దు చేసింది. వారికి ప్రతి సంవత్సరం రెండు లక్షల కోట్లకు పైగా పన్ను రాయితీలిస్తుంది. కేవలం 5లక్షల కోట్ల రూపాయలు కేటాయిస్తే దేశంలోని రైతులను అప్పుల భారం నుండి బయటపడేయవచ్చు. కేంద్రం అలాంటి పని చేయకపోగా రాష్ట్రాలు ఎన్నికల హామీలలో భాగంగా అరకొరగా రైతుల రుణమాఫీ పథకాలు ప్రకటిస్తుంటే వాటి వల్ల బ్యాంకింగ్, ఆర్థిక వ్యవస్థలు దెబ్బతింటాయని కేంద్రమంత్రులు గగ్గోలు పెడుతున్నారు. ఒకవైపు బడా కార్పొరేట్ శక్తులకు భారీ రాయితీలు ఇస్తూ రైతు కూలీలకు మొండి చేయి చూపుతూ కేంద్ర ప్రభుత్వం రైతు కూలీల అభివృద్ధి గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా వుంది. ఇటీవల కాలంలో భారత ప్రభుత్వం అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తోను, యూరోపియన్ దేశాలతోనూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటున్నది. ఈ ఒప్పందాల వల్ల మన రైతులకు లాభం జరుగుతుందని ఊదరగొడుతున్నారు. ప్రపంచంలోనే వ్యవసాయరంగానికి అత్యధిక సబ్సిడీలు ఇస్తున్న దేశంఅమెరికా. అమెరికా రైతు సగటున 464 ఎకరాలలో సేద్యం చేస్తూ సుమారు ఆరు లక్షల రూపాయల సబ్సిడీని ప్రభుత్వం నుండి పొందుతున్నాడు. అమెరికాతో సహా పాశ్చాత్య దేశాలలో 25నుండి 60శాతం వరకు ప్రభుత్వ నుండి రాయితీలు పొందుతుండగా మన దేశంలో అది కేవలం 4 శాతం మాత్రమే. ఎరువులపై సబ్సిడీని ఎత్తివేస్తూ, వ్యవసాయ రంగానికి బడ్జెట్లో కోతలు విధిస్తూ రైతాంగం నెత్తిపై పెనుభారం మోపుతున్న మన ప్రభుత్వం విదేశీ ఉత్పత్తులతో 'స్వేచ్ఛగా' పోటీ పడమంటున్నారు. భారీ సబ్సిడీలతో సేద్యం చేస్తున్న దేశాల ఉత్పత్తులు తక్కువ ధరకే మన మార్కెట్‌ను ముంచెత్తుతుంటే వాటితో పోటీ పడమంటున్నారు. ప్రభుత్వానికే ఎదురు సబ్సిడీలు ఇస్తూ అప్పులఊబిలో దిగబడి చావలేక, బ్రతకలేక వ్యవసాయం చేస్తున్న మన రైతులకు అది సాధ్యం కానిపని. పైగా అమెరికా లాంటి అగ్రరాజ్యాల ఆదేశాలకు లొంగి విదేశీ వ్యవసాయ ఉత్పత్తులపై 113 శాతం వరకు సుంకాలు వేసే అవకాశం ఉన్నా వాటిని అతి తక్కువ శాతానికి, చివరకు జీరో సుంకాలకు అనుమతించడం మన రైతులను బలిపీఠంపై ఎక్కించడమే. ఇప్పటికే భారతీయ పత్తి రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. మనం ఎగుమతులు చేస్తున్న ఆహార వాణిజ్య ఉత్పత్తులను కూడా భారీ స్థాయిలో దిగుమతులు అనుమతించడంతో మన వ్యవసాయ రంగంకోలుకోలేని విధంగా నష్టపోతున్నది. కొద్దిమంది కార్పొరేట్ శక్తుల అభివృద్ధి మాత్రమే దేశాభివృద్ధి ఎంతమాత్రం కాదు. వారి సంపదను చూపించి ఇండియా బలమైన ఆర్థిక శక్తిగా అవతరించిందని చెప్పటం ఆత్మ వంచన తప్ప వేరుకాదు. దేశంలో రైతు కూలీల, అట్టడుగు వర్గ ప్రజల కేంద్రంగా అభివృద్ధి జరిగినప్పుడే అది నిజమైన అభివృద్ధి అవుతుంది. •

# ఇరాన్‌కు ఏ హామీ ఇవ్వలేదు
## ఆంక్షల సడలింపుపై ట్రంప్



**వాషింగ్టన్, సెప్టెంబరు 29:** ఇరాన్‌తో చర్చలు కొనసాగుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఇరాన్‌కు ఆంక్షల సడలింపు, నిలిపివేసిన నిధుల విడుదలకు తాను ఎలాంటి ప్రతిపాదన చేయలేదని స్పష్టం చేశారు. ఇరాన్‌పై ఆర్థిక ఆంక్షలను సడలించేందుకు అమెరికా సిద్ధమైందని వస్తోన్న వార్తలను ఆయన ఖండించారు. 'ఇది అవాస్తవం. నేను వారికి హామీ ఇవ్వలేదు' అని ట్రూత్ సోషల్‌లో ట్రంప్ పేర్కొన్నారు. అమెరికా అధికారులు మాత్రం ఇరాన్‌తో పరోక్ష చర్చలు కొనసాగుతున్నట్లు తెలిపారు. 'ఖతార్, పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో ఈ సంప్రదింపులు జరుగుతున్నాయి. అణు కార్యక్రమంపై ఇరాన్ స్పష్టమైన హామీలు ఇవ్వాలని అమెరికా కోరుతోంది' అని చెబుతున్నారు.

**ఇరాన్ దాడుల్లో యుఎస్ సైనికులకు గాయాలు:** ఇరాన్ దాడిలో ఎనిమిది మంది అమెరికా సైనికులు తీవ్రంగా గాయపడిన విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. ఈ నెల 14న హార్మూజ్ జలసంధిలో ప్రయాణిస్తున్న ఓ నౌకపై ఇరాన్ క్షిపణి దాడి చేసినట్లు అమెరికా అధికారులు తెలిపారు. దాడి సమయంలో అందులో ఉన్న ఎనిమిది మందికి గాయాలయ్యాయి. ఈ ఘటనను అమెరికా ప్రభుత్వం బహిరంగంగా వెల్లడించనప్పటికీ.. తాజాగా సైనికుల గాయాల వివరాలు వెలుగులోకి వచ్చాయి. ఇరాన్‌తో చర్చలు కొనసాగుతున్న సమయంలోనే ఇది బయటపడటం ప్రాధాన్యం సంతరించుకుంది. యుద్ధ తీవ్రతను తక్కువ చేసి చూపించడానికే ట్రంప్ ప్రభుత్వం ఈ విషయాన్ని దాచిపెట్టిందనే విమర్శలు వస్తున్నాయి. హార్మూజ్ జలసంధి సంక్షోభం, ప్రాంతీయ ఉద్రిక్తతలను తగ్గించేందుకు ఖతార్ మధ్యవర్తుల ద్వారా అమెరికాతో ఇరాన్ మరోసారి పరోక్ష చర్చలు జరిపిందని ఆ దేశ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ తెలిపారు.

న్యూయార్క్‌లో జరిగిన ఈ చర్చలకు సంబంధించి అమెరికా స్పందన కోసం వేచి చూస్తున్నట్లు చెప్పారు. త్వరలోనే సమాధానం రావచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# 'ఇసి ఐనెట్'లో మార్పులు చేయండి



**సర్'లో స్థానిక సిబ్బందికి మరిన్ని అధికారాలివ్వాలి ఇసికి లేఖ రాసిన మహారాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి**

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 29:** కేంద్ర ఎన్నికల సంఘంలో ఇద్దరు ఎన్నికల కమిషనర్లు సుఖ్ బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషీకు తెలియకుండా ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకొంటున్నారని ఆంగ్లపత్రిక కథనం బయటపెట్టిన తర్వాత ఈసీ ఈ ఆరోపణల్ని ఖండించింది. తామంతా ఏకగ్రీవంగానే నిర్ణయాలు తీసుకుంటున్నట్లు చెబుతోంది. ఈ నేపథ్యంలోనే ఎన్నికల కమిషనర్లు వ్యక్తం చేసిన అభ్యంతరాలకు బలం చేకూర్చేలా మహారాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి కమిషన్ కు ఓ లేఖ రాశారు. ఈ లేఖను అదే ఆంగ్లపత్రిక బయటపెట్టడంతో మరోసారి కలకలం మొదలైంది. సీఈసీ జ్ఞానేష్ కుమార్ తనపై వచ్చిన ఆరోపణలపై తాజాగా ఇద్దరు కమిషనర్లతో సమావేశమై ఓ వివరణ ప్రకటన విడుదల చేశారు. అనంతరం అభ్యంతరాలు ఉన్న అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు చెప్పుకొచ్చారు. గతంలో ఇదే ఇద్దరు ఎన్నికల కమిషనర్లు గుర్తించిన ఓ అంశంపై మహారాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి చోకలింగం కమిషన్ కు రాసిన లేఖ బయటికి వచ్చింది. ఇందులో చోకలింగం ఎస్ఐఆర్ లో స్థానిక సిబ్బందికి మరిన్ని అధికారాలు కల్పించాలని కోరారు. ప్రస్తుతం ప్రత్యేక ఓటర్ల జాబితాల సవరణ నోటీసు దశలో ఉన్న అతిపెద్ద రాష్ట్రమైన మహారాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అయిన చోకలింగం ఈసీఐనెట్ సాఫ్ట్‌వేర్‌లో 4 మార్పులు కోరుతూ గత వారం ఎన్నికల కమిషన్‌కు ఈ లేఖ రాశారు. ఏ తార్కిక వ్యత్యాసాల కేసులకు విచారణ అవసరమో, ఏ పత్రాలను అంగీకరించాలో, ఏ వ్యత్యాసాలను వారే స్వయంగా పరిష్కరించుకోగలరో నిర్ణయించేందుకు ఈఆర్వోలకు అనుమతి ఇవ్వాలని మహారాష్ట్ర సీఈఓ చోకలింగం చేసిన అభ్యర్థనలు, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి ఇప్పటికే వ్యక్తం చేసిన ఆందోళనలను ప్రతిబింబిస్తున్నాయి. ఈ సాఫ్ట్‌వేర్ ఈఆర్వోల అధికారాలను తగ్గిస్తోందని ఇద్దరు ఎన్నికల కమిషనర్లు అధికారికంగా గుర్తించినట్లు ఆంగ్లపత్రిక పరిశోధనలో వెల్లడైన ఒక రోజు తర్వాత సెప్టెంబర్ 24న సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ మనీష్ గార్గ్, ఐటీ డైరెక్టర్ జనరల్ సీమా ఖన్నా , ఇద్దరు సచివాలయ అధికారుల్ని ఉద్దేంచి మహారాష్ట్ర సీఈఓ ఈ లేఖ రాశారు. ఇప్పటికే ఆగస్టు 31న ప్రచురించిన మహారాష్ట్ర ముసాయిదా ఓటర్ల జాబితాలో రాష్ట్ర ఓటర్ల సంఖ్యను 21.1 శాతం తగ్గించారు. తుది జాబితా నవంబర్ 16న వెలువడనుంది. ఈ నేపథ్యంలో బయటికి వచ్చిన ఈ లేఖ ఈఆర్వోలకు అధికారాలు ఇవ్వకుండా ఈసీ చేస్తున్న అరాచకాన్ని బయటపెట్టేలా ఉందని విపక్షాలు విమర్శలకు దిగాయి. బీజేపీకి అత్యంత ప్రభావవంతమైన స్టార్ క్యాంపెయినర్‌గా అవతరించిన ఎన్నికల సంఘం కేంద్రీకృత సాఫ్ట్‌వేర్‌కు అభినందనలంటూ కాంగ్రెస్ నేత రణ్ దీప్ సూర్జేవాలా ట్వీట్ చేశారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్ ఆధ్వర్యంలో సంస్థాగత విశ్వసనీయత పూర్తిగా దెబ్బతినడం ఇప్పుడు రికార్డుల్లో పూర్తిగా బట్టబయలైందని, ఎన్నికల సంఘం కుమ్మక్కుతో ఉందా, ఒక ప్రైవేట్ పార్టీ మార్గదర్శకత్వంలో పనిచేస్తోందా అని కలకత్తా హైకోర్టు బహిరంగంగా ప్రశ్నిస్తుండగా, సీఈసీని తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ దాఖలైన కొత్త పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ జరుపుతోందని గుర్తుచేశారు. ఇప్పుడు, మహారాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అత్యంత ఆందోళన కలిగించే విషయాలను ధృవీకరించారన్నారు.

ఢిల్లీ నుండి ఒక కేంద్రీకృత ఐటీ వ్యవస్థ ద్వారా ఎన్నికల యంత్రాంగాన్ని క్రమపద్ధతిలో హైజాక్ చేస్తున్నారన్నారు. ఓటర్లను ఈ విధంగా తొలగిస్తున్నారంటూ ఆయన పలు ఉదాహరణలను షేర్ చేశారు. భారత ప్రజాస్వామ్యం పూర్తిగా తుడిచిపెట్టుకుపోయేలోపు, మోసపూరితమైన సర్ ప్రక్రియను రద్దు చేసి, సీఈసీని అరెస్టు చేసి జవాబుదారీగా చేయాలని కోరారు.




# హెచ్1బి మోసాలపై ట్రంప్ సర్కార్ ఉక్కుపాదం

**వాషింగ్టన్, సెప్టెంబరు 29:** హెచ్1 బీ వీసా కార్యక్రమంలో మోసాలపై ట్రంప్ సర్కార్ ఉక్కుపాదం మోపుతున్నది. విదేశీ కార్మికుల వీసాల్లో మోసం, ఉద్యోగుల దోపిడీ, మానవ అక్రమ రవాణా ఆరోపణలపై అమెరికా కార్మిక శాఖ దర్యాప్తు ముమ్మరం చేసింది. ఈ నేపథ్యంలో హెచ్1బీ వీసా కార్యక్రమం ఏడాది తర్వాత ప్రస్తుత రూపంలో ఉండకపోవచ్చని అమెరికా కార్మిక శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆంథోనీ డి ఎస్పొసిటో హెచ్చరించారు. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని సంకేతమిస్తూ "మా దగ్గర చేతులకు బేడీలు సిద్ధంగా ఉన్నాయి" అని ఆయన అన్నారు. అమెరికన్ యూట్యూబర్ బెన్నీ జాన్సన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో డి ఎస్పొసిటో ఈ వ్యాఖ్యలు చేశారు. విదేశీ కార్మికుల వీసా కార్యక్రమం 365 రోజులు తర్వాత ప్రస్తుతం ఉన్నదాని కంటే చాలా భిన్నంగా ఉండబోతోంది" అని అన్నారు. హెచ్1 బీ వీసా కార్యక్రమంలో చోటుచేసుకున్నట్లు ఆరోపణలు ఉన్న మోసాలు, ఉద్యోగుల దోపిడీ, మానవ అక్రమ రవాణాపై అమెరికా కార్మిక శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ కార్యాలయం దేశవ్యాప్తంగా దర్యాప్తు కొనసాగిస్తున్నది. ఈ నేపథ్యంలో టెక్ దిగ్గజ సంస్థలు కాగ్నిజంట్, క్లౌడెరాకు సంబంధించిన వీసా దరఖాస్తులను నేర దర్యాప్తు పూర్తయ్యే వరకు నిలిపివేసినట్లు కూడా తెలిపింది. విదేశీ కార్మికుల కార్యక్రమాలను దుర్వినియోగం చేశారనే అనుమానాలున్న సంస్థలు, విధానాలపై దర్యాప్తు కొనసాగుతున్నదని డి ఎస్పొసిటో తెలిపారు.

## మరోసారి భగ్గుమంటున్న సిమెంట్ ధరలు!

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 29:** సిమెంట్ ధరలు మరోసారి పెరగనున్నాయి. సెప్టెంబర్‌లో దేశవ్యాప్తంగా సిమెంట్ బస్తా సగటు ధర రూ.7 పెరగ్గా అక్టోబర్‌లో మరో రూ.5 నుంచి రూ. 20 వరకు పెంచే అవకాశం ఉందని సెంట్రమ్ బ్రోకింగ్ నివేదిక తెలిపింది. అయితే పెంచిన ధరలను కంపెనీలు ఎంతకాలం కొనసాగించగలవన్నది డిమాండ్ పరిస్థితులపై ఆధారపడి ఉంటుందని పేర్కొంది. సెప్టెంబర్‌లో దేశవ్యాప్తంగా సిమెంట్ బస్తా సగటు ట్రేడ్ ధర రూ.356కు చేరింది. జులై, ఆగస్టులో ధరలు దాదాపు స్థిరంగా ఉండగా.. సెప్టెంబర్‌లో మాత్రం ధరల పెరుగుదల కనిపించింది. ట్రేడ్ సెగ్మెంట్‌తో పాటు నాన్‌ట్రేడ్ విభాగంలోనూ ధరలు పెరిగాయని సెంట్రమ్ తెలిపింది. అయితే కొన్ని ప్రాంతాల్లో కంపెనీలు పెంచిన ధరల భారాన్ని డీలర్లు పూర్తిగా వినియోగదారులపై మోపలేదు. ఇదిలా ఉంటే పెరిగిన ఇంధన ఖర్చులు సిమెంట్ కంపెనీలపై ఒత్తిడి పెంచుతున్నాయి. దీంతో అధిక ధరలను అమలు చేసి కొనసాగించడం కంపెనీలకు మరింత కీలకంగా మారొచ్చని నివేదిక పేర్కొంది. రెండో త్రైమాసికంలో సిమెంట్ డిమాండ్ సాధారణ స్థాయి కంటే బలహీనంగా ఉన్నప్పటికీ సీజనల్ మందగమనంతో పోలిస్తే తగ్గుదల తక్కువగానే ఉందని తెలిపింది. త్రైమాసికం చివర్లో కొన్ని మార్కెట్లలో నిర్మాణ కార్యకలాపాలు పుంజుకోవడంతో అక్టోబర్‌లో మరోసారి ధరలు పెంచేందుకు కంపెనీలకు అవకాశం ఏర్పడిందని పేర్కొంది.

ప్రాంతాల వారీగా చూస్తే సెప్టెంబర్‌లో దక్షిణ భారతదేశంలో సిమెంట్ ధరలు అత్యధికంగా రూ.11 పెరిగాయి. పశ్చిమ భారతంలో రూ.9, మధ్య, తూర్పు, ఉత్తర భారతంలో ఒక్కో బస్తాపై రూ.5 చొప్పున ధరలు పెరిగాయి. అయితే ఢిల్లీఎన్‌సీఆర్‌లో నిర్మాణ కార్యకలాపాలపై రాబోయే ఆంక్షలు సిమెంట్ డిమాండ్‌పై ప్రభావం చూపొచ్చని నివేదిక తెలిపింది.

# యుపిలో పది రాజ్యసభ స్థానాలకు నామినేషన్లు షురూ!

**లక్నో, సెప్టెంబరు 29:** ఉత్తర్ ప్రదేశ్‌లో ఖాళీ అవుతోన్న 10 రాజ్యసభ స్థానాలకు వచ్చేనెల 16న ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన నామినేషన్ ప్రక్రియ మంగళవారం నుంచి ప్రారంభమైంది. ఈ పది స్థానాల కోసం బీజేపీ , సమాజ్‌వాదీ పార్టీల మధ్యే ప్రధాన పోటీ నెలకుంది. వచ్చే ఏడాది మార్చి ఏప్రిల్‌లో ఉత్తర్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సామాజిక సమీకరణాలను దృష్టిలో ఉంచుకుని అభ్యర్థుల ఎంపికపై బీజేపీ కసరత్తు ప్రారంభించింది. లక్నోలో జరిగిన కోర్ కమిటీ సమావేశంలో పలువురు పేర్లను చర్చకు వచ్చాయి. త్వరలోనే జరగనున్న బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశంలో ఈ పేర్లను ఖరారు చేయనున్నారు. ప్రధానంగా బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శులు స్మృతి ఇరానీ , హారీష్ ద్వివేదిలను బరిలోకి దించే అవకాశం ఉంది. వీరితో పాటు వరుణ్ గాంధీ , సంజీవ్ బలియాన్, సత్యపాల్ సింగ్ పేర్లను కూడా పరిశీలించినట్టు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. బీఎల్ వర్మ, గీతా శక్యాల పదవీకాలం ముగుస్తుండటంతో వారిని మళ్లీ పంపే అవకాశం ఉంది. అలాగే స్టేట్ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ప్రకాష్ పాల్, రేఖా వర్మల పేర్లు పరిశీలనలో ఉన్నాయి. దళిత నేత బ్రిజ్‌లాల్ స్థానంలో యువ నేతకు అవకాశం ఇవ్వాలని భావిస్తున్నారు. జాట్ నేతలు కేంద్ర మాజీ మంత్రి సంజీవ్ బాలియాన్, మాజీ ఎంపీ సత్యపాల్ సింగ్‌ల పేర్లను కూడా పరిశీలించినట్టు సమాచారం. పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర మంత్రి హార్దీప్ సింగ్ పురీని తిరిగి రాజ్యసభకు పంపుతారని తెలుస్తోంది. ప్రస్తుతం ఎంపీలుగా ఉన్న నీరజ్ శేఖర్, అరుణ్ సింగ్‌లను యూపీ ఎన్నికల్లో పోటీ చేయించే అవకాశం ఉంది. ఇక, రెండు స్థానాలను గెలుచుకోగల సంఖ్యాబలమున్న ఎస్పీ మూడో అభ్యర్థిని కూడా పోటీకి దింపే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది.

ఆ పార్టీ నుంచి సీనియర్ నేత రామ్ గోపాల్ యాదవ్‌కు మళ్లీ ఛాన్స్ ఇవ్వనున్నారని సమాచారం. మాజీ ఐఏఎస్ అధికారి అలోక్ రంజన్, సలీమ్ ఇక్బాల్ పేర్లు కూడా వినిపిస్తున్నాయి. మొత్తం 403 స్థానాలున్న యూపీ శాసనసభలో ప్రస్తుతం 396 మంది ఉన్నారు. ఒక్కో అభ్యర్థికి 37 మంది ఎమ్మెల్యేల మొదటి ప్రాధాన్యత ఓట్లు అవసరం. బీజేపీకి సొంతంగా 255 మంది, మిత్రపక్షాలకు 33 అప్నా దళ్ (సోనెలాల్) 13, రాష్ట్రీయ లోక్ దళ్ 9, సుహెల్‌దేవ్ భారతీయ సమాజ్ పార్టీ 6, నిషాద్ పార్టీ 5) ఈ సంఖ్యా బలంతో బీజేపీ ఏడు సీట్లను సునాయాసంగా గెలుచుకోగలదు. ఎన్డీయే కూటమి వద్ద 33 మిగులు ఓట్లు ఉంటాయి. ఎనిమిదో సీటు గెలవడానికి బీజేపీకి కేవలం మరో 4 ఓట్లు మాత్రమే అవసరం. జనసత్తా దళ్ (లోక్‌తాంత్రిక్) పార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేల మద్దతుతో పాటు మిగిలిన ఓట్లను సాధించడం బీజేపీకి పెద్ద కష్టం కాకపోవచ్చు. ఎస్పీకి మూడో సీటు సాధించడం కొంత కష్టమే. ఆ పార్టీకి 101 మంది ఎమ్మెల్యేలు ఉండగా కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరుతో మొత్తం 103 మంది అవుతారు.

ఇద్దరు అభ్యర్థులను గెలిపించిన తర్వాత ఎస్పీ వద్ద 29 ఓట్లు మాత్రమే ఉంటాయి. మూడో సీటు గెలవాలంటే ఎస్పీకి అదనంగా 8 మంది ఎమ్మెల్యేలు కావాలి. రాజ్యసభ ఎన్నికల్లో విప్ వర్తించదు కాబట్టి పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా ఓటు వేసినా ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దు కాదు. దీంతో 10వ సీటును దక్కించుకోవడానికి బీజేపీ, ఎస్పీలు ఇతర పార్టీల ఎమ్మెల్యేలను ఆకర్షించేందుకు, క్రాస్ ఓటింగ్‌ను ప్రోత్సహించేందుకు శతవిధాలా ప్రయత్నించే అవకాశం ఉంది.

# స్పామ్ కాల్స్‌పై ట్రాయ్ తీవ్ర ఆంక్షలు




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 29:** స్పామ్ కాల్స్‌తో విసిగిపోతున్న మొబైల్ వినియోగదారుల కు ఊరటనిచ్చేలా టెలికామ్ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా ట్రాయ్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై వినియోగదారుల నుంచి ఫిర్యాదులు అందకపోయినా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికత సాయంతో స్పామ్ కాల్స్‌కు అడ్డుకట్ట వేయాలని టెలికామ్ సంస్థల ను ఆదేశించింది. ఈ మేరకు టెలికాం కమర్షియల్ కమ్యూనికేషన్స్ కస్టమర్ ప్రిఫరెన్స్ రెగ్యులేషన్స్‌లో నూతన నిబంధనలను పొందుపరిచింది. కొత్త నిబంధనల ప్రకారం టెలికామ్ కంపెనీలు తమ ఏఐ లేదా మెషీన్ లెర్నింగ్ వ్యవస్థల ద్వారా ఏదైనా కాల్‌ను స్పామ్‌గా గుర్తిస్తే ఆ సమాచారాన్ని రెండు గంటల్లోపు సంబంధిత ఆపరేటర్‌కు నివేదించాలి. సదరు ఆపరేటర్ ఒక వర్కింగ్ డే వ్యవధిలో ఆ నంబర్‌కు సంబంధించిన కేవైసీ వివరాలను సేకరించి, ఇతర టెలికామ్ సంస్థలతో పంచుకోవాలి. గడిచిన 10 రోజుల్లో ఒకే వ్యక్తి లేదా సంస్థకు చెందిన ఐదు కంటే ఎక్కువ నెంబర్‌లు స్పామ్‌గా నమోదైతే అన్ని టెలికామ్ సంస్థలు సమన్వయంతో కఠిన చర్యలు చేపడతాయి. స్పామర్లపై కఠిన చర్యలను కూడా ట్రాయ్ ప్రతిపాదించింది. ఏఐ విశ్లేషణలో మొదటిసారి స్పామర్‌గా నిర్ధారణ అయితే సదరు వ్యక్తి పేరిట ఉన్న అన్ని కనెక్షన్లపై 15 రోజులపాటు అవుట్‌గోయింగ్ సేవలను నిలిపివేస్తారు. నిబంధనలను అతిక్రమిస్తూ మళ్లీ అదే తప్పు చేస్తే ఆ నెంబర్లను ఏడాదిపాటు బ్లాక్‌లిస్ట్‌లో ఉంచుతారు. అటువంటి వారికి ఏ టెలికామ్ సంస్థ కూడా కొత్త కనెక్షన్‌లను జారీ చేయదు. వినియోగదారుల సౌలభ్యం కోసం మరికొన్ని మార్పులను కూడా ట్రాయ్ సూచించింది.

# ప్రాణాంతక వ్యాధుల చికిత్సమందులపై జీరో టారిఫ్
## భారత్‌తోపాటు 20 దేశాలకు అమెరికా రాయితీలు



**వాషింగ్టన్, సెప్టెంబరు 29:** అమెరికా తమ దేశంలోకి దిగుమతి అయ్యే కొన్ని రకాల ప్రాణాంతక వ్యాధుల మందులు, వాటి తయారీలో వాడే కీలక పదార్థాలపై ఎలాంటి అదనపు రవాణా పన్నులు (యాడ్ వాలోరెమ్ టారిఫ్‌లు) వేయకూడదని కీలక నిర్ణయం తీసుకుంది. భారత్‌తో సహా 20 దేశాలకు ఈ రాయితీ ఇస్తున్నట్లు అమెరికా వాణిజ్య శాఖ అధికారికంగా ఒక నోటీసు విడుదల చేసింది. సెప్టెంబర్ 29 నుంచి పేటెంట్ పొందిన కొన్ని రకాల మందుల దిగుమతులపై ఏకంగా 100 శాతం పన్ను విధించేందుకు వాషింగ్టన్ సిద్ధమవుతున్న సమయంలో ఈ నిర్ణయం రావడం విశేషం. తీవ్రమైన జబ్బులకు వాడే మందులు, సంతానలేమి చికిత్సలు, సెల్ థెరపీ, జీన్ థెరపీ, యాంటీబాడీడ్రగ్ కాంజుగేట్స్, అలాగే జంతువులకు వాడే మందులతో పాటు వీటి తయారీకి ఉపయోగించే కీలక కాంపోనెంట్లకు కూడా పన్నుల నుంచి పూర్తిగా మినహాయింపు లభించింది. ఇక్కడ యాడ్ వాలోరెమ్ పన్ను అంటే ఒక వస్తువు ధర ఆధారంగా నిర్ణయించే ఒక నిర్దిష్ట శాతం. అమెరికాతో ఇప్పటికే వర్తక, భద్రతా ఒప్పందాలు ఉన్న లేదా భవిష్యత్తులో చేసుకోబోయే దేశాలకే ఈ పన్ను మినహాయింపు ప్రయోజనం లభిస్తుందని అధికారులు స్పష్టం చేశారు. ఈ జాబితాలో భారతదేశంతో పాటు అర్జెంటీనా, బంగ్లాదేశ్, కంబోడియా, ఈక్వెడార్, ఎల్ సాల్వడార్, యూరోపియన్ యూనియన్, గౌతమాలా, ఇండోనేషియా, జపాన్, జోర్డాన్, మలేషియా, నార్త్ మాసిడోనియా, దక్షిణ కొరియా, స్విట్జర్లాండ్, లీచ్టెన్‌స్టెయిన్, తైవాన్, థాయ్‌లాండ్, బ్రిటన్, వియత్నాంలు ఉన్నాయి. తమ దేశీయ పరిశ్రమలను ప్రోత్సహించే లక్ష్యంతో అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏప్రిల్ 2న ఒక కీలక ఆదేశం ఇచ్చారు. ట్రేడ్ ఎక్స్‌పాన్షన్ యాక్ట్‌లోని సెక్షన్ 232 కింద పేటెంట్ పొందిన ఫార్మా ఉత్పత్తులపై 100 శాతం పన్ను విధించాలని నిర్ణయించారు. ఈ పన్ను జూలై 31 నుంచే కొన్ని కంపెనీలకు అమల్లోకి రాగా, మిగిలిన సంబంధిత కంపెనీలన్నింటికీ సెప్టెంబర్ 29 నుంచి వర్తించనుంది.

అయితే సాధారణంగా అందరూ వాడే జెనెరిక్ మందులకు మాత్రం ఈ 100 శాతం టారిఫ్ బాదుడు నుంచి ఊరట లభించింది. జెనెరిక్ ఫార్మా ఉత్పత్తులకు ఈ పన్నులు వర్తించవని వాణిజ్య శాఖ స్పష్టం చేసింది. అంతేకాకుండా పేటెంట్ లేని జంతువుల ఆరోగ్య ఉత్పత్తులను కూడా ఈ మినహాయింపు పరిధిలోకి తెస్తూ కొన్ని సాంకేతిక మార్పులు చేసింది. ఈ నిబంధనల కింద ఫార్మా ఉత్పత్తులు అంటే కేవలం సిద్ధంగా ఉన్న మందులే కాకుండా, వాటి తయారీకి వాడే యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రీడియంట్స్, ప్రాథమిక ముడి పదార్థాలు మాత్రమే వస్తాయని అమెరికా స్పష్టతనిచ్చింది.

# రాబోయే ఐదుతరాలు గాంధీ కుటుంబం నుంచి ప్రధాని కాలేరు!
## ఎస్పీనేత ఐపిసింగ్ తీవ్ర విమర్శలు

**ముంబయి, సెప్టెంబర్29:** వచ్చే ఏడాది మొదల్లో ఉత్తర్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు జరగబోతునున్నాయి. ఈ నేపథ్యంలో పార్టీలు ప్రచార పర్వాన్ని ఇప్పుడే ప్రారంభించాయి. ఇదిలా ఉంటే, సీట్ల పంపకాల్లో మాత్రం సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ), కాంగ్రెస్ పార్టీ మధ్య తీవ్ర విభేదాలు ఏర్పడింది. 150 పైగా సీట్లు కావాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ఎస్పీ నేత ఐపీ సింగ్ తీవ్రంగా విమర్శించారు. లూటియన్స్ కాంగ్రెస్ వాళ్లు యూపీలో మొత్తం 403 స్థానాల్లో పోటీ చేస్తారు. రాబోయే 5 తరాల వరకు ఏ గాంధీ అని పిలువబడే వ్యక్తి ప్రధానమంత్రి కాలేరు. 1989 నుంచి గాంధీ కుటుంబం ప్రధాని పదవిని చేపట్టలేదు. రాబోయే అనేక దశాబ్దాల్లో కూడా ఇదే జరుగుతుంది" అని తీవ్ర స్థాయితో ఐపీ సింగ్ ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నేతలు ఢిల్లీలో కూర్చుని పగటి కలలు కంటున్నారని వెక్కిరించారు. కాంగ్రెస్ వ్యూహాకర్తలను టార్గెట్ చేస్తూ.. యూపీలో కాంగ్రెస్‌కు అంత బలం ఉంటే 403 స్థానాల్లో ఒంటరిగా పోటీ చేసి తన బలాన్ని ఎందుకు పరీక్షించుకోకూడదని ప్రశ్నించారు. పొత్తులు, రాజకీ పరిణామాలనే ఊతకర్రలతో ప్రజల్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు ఇంకెంత కాలం సాగుతాయి రాహుల్ గాంధీ రాజకీయాల్లోకి ప్రవేశించి రెండున్నర దశాబ్దాలు గడిచాయని, తరాలు మారాయి, కానీ కాంగ్రెస్ ఇప్పటికీ అవే ప్రశ్నల్ని ఎదుర్కొంటోందని ఘాటుగా స్పందించారు. కాంగ్రెస్ సాధించింది ఏంటని ప్రశ్నించారు. కేవలం కెమెరాలు, వేదికలు, పెద్ద పెద్ద ప్రకటనలు మాత్రమే రాజకీయ పునాదిని నిర్మించ లేదని హితవు చెప్పారు. క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకర్తల బలం, ఓటర్లతో నిరంతర సంబంధం రాజకీయ సంస్థకు అసలైన బలమని అన్నారు.

# అభివృద్ధిఫలాలు అందరికీ అందినపుడే అసలైన ప్రగతి
## ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 29:** అభివృద్ధి ఫలాలు సమాజంలోని అట్టడుగున ఉన్న చివరి వ్యక్తికి అందాలని, వారి ముఖంలో చిరునవ్వు కనిపించినప్పుడే దేశం సుభిక్షంగా ఉంటుందని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) సర్ సంఘచాలక్ మోహన్ భగవత్ పేర్కొన్నారు. మహారాష్ట్రలోని యవత్మాల్‌లో పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. అభివృద్ధి అంటే అందరినీ ఒకే స్థాయికి తీసుకురావడం కాదని, సమాజంలోని హెచ్చుతగ్గులను, వివిధ వర్గాల మధ్య ఉన్న అంతరాన్ని వీలైనంతగా తగ్గించడమేనని ఆయన స్పష్టం చేశారు.

కొంతమందికే గరిష్ఠ ప్రయోజనం చేకూరాలన్న వాదనను తాను వ్యతిరేకిస్తున్నానని, దీనదయాళ్ ఉపాధ్యాయ ఆశించినట్లుగా అందరికీ మేలు జరగాలని భగవత్ ఆకాంక్షించారు.



# ఢిల్లీ హెడ్‌కానిస్టేబుల్‌పై దాడిచేసిన ఆప్ కార్యకర్తలు!

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 29:** దేశరాజధాని ఢిల్లీలోని వెస్ట్ ఢిల్లీ తిలక్ నగర్ ప్రాంతంలో తీవ్ర కలకలం రేగింది. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్, మాజీ ముఖ్యమంత్రి అర్వింద్ కేజ్రీవాల్ పర్యటన సందర్భంగా ఊహించని ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. సాదాసీదా దుస్తుల్లో ఉన్న ఒక ఢిల్లీ పోలీసు హెడ్ కానిస్టేబుల్‌పై ఆప్ కార్యకర్తలు దాడికి పాల్పడటం తీవ్ర ఆందోళన రేకెత్తించింది. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు కెమెరాకు చిక్కడంతో సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కేజ్రీవాల్ తిలక్ నగర్ పర్యటనలో ఉన్న సమయంలో విధి నిర్వహణలో భాగంగా ఒక హెడ్ కానిస్టేబుల్ సివిల్ డ్రెస్‌లో ఉంటూ మొబైల్ ఫోన్‌లో దృశ్యాలను రికార్డ్ చేస్తున్నారు. దీనిని గమనించిన ఆప్ శ్రేణులు ఒక్కసారిగా సదరు పోలీసు అధికారిని చుట్టుముట్టారు. అతడిని నెట్టివేస్తూ.. హేళన చేస్తూ తీవ్రంగా గొడవ చేశారు.

ఫ్లైఓవర్ కిందకు తీసుకువెళ్లి అతడు బయటకు వెళ్లకుండా అడ్డుకున్నారు. పోలీసు అధికారులు తమ సహచర సిబ్బందిని అతికష్టం మీద బయటకు తీసుకువచ్చారు.

# సంక్షిప్త వార్తలు

## ఇరాన్‌ను దారుణంగా దెబ్బతీసాం: ట్రంప్

**వాషింగ్టన్, సెప్టెంబరు 29:** ఇరాన్‌తో నెలకొన్న వివాదంలో అమెరికా త్వరలోనే విజయం సాధిస్తుందని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ధీమా వ్యక్తం చేశారు. ఇటీవల ఒక ప్రముఖ మీడియా ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ సైనిక, ఆర్థిక ఒత్తిళ్ల ద్వారా ఇరాన్‌ను కట్టడి చేస్తున్నామని వెల్లడించారు. అమెరికాలో జరగనున్న మధ్యంతర ఎన్నికలకు ముందే ఇరాన్‌పై సైనిక దాడులు జరిపే అవకాశం ఉందా? అన్న ప్రశ్నకు ట్రంప్ స్పందిస్తూ మేము అలా చేస్తామని కచ్చితంగా చెప్పను కానీ, అది సాధ్యమే అని వ్యాఖ్యానించారు.

## బలోచ్ ఆర్మీలో మహిళా కంబాట్‌యూనిట్



**క్వెట్టా, సెప్టెంబరు 29:** పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో వేర్పాటువాద కార్యకలాపాలు నిర్వహిస్తున్న బలూచిస్థాన్ లిబరేషన్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) సంచలన ప్రకటన చేసింది. తమ కొత్త మహిళా కాంబాట్ యూనిట్ కరీమా ఆర్మ్డ్ అసాల్ట్ డివిజన్ (కేఏఏడీ) తొలి ఆపరేషన్లలో 9 మంది పాక్ సైనికులను హత మార్చినట్లు ఆ సంస్థ ప్రకటించుకుంది. ఇందుకు సంబంధించిన ఒక వీడియోను కూడా విడుదల చేసింది. ప్రతినిధి మేజర్ గ్వాహ్రామ్ బలోచ్ ప్రకారం, ఈ నెల 22న టర్బట్ సమీపంలోని సీపెక్ హైవేపై పాకిస్థాన్ సైనిక కాన్వాయ్‌పై తమ మహిళా ఫైటర్లు దాడి చేశారు. ఈ ఘటనలో ఆరుగురు సైనికులు మరణించారని ఆయన తెలిపారు.

## అమెరికా మోస్ట్ వాంటెడ్ జాబితాలో గోల్డీబ్రార్



న్యూయార్కు, సెప్టెంబరు 29: భారత్‌కు చెందిన గ్యాంగ్‌స్టర్ సతిందర్‌జీత్ సింగ్ అలియాస్ గోల్డీ బ్రార్‌ను అమెరికా ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) తమ "టాప్ 10 మోస్ట్ వాంటెడ్" జాబితాలో చేర్చింది. అతడి ఆచూకీ తెలిపి అరెస్టుకు సహకరించిన వారికి మిలియన్ డాలర్ల (సుమారు రూ. 8.3 కోట్లు) భారీ రివార్డును సోమవారం ప్రకటించింది. లాస్ ఏంజిల్స్ ఎఫ్‌బీఐ విభాగం ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించింది. గోల్డీ బ్రార్, లారెన్స్ బిష్ణోయ్ నేర సామ్రాజ్యంలో ఉత్తర అమెరికా కార్యకలాపాలకు నాయకుడిగా వ్యవహరిస్తున్నాడని ఎఫ్‌బీఐ ఆరోపించింది.

## అసోం రైఫిల్స్‌పై మిలిటెంట్ల దాడులు - జవాన్ మృతి

**ఇటానగర్, సెప్టెంబరు 29:** అరుణాచల్ ప్రదేశ్‌లో దారుణం జరిగింది. భద్రతా దళాల్లో కీలక విభాగమైన అసోం రైఫిల్స్ బృందాలపై ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ఒక జవాన్ మృతిచెందగా, మరో నలుగురు గాయపడ్డారు. ఈ ఘటన అరుణాచల్ ప్రదేశ్, చంగ్లాంగ్ జిల్లాలో ఇండియామయన్మార్ సరిహద్దులో మంగళవారం జరిగింది. ఉదయం 6.30 గంటల సమయంలో 21 అసోం రైఫిల్స్ బృందానికి చెందిన జవాన్లు నాంపోంగ్ నల్లా ప్రాంతంలో సాధారణ పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. ఇది ఇండియామయన్మార్ సరిహద్దు కావడంతో ఇక్కడ కంచె ఏర్పాటు చేస్తున్నారు.

## సిఇసి జ్ఞానేశ్‌పై సుప్రీంలో పిల్!



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 29:** చీఫ్ ఎలక్షన్ కమీషనర్ జ్ఞానేశ్ కుమార్ తన విధులను నిర్వర్తించకుండా అడ్డుకునేందుకు సుప్రీంకోరు లో పిల్ దాఖలైంది. అయితే ఆ పిల్‌పై వచ్చే వారం విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని బెంచ్ ఆ పిల్‌పై వాదనలు విననున్నది. రాకేశ్ కుమార్ సింగ్ ఆ పిల్‌ను దాఖలు చేశారు. అయితే అర్జెంట్‌గా వాదనలు వినాలని కోరుతూ సీనియర్ న్యాయవాది వికాశ్ సింగ్ కోరారు. ఎన్నికల కమిషన్‌లో నిర్ణయాలు ఏకపక్షంగా తీసుకుంటే, సమస్య తీవ్రమవుతుందని కోర్టుకు తెలిపారు.

## జెట్ ఇంజిన్ కావేరి డ్రై రన్ విజయవంతం



**మాస్కో, సెప్టెంబరు 29:** భారత్ స్వదేశీ టెక్నాలజీతో అభివృద్ధి చేసిన జెట్ ఇంజన్ కావేరి సత్తా చాటింది. రష్యాలో నిర్వహించిన కావేరి ఇంజన్ డ్రైరన్‌లో కీలక మైలురాయిని చేరుకుంది. రష్యాలో నిర్వహించిన హైఆల్టిట్యూడ్, ఫ్లైట్ ట్రయల్స్‌లో అనుకున్నదాని కన్నా మరింత సమర్థవంతంగా పనిచేసింది. ఈ టెస్టుల్లో ఇంజన్ గరిష్టంగా 48.5 కిలోన్యూటన్ల డ్రై థ్రస్ట్ సాధించినట్లు తాజా రక్షణ రంగ నివేదికలు పేర్కొన్నాయి. నిర్దేశించిన 46 కిలోన్యూటన్ల థ్రస్ట్ లక్ష్యాన్ని అధిగమించింది. డిఆర్డీవోకు చెందిన గ్యాస్ టర్బైన్ రీసెర్చ్ ఎస్టాబ్లిష్‌మెంట్ అభివృద్ధి చేసింది.

# తిరుమల సమాచారం



## రేపు విఐపి బ్రేక్ దర్శనం రద్దు

### - అక్టోబరు 5న బ్రేక్ దర్శనాలు నిలుపుదల

**తిరుమల, సెప్టెంబరు 29 ప్రభాతవార్త ప్రతినిధి:** సాలకట్ల బ్రహ్మోత్సవాలు ముగిసిన వారం రోజులకు మళ్ళీ భక్తుల రద్దీ విపరీతంగా కొనసాగుతోంది. రెండు రోజులుగా తిరుమలలో వైకుంఠమ్2 క్యూకాంప్లెక్స్ కంపార్టుమెంట్లన్నీ నిండిపోయి శిలాతోరణం వరకు వెలుపల క్యూలైన్లు వ్యాపించాయి. మంగళవారం కూడా తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. సర్వదర్శనానికి 26గంటల సమయం పడుతోంది. ఈ నేపథ్యంలో అక్టోబరు 1, 5 తేదీల్లో విఐపి బ్రేక్ దర్శనాలు టిటిడి రద్దు చేసింది. సామాన్య భక్తుల సౌకర్యార్థం టిటిడి ఈ నిర్ణయం తీసుకుంది. ప్రొటోకాల్ ప్రముఖులకు మాత్రం మినహాయింపునిచ్చింది. రెండు రోజుల బాటు సిఫార్సు లేఖలు స్వీకరించబోమని వెల్లడించారు. పెరటాసి మాసం కావడంతో రద్దీ మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ కారణంగానే సామాన్య భక్తులకు త్వరితగతిన శ్రీవారి దర్శనం కల్పించేందుకు బ్రేక్ దర్శనాలు రద్దు నిర్ణయం తీసుకున్నారు. బ్రేక్ దర్శనాలు రద్దు చేసిన తేదీలకు సంబంధించి ముందు రోజుల్లో నేడు, అక్టోబర్ 4 తేదీల్లో ఎలాంటి సిఫార్సు లేఖలను స్వీకరించబోమని టిటిడి స్పష్టం చేసింది. భక్తులు ఈ మార్పులను గమనించి టిటిడికి సహకరించాలని విజ్ఞప్తి చేసింది.

## శ్రీవారి ఆశీస్సులతోనే కొత్త ప్రాజెక్ట్ ప్రారంభిస్తున్నా

### • ఎస్వీబిసి చైర్మన్ శ్రీధర్‌వర్మతో నటుడు నవీన్ చంద్ర



**తిరుమల, సెప్టెంబరు 29 ప్రభాతవార్త ప్రతినిధి:** తాను చేపట్టదలచిన పనులు ఆటంకం లేకుండా నెరవేరాలని ఏడుకొండల వేంకటేశ్వర స్వామిని ప్రార్థించానని నటుడు నవీన్‌చంద్ర తెలిపారు. స్వామివారి ఆశీస్సులు అందుకోవడంతో తిరుమల నుండే కొత్త ప్రాజెక్ట్ ప్రారంభిస్తున్నానన్నారు. దర్శకుడు శ్రీకాంత్‌తో కలిసి మళ్ళీ కాంబినేషన్‌లో చేస్తున్న ఈ రెండో చిత్రం ప్రేక్షకులకు ఒక పెద్ద సర్‌ప్రైజ్‌గా ఉండబోతోందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో తనవి తమిళంలో మూడు చిత్రాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు. ఎస్వీబిసి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన బి.శ్రీధర్‌వర్మను కలసి అభినందించినట్లు నవీన్ చంద్ర తెలిపారు. మంగళవారం ఉదయం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని విఐపి విరామ సమయంలో దర్శించుకున్నారు. స్వామి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు నవీన్ చంద్రకు వేదాశీర్వచనం అందించారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేసి, పట్టువస్త్రంతో సత్కరించారు.

## శ్రీవారి సేవలో ప్రముఖులు



తెలంగాణ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

**తిరుమల, సెప్టెంబరు 29 ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవం తిరుమలేశుని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. విఐపి ప్రారంభ దర్శన సమయంలో టిటిడి మాజీ ఇఒ దొండపాటి సాంబశివరావు, రాష్ట్ర మాజీ ఎన్నికల అధికారి నిమ్మగడ్డ రమేష్ కుమార్, తెలంగాణ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి వేర్వేరుగా స్వామివారి సేవలో పాల్గొన్నారు. టిటిడి అధికారులు దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామివారిని దర్శించుకొని స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. రాష్ట్రంలో వర్షాలు సకాలంలో కురిసి రైతులకు అండగా ఉండాలని ప్రార్థించానని తెలంగాణ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి అన్నారు.

## పూర్వ డిప్యూటీ ఇఒ లోకనాథంకు బెయిల్



**తిరుపతి, సెప్టెంబరు 29 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్న కేసులో ఎసిబి అరెస్ట్ చేసి జైల్లో ఉన్న టిటిడి తిరుమల ఆలయ పూర్వ డిప్యూటీ ఇఒ ఎం.లోకనాథంకు న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. ఆయనకు కండిషనల్ బెయిల్ మంజూరుచేస్తూ నెల్లూరు ఎసిబి కోర్టు న్యాయమూర్తి ఉత్తర్వులిచ్చారు. ఈనెల 2వతేదీ ఆయనపై ఎసిబి దాడులు చేయడం, ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నాడనే కేసులో అరెస్ట్ చేసిన విషయం విదితమే. 27రోజులపాటు జైల్లో ఉన్న లోకనాథంకు కండిషన్ బెయిల్ రావడంతో ఆయన నెల్లూరు జైలు నుండి విడుదలయ్యారు. కాగా తిరుపతిలోని ఆయన ఇంట్లో ఉంటూ ప్రతి మంగళ, శుక్ర, ఆదివారాలు తిరుపతి ఎసిబి అధికారుల ఎదుట హాజరుకావాల్సి ఉంటుంది. అంతేగాక ఆయన పాస్‌పోర్టును ఎసిబి అధికారులకు అందజేయాల్సి ఉంటుంది.

## ఆ ప్రాజెక్టులు అడ్డుకోండి: కెఆర్ఎంబికి ఎపి లేఖ

**విజయవాడ, సెప్టెంబరు 29 ప్రభాతవార్తప్రతినిధి:** తెలంగాణలో చేపడుతున్న పలు సాగునీటి ప్రాజెక్టులను అడ్డుకోవాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కెఆర్ఎంబి)కి లేఖ రాసింది. అక్టోబరు 1న జరగనున్న కెఆర్ఎంబి సమావేశం అజెండాలో ఈ అంశాలను చేర్చి చర్చించాలని కోరింది. ముఖ్యంగా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నిర్మాణాన్ని అడ్డుకోవాలని ఎపి ప్రభుత్వం కోరింది. కల్వకుర్తి, అచ్చంపేట, మక్తల్- నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకం, రేలంపాడు రిజర్వాయర్, గూడెందొడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ సామర్థం పెంపు అంశాలపైనా అభ్యంతరాలు వ్యక్తం చేసినట్టు సమాచారం. అలాగే పులిచింతల బ్యాక్‌వాటర్‌పై ప్రతిపాదించిన రాజీవ్‌గాంధీ ఎత్తిపోతల పథకం (బుద్ధమాధవరం), జాన్‌పహాడ్ ఎత్తిపోతల పథకం, బెట్టెతాండా ఎత్తిపోతల పథకం, నక్కగూడెం, ముక్త్యాల పథకాలను కూడా అడ్డుకోవాలని ఎపి ప్రభుత్వం కోరినట్టు తెలుస్తోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన కృష్ణా నదీ జలాల్లో 811 టిఎంసిలను ఎపి, తెలంగాణ మధ్య 512:299 నిష్పత్తిలో పంచేలా ఆదేశాలు జారీ చేయాలని కెఆర్ఎంబిని రాష్ట్ర ప్రభుత్వం కోరింది.

# రూఫ్ టాప్ సోలార్‌లో ఎపిఎస్‌పిడిసిఎల్ రికార్డు

### • లక్షకు పైగా సర్వీసులను గ్రిడ్‌కు అనుసంధానం చేసిన తొలి విద్యుత్ పంపిణీ సంస్థగా గుర్తింపు • గ్రిడ్‌కు అనుసంధాన ప్రక్రియ మరింత వేగవంతం • సిఎండి శివశంకర్ లోతేటి



**తిరుపతి, సెప్టెంబరు 29 ప్రభాతవార్త ప్రతినిధి:** ఒక లక్ష ఇది కేవలం ఒక సంఖ్య మాత్రమే కాదు.. స్వచ్ఛమైన ఇంధనం, ఇంధన పొదుపు, పర్యావరణ పరిరక్షణ దిశగా గత 6నెలల కాలంలోనే ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ సాధించిన ఒక ముఖ్యమైన అడుగు. సాంప్రదాయేతర ఇంధన వనరుల వినియోగాన్ని ప్రోత్సహించడంలో భాగంగా యుటిలిటీ లెడ్ అగ్రిగేషన్ (యుఎల్ఎ) విధానంలో ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు సౌర విద్యుత్తును అందుబాటులోకి తీసుకువచ్చే పనులను ఎపిఎస్‌పిడిసిఎల్ వేగవంతం చేసింది. ఎస్సీ, ఎస్టీ విద్యుత్ వినియోగదారుల గృహాలపై రూఫ్ టాప్ సోలార్ వ్యవస్థలను ఏర్పాటు చేసి, వాటిని గ్రిడ్‌కు అనుసంధానం చేసే క్రమంలో ఎపిఎస్‌పిడిసిఎల్ ఒక లక్ష సర్వీసుల మైలురాయిని చేరుకుంది. రాష్ట్రం లోని మూడు విద్యుత్ పంపిణీ సంస్థల పరిధిలో అమలు చేస్తున్న రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్స్ పనుల్లో ఒక లక్షకు పైగా సర్వీసులను గ్రిడ్‌కు అనుసంధానం చేసిన తొలి విద్యుత్ పంపిణీ సంస్థగా ఎపిఎస్పిడిసిఎల్ నిలిచింది. యుటిలిటీ లెడ్ అగ్రిగేషన్ (యుఎల్ఎ) విధానంలో రికార్డు స్థాయిలో ఒక లక్ష సోలార్ వ్యవస్థలను ఏర్పాటుచేసి ఎస్‌పిడిసిఎల్ జాతీయస్థాయిలోని విద్యుత్ పంపిణీ సంస్థల్లో అగ్రగామిగా నిలవడం, అదేవిధంగా సోలార్ వ్యవస్థల ఏర్పాటులో జాతీయస్థాయిలో ఆంధ్రప్రదేశ్ 4వ స్థానంలో నిలవడం గొప్ప విషయం.

**పిఎం సూర్యఘర్‌లోనూ:** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పిఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం కింద దేశవ్యాప్తంగా ఒక కోటి రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్స్ ను ఏర్పాటు చేయాలనే లక్ష్యంలో భాగంగా నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో 415 మెగావాట్ల సామర్థంతో 2.07 లక్షల ఎస్సీ, ఎస్టీ వినియోగదారుల గృహాలపై రూఫ్ టాప్ సోలార్ వ్యవస్థలను ఏర్పాటు చేయడంపై ఎపిఎస్‌పిడిసిఎల్ ప్రత్యేక దృష్టి సారించింది. ఈ పనుల్లో భాగంగా ప్రస్తుతం నూతన, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ (ఎంఎన్ఆర్ఇ) పోర్టల్ యుటిలిటీ లెడ్ అగ్రిగేషన్ (యుఎల్ఎ) అధికారిక గణాంకాల మేరకు 210 మెగావాట్ల సామర్థ్యంతో ఒక లక్ష గృహాలపై సోలార్ వ్యవస్థలను ఎపిఎస్‌పిడిసిఎల్ ఏర్పాటు చేసింది. మిగిలిన గృహాలకు కూడా సోలార్ ఏర్పాటు పనులను త్వరితగతిన పూర్తి చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది.

**చారిత్రాత్మక మైలురాయి:** ఎస్సీ, ఎస్టీ కుటుంబాల గృహాలపై ఏర్పాటు చేసిన రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థల్లో ఒక లక్ష సర్వీసులను గ్రిడ్‌కు అనుసంధానం చేయడం ఎస్‌పిడిసిఎల్‌కు గర్వకారణమని సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ కుటుంబాల గృహాలపై కూడా రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలను ఏర్పాటు చేసి, వాటిని గ్రిడ్‌కు అనుసంధానం చేయడమే తదుపరి లక్ష్యం. నిర్ణీత లక్ష్యాన్ని పూర్తి చేసే వరకు ఇదే వేగం, సమన్వయం, అంకితభావంతో ముందుకు సాగుతామని వివరించారు.

## మలేరియాను నియంత్రించండి

### • రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కె.వి.ఎన్. చక్రధరబాబు



మలేరియా నియంత్రణ చర్యలపై జరిగిన కార్యశాలలో ప్రసంగిస్తున్న ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కె.వి.ఎన్. చక్రధరబాబు

**విజయవాడ, సెప్టెంబరు 29 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో మలేరియా కేసుల నియంత్రణలో నిర్లక్ష్యం, అలసత్వం, జాప్యాన్ని ఎంతమాత్రం సహించేది లేదని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కె.వి.ఎన్. చక్రధరబాబు అధికారులను హెచ్చరించారు. కేసులు పెరిగిన తర్వాత స్పందించడం అధికారుల పని కాదని.. కేసులు పెరగకుండా ముందే గుర్తించి అడ్డుకోవడమే బాధ్యత అని స్పష్టం చేశారు. ఒక్క మలేరియా కేసును కూడా తేలికగా తీసుకోవద్దని, ముఖ్యంగా గిరిజన, మారుమూల, అధిక ప్రమాద ప్రాంతాల్లో అప్రమత్తతను మరింత పెంచాలని ఆదేశించారు. ముందస్తు నిఘా, సత్వర పరీక్షలు, సకాలంలో చికిత్స, దోమల నియంత్రణ, మందుల పూర్తి లభ్యత.. ఈ ఐదు అంశాల్లో ఎక్కడా లోపం ఉండకూడదని చక్రధరబాబు స్పష్టం చేశారు. విజయవాడలో మంగళవారం జరిగిన 28 జిల్లాల అధికారుల రాష్ట్రస్థాయి కార్యశాలలో మలేరియా పరిస్థితి, వ్యాధుల నిఘా, క్షేత్రస్థాయిలో దోమల నియంత్రణ, మందుల లభ్యత, సిబ్బంది పనితీరు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఐహెచ్ఐపి-ఐడిఎస్‌పి సమాచారం, ఏవేర్, ఎడిఎస్ వ్యవస్థల వినియోగం, క్రియాశీల-సాధారణ నిఘా, దోమల నియంత్రణ చర్యలు, మలేరియా నివారణ మందుల నిల్వలు, సిబ్బంది సామర్థ్య పెంపుపై చర్చించారు. ప్రతి జిల్లాలో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఏ ప్రాంతంలో కేసులు పెరుగుతున్నాయో ముందుగానే గుర్తించి, అక్కడ వెంటనే నియంత్రణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

## రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలి

### కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ



**భీమవరం, సెప్టెంబరు 29 ప్రభాతవార్త:** ఎన్నికల సంఘంపై 'ఓట్ చోర్' పేరుతో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ నిరాధార ఆరోపణలు చేస్తున్నారని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ విమర్శించారు. తమ రాజకీయ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే రాజ్యాంగబద్ధ సంస్థపై ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. భీమవరం బిజెపి కార్యాలయంలో జిల్లా నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓట్లు ఉద్దేశపూర్వకంగా తొలగించారన్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. ఎన్నికల సంఘం అభ్యంతరాల కోసం పబ్లిక్ డొమైన్‌లో ఉంచిన ముసాయిదా ఓటర్ల జాబితాను తప్పుగా ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ముసాయిదాలో మరణించిన వారు, ఆచూకీ లేని వారు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు, డూప్లికేట్ ఓటర్ల వివరాలు ఉన్నాయని చెప్పారు. ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు ఉంటే ఫారం7, ఫారం8 ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఓటరు నమోదు ప్రక్రియను ఎన్నికల సంఘం పారదర్శకంగా నిర్వహిస్తోందని పేర్కొన్నారు. ఫారం6లో ఎలాంటి అక్రమ మార్పులు చేయలేదని, ఓటర్ల సౌకర్యం కోసం గతంలో వేర్వేరుగా ఉన్న ప్రక్రియలను సరళీకరించారని తెలిపారు. ఎన్నికల్లో గెలిచినప్పుడు ఈవీఎంలపై నమ్మకం వ్యక్తం చేసి, ఓడిపోయినప్పుడు వాటిపై అనుమానాలు వ్యక్తం చేయడం విపక్షాల ద్వంద్వ వైఖరికి నిదర్శనమని శ్రీనివాస వర్మ విమర్శించారు. రాహుల్ గాంధీ గతంలో చేసిన పలు ఆరోపణలు వివాదాస్పదమయ్యాయని పేర్కొంటూ, ఇప్పుడు ఎన్నికల సంఘంపై చేస్తున్న ఆరోపణలకు దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలపై విమర్శలు చేసే ముందు ప్రతిపక్షాలు బాధ్యతా యుతంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. సమావేశంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సుభాష్ రాజు, కాయిత సురేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి తోట గంగరాజు, భీమవరం మండలాధ్యక్షుడు వబిలిశెట్టి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మైనింగ్ దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం వద్దు

### • అధికారులకు గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ఆదేశాలు



**విజయవాడ, సెప్టెంబరు 29 ప్రభాతవార్త ప్రతినిధి:** మైనింగ్ దరఖాస్తులకు సంబంధించి నిరభ్యంతర పత్రం జారీ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా నిర్దేశిత గడువుల్లోనే దరఖాస్తులను పరిష్కరించాలని గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ముకేష్ కుమార్ మీనా అధికారులను ఆదేశించారు. ఓఎంఐపిఎస్ 2.0 ద్వారా అమలు చేస్తున్న కాలపరిమితితో కూడిన ఎన్ఓసి ప్రక్రియను పక్కాగా అమలు చేయాలని స్పష్టం చేశారు. మైనింగ్ దరఖాస్తుల పరిష్కారంలో మైన్స్, రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, ప్రజలకు, దరఖాస్తుదారులకు ఇబ్బందులు లేకుండా చేయాలని ముకేష్ కుమార్ మీనా ఆదేశించారు. మైన్స్, జియాలజీ శాఖ అధికారులు, ఆయా జిల్లాల జాయింట్ కలెక్టర్లు, జిల్లా అటవీ శాఖ అధికారులు, జిల్లా మైన్స్ అండ్ జియాలజీ, రెవెన్యూ శాఖకు చెందిన అధికారులతో ముకేష్ కుమార్ మీనా మంగళవారం సచివాలయం నుంచి హైబ్రిడ్ విధానంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మైనింగ్ దరఖాస్తుల పరిష్కారం, ఎన్ఓసిల జారీ, పెండింగ్ దరఖాస్తులు, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల పురోగతి అంశాలపై సమీక్షించారు. ఓఎంఐపిఎస్ 2.0లో దరఖాస్తులపై తీసుకున్న ప్రతి చర్య, నమోదు చేసిన వ్యాఖ్యలు, పత్రాల అప్‌లోడ్, తదుపరి అధికారికి పంపిన వివరాలు ఇలా అన్ని ఆన్‌లైన్‌లో నమోదవుతాయని అధికారులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. పెండింగ్ దరఖాస్తులపై ఉన్నతస్థాయిలో కూడా పర్యవేక్షణ జరిగేలా ఈ విధానం రూపు దిద్దుకుందన్నారు. ఈ సమావేశంలో మైన్స్ అండ్ జియాలజీ శాఖ డైరెక్టర్ డబ్ల్యూ.బి. చంద్రశేఖర్, అదనపు డైరెక్టర్ డి. శ్రీనివాసరావు, జాయింట్ డైరెక్టర్ జి. శ్రీనివాస్ చౌదరి సచివాలయం నుంచి పాల్గొన్నారు. రాష్ట్రంలోని 26 జిల్లాలకు చెందిన జాయింట్ కలెక్టర్లు, జిల్లా అటవీ అధికారులు, జిల్లా మైన్స్ అండ్ జియాలజీ అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు.

## మద్యం రవాణా స్కాం కేసు

## రజత్ భార్గవ్‌ను విచారించిన సిట్

**విజయవాడ, సెప్టెంబరు 29 ప్రభాతవార్త ప్రతినిధి:** వైసిపి ప్రభుత్వ హయాంలో ఎక్సైజ్ శాఖ స్పెషల్ సిఎస్‌గా పనిచేసిన మాజీ ఐఎఎస్ అధికారి రజత్ భార్గవ్‌ను సిట్ అధికారులు మంగళవారం విచారించారు. సుమారు రెండు గంటల పాటు ప్రశ్నించారు. మద్యం రవాణా టెండర్లలో జరిగిన భారీ కుంభకోణంపై సిట్ లోతైన దర్యాప్తు చేస్తోంది. మద్యం రవాణా కాంట్రాక్టుల అప్పగింతలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారనేది ప్రధాన ఆరోపణ. దీనిపై రజత్‌భార్గవ్‌ను సిట్ అధికారులు ప్రశ్నించారు. ప్రభుత్వ జిఒలకు విరుద్ధంగా అప్పటి బేవరేజెస్ ఎండి వాసుదేవరెడ్డి వ్యవహరిస్తున్నా మీరెందుకు పట్టించుకోలేదని అధికారులు పట్టి,పట్టి ప్రశ్నించినట్లు కీలక సమాచారం. సిట్ అధికారుల ప్రశ్నలకు రజత్ భార్గవ్ బదులు ఇచ్చేందుకు ఇబ్బంది పడ్డట్లు సమాచారం. ఆయన నాటి పరిణామాలపై తాను ప్రభుత్వానికి ముందే సమాచారం అందించానని బదులిచ్చినట్లు సమాచారం. ఆయన నుంచి అధికారులు అడిగిన కీలక ప్రశ్నలకు మాత్రం సరైన సమాధానాలు చెప్పకుండా దాటవేశారని తెలిసింది. విచారణలో ఆయన ఇచ్చిన సమాధానాలను సిట్ అధికారులు రికార్డు చేసుకున్నారు. సరైన సమాధానాలు రాకపోవడంతో అవసరమైతే మాజీ ఐఎఎస్ రజత్ భార్గవ్‌ను సిట్ అధికారులు మరోసారి విచారణకు పిలిచే అవకాశం ఉందంటున్నారు.

## రేవంత్‌ది లౌకికవాది ముసుగు: మాధవ్

**అమరావతి, సెప్టెంబరు 29 ప్రభాతవార్త ప్రతినిధి:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పవిత్రమైన అంశాలపై ఒక ముసుగు లౌకికవాదిగా మాట్లాడటం చాలా దురదృష్టకరమని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ వ్యాఖ్యానించారు. శివుడు, విష్ణువు, శక్తి ఇవన్నీ ఒకే పరమ సత్యానికి ప్రతిరూపాలు అన్నారు. మంగళవారం మాధవ్ మీడియాతో మాట్లాడుతూ "ఇదే మన భారతీయ తత్వశాస్త్రం. మనం వీరి మధ్య ఎలాంటి భేదాన్ని చూడం. ఒకే పరమ తత్వానికి త్రిమూర్తులుగా, వివిధ రూపాలుగా చూస్తాం. దురదృష్టవశాత్తూ మన ధర్మం, భారతీయ జీవన విధానం, సంస్కృతికి సంబంధించిన ప్రాథమిక అంశాలను అర్థం చేసుకోలేని వ్యక్తులు ఈ విషయాలపై మాట్లాడుతున్నారు. భారతీయ జనతా పార్టీ ఎన్నడూ శ్రీరాముడిని ఎన్నికల లేదా రాజకీయ ప్రయోజనాల కోసం ఒక చిహ్నంగా ఉపయోగించలేదు. శ్రీరాముడు మన గర్వానికి, మన జాతీయతకు ప్రతీక. శ్రీరాముని పాలననే రామరాజ్యం అంటాం. ప్రజలకు సుపరిపాలన, సంక్షేమం, సమృద్ధి అందించే పరిపాలనే రామరాజ్య స్ఫూర్తి. అటువంటి పరిపాలనను మన దేశంలో తీసుకురావాలన్నదే మా లక్ష్యం అన్నారు. భారతదేశం ప్రపంచానికి మార్గనిర్దేశం చేసే స్థాయిలో, అత్యున్నత స్థానంలో నిలిచేలా చేయాలన్నదే మా ఆకాంక్ష" మాధవ్ అన్నారు.

## 'కల్తీ మద్యం పేరుతో వైసిపి దుష్ప్రచారం'

**విజయవాడ, సెప్టెంబరు 29 ప్రభాతవార్త ప్రతినిధి:** కల్తీ మద్యం పేరుతో వైకాంగ్రెస్‌పార్టీ దుష్ప్రచారానికి కుట్ర చేస్తోందని మంత్రి కొల్లు రవీంద్ర ఆరోపించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ మద్యం బాటిల్ ప్రామాణికత తెలుసుకునేందుకు స్కాన్ చేయండని సూచించారు. బాటిల్ మూతపై ఉన్న క్యూఆర్‌ను ఎక్సైజ్ సురక్ష యాప్‌లో స్కాన్ చేయొచ్చని తెలిపారు. 2026-27లో 3,652షాపులకు దరఖాస్తులు ఆహ్వానం పలకగా, 2,929 మద్యం దుకాణాల రెన్యువల్‌కు దరఖాస్తులు వచ్చాయన్నారు. మిగిలిన 799దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుందని తెలిపారు. అక్టోబరు 5న కలెక్టర్ల ఆధ్వర్యంలో డ్రా ద్వారా మద్యం షాపులు కేటాయిస్తామన్నారు. 13 రకాల పరీక్షల తర్వాతే మద్యం విక్రయాలకు అనుమతి దక్కుతుందన్నారు. త్వరలో దుకాణాల్లోనే మద్యం నాణ్యత పరీక్షించేలా ఏర్పాట్లు చేస్తామని, ప్రతి మద్యం దుకాణంలో సిసి కెమెరాలు తప్పనిసరి మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

## వైద్యకళాశాలల ప్రొఫెసర్లకు పదోన్నతి

**విజయవాడ, సెప్టెంబరు 29 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రభుత్వ వైద్యకళాశాలలు, బోధనాస్పత్రుల్లో పనిచేసే ప్రొఫెసర్లుకు పదోన్నతి పొందారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది, కర్నూలు ప్రభుత్వ బోధనాస్పత్రిలో ప్రొఫెసర్‌గా ఉన్న డాక్టర్ ప్రభాకర్ రెడ్డి నంద్యాల జిజిహెచ్ సూపరింటెండెంట్‌గా నియమితులయ్యారు. డాక్టర్ పి.బుజ్జిబాబు (రేడియాలజీ ప్రొఫెసర్‌ఆంధ్ర వైద్య కళాశాల) పాడేరు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా, డాక్టర్ జి.బాలేశ్వరి (పాథాలజీ ప్రొఫెసర్, కర్నూలు) పిడుగురాళ్ల జిజిహెచ్ సూపరింటెండెంటుగా నియమితులయ్యారు.

విశాఖ ఆంధ్ర వైద్య కళాశాల (టిబిసిడి ప్రొఫెసర్) సునీల్‌కుమార్ పాడేరు జిజిహెచ్ సూపరింటెండెంటుగా, డాక్టర్ జి.పద్మశ్రీ (జనరల్ సర్జరీ ప్రొఫెసర్ విజయవాడ) మచిలీపట్నం జిజిహెచ్ సూపరింటెండెంటుగా, డాక్టర్ ఆనంద్ (జనరల్ సర్జరీ ప్రొఫెసర్, శ్రీకాకుళం) పలాస కిడ్నీ రీసెర్చి సెంటర్ సూపరింటెండెంటుగా నియమించారు.

కె రాంబాబు (జనరల్ సర్జరీ ప్రొఫెసర్‌విశాఖ) రాజమహేంద్రవరం జిజిహెచ్‌కు సూపరింటెండెంట్, కె.మాధవి (బయోకెమిస్ట్రీ ప్రొఫెసర్ నెల్లూరు) నెల్లూరు జిజిహెచ్ సూపరింటెండెంటుగా, డాక్టర్ కె.నవీన్‌కుమార్ (ఎనస్తీషియా ప్రొఫెసర్, అనంతపురం) కడప జిజిహెచ్ సూపరింటెండెంటుగా నియమితులయ్యారు. పదోన్నతులు పొందిన తొమ్మిది మందిలో ఎనిమిది మందికి వారు కోరుకున్న మూడు స్థానాల్లో ఒకచోట పోస్టింగు లభించింది. డాక్టర్ నవీన్ కుమార్ ఎటువంటి ఐచ్ఛికాలను సూచించలేదు.

## స్థానిక ఎన్నికలపై పుకార్లు నమ్మొద్దు: ఎస్ఇసి

**అమరావతి, సెప్టెంబరు 29 ప్రభాతవార్త ప్రతినిధి:** స్థానిక ఎన్నికలపై వస్తున్న వార్తలు పూర్తిగా నిరాధారమైనవని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ధారించింది. ఎన్నికలు రెండు నెలలు ఆలస్యమవుతాయనే వార్త వాస్తవం కాదని స్పష్టం చేసింది. స్థానిక ఎన్నికల సమాచారం ప్రెస్‌మీట్ల ద్వారానే వెల్లడిస్తామని రాష్ట్ర ఎన్నికల సంఘం వివరించింది. ఎన్నికలపై అసత్య ప్రచారం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. ఎన్నికల ఆలస్యమవుతాయనే సమాచారం పూర్తిగా తప్పుడు, అధికారికంగా ధ్రువీకరించని సమాచారం అని ఎపి రాష్ట్ర ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది. ప్రజలు, రాజకీయ పార్టీలు, ఇతర భాగస్వాములు ఇలాంటి సమాచారాన్ని నమ్మడం, ఆధారపడటం లేదా ప్రచారం చేయవద్దని సూచించింది. కమిషన్ పేరుతో తప్పుడు, తప్పుదోవ పట్టించే లేదా అనధికారిక సమాచారాన్ని ప్రచారం చేస్తే వర్తించే చట్టాల ప్రకారం తగిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించింది. ఎన్నికల షెడ్యూల్‌కు సంబంధించిన ఏదైనా అధికారిక ప్రకటనను ప్రెస్ కాన్ఫరెన్స్ లేదా అధికారిక ప్రెస్ రిలీజ్ ద్వారా మాత్రమే చేస్తామని వివరించింది. కమిషన్‌కు సంబంధించిన సమాచారాన్ని అధికారిక వెబ్‌సైట్ లేదా అధికారిక కమ్యూనికేషన్ మార్గాల్లో ధ్రువీకరించిన తర్వాతే నమ్మాలని సూచించింది.

## అక్టోబరు 2న 'స్వచ్ఛతాన్' మారథాన్



విలేకరుల సమావేశంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి రామ్

**విజయవాడ, సెప్టెంబరు 29 ప్రభాతవార్త ప్రతినిధి:** మహాత్మాగాంధీ జయంతిని అక్టోబరు 2న సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహించే స్వచ్ఛ దివస్ సందర్భంగా విజయవాడ- అమరావతి ప్రాంతంలో 'స్వచ్ఛతాన్' మారథాన్ నిర్వహిస్తున్నట్లు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తెలిపారు. విజయవాడ ప్రైవేట్ హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో పట్టాభిరామ్ పరిశుభ్రత, పారిశుద్ధ్యం, ఆరోగ్యం అనే ప్రధాన ఇతివృత్తాలతో నిర్వహిస్తున్న 'స్వచ్ఛతాన్' మారథాన్‌కు సుమారు 10 వేల మంది పాల్గొంటారని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. 5కె, 10కె, 21కె (హాఫ్ మారథాన్) విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నామని, విజేతలకు మొత్తం రూ.10 లక్షల నగదు బహుమతులు అందించనున్నట్లు చెప్పారు. 2న ఉదయం 5గంటలకు విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో మంత్రి నారా లోకేష్ మారథాన్‌ను ఫ్లాగ్ ఆఫ్ చేయనున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సత్యకుమార్, కందుల దుర్గేష్, నారాయణ, ఎంపీలు, ఎమ్మెల్యేలు, సినీ, క్రీడా రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొననున్నారు. ఈ సమావేశంలో అమరావతి రన్నర్స్ ప్రతినిధి రావి రమేష్, హెచ్‌డిఎఫ్‌సి ఏరియా హెడ్ అఫ్ ఆపరేషన్ ప్రతినిధి పవన్, మెడ్‌స్టార్ హాస్పిటల్స్ ప్రతినిధి ప్రేమ్, తదితరులు పాల్గొన్నారు.

# పసుపు విత్తనాల పంపిణీలో అక్రమాలు

### • సమగ్ర విచారణకు డిమాండ్ • 90 రోజులకు ఒకసారి గవర్నింగ్ బాడీ జరిపించాలి

**సీతంపేట (పార్వతీపురం మన్యం జిల్లా), సెప్టెంబరు 29 ప్రభాతవార్త:** సీతంపేట ఐటిడిఏలో గిరిజన లబ్ధిదారులకు అందజేసిన పసుపు విత్తనాల పంపిణీలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని వీటిపై సమగ్ర విచారణ జరిపించాలని ఆముదాలవలస, పాలకొండ ఎమ్మెల్యేలు కూన రవికుమార్, నిమ్మక జయకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం ఐటిడిఎ ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో 78వ పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి గిరిజన స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి. పార్వతీపురం, శ్రీకాకుళం జిల్లాకు చెందిన కలెక్టర్లు డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి. స్వప్నిల్ దినకర్ పుండకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ లబ్ధిదారులకు పసుపు విత్తనాలు ఇవ్వకుండా ఇచ్చినట్లు నివేదికలో చూపిస్తున్నారని రైతులు ఎంపికలో కూడా అనుమానాలు ఉన్నాయన్నారు. రైతులకు ఉపయోగకరంగా లేని పసుపు విత్తనాలు పంపిణీ చేయడంలో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. చింతపల్లి, పాడేరు వంటి ప్రాంతాలలో పసుపులో ఆయిల్ శాతం ఎక్కువగా ఉంటుందని ఈ ప్రాంతంలో పసుపు విత్తనాల్లో ఆయిల్ శాతం తక్కువగా ఉండడం వలన గిరిజన రైతులు నష్టపోతున్నారని బయట మార్కెట్‌లో డిమాండ్ లేకుండా పోతుందని అధికారులు లబ్ధి కోసమే ఇలాంటి విత్తనాలను అందజేస్తున్నారని ఆరోపించారు. నివేదికలో కనిపించిన విధంగా క్షేత్రస్థాయిలో కనిపించడం లేదన్నారు. దీనిపై సమగ్ర ఎంక్వైరీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రతి 90 రోజులకు ఒకసారి ఐటిడిఎ పాలకవర్గ సమావేశం ఏర్పాటు చేసినట్లయితే లోపాలు తెలుసుకోవడానికి ఆస్కారం ఉంటుందన్నారు. అధికారుల్లో ఇప్పటికీ వైసిపి జాడ్యం పోలేదని అది మానుకోవాలని అన్నారు. అదేవిధంగా గ్రీవెన్స్‌లో తీసుకున్న వినతులు పరిష్కారం కావడం లేదని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆరోపించారు. సీతంపేట గ్రీవెన్స్‌కు రావాలంటే చాలా ఇబ్బందులు తప్పడం లేదని నెలలో ఒక రోజు పాతపట్నం మెళియాపుట్టిలో గ్రీవెన్స్ పెట్టి అర్జీల స్వీకరించాలని కోరారు. బస్ సౌకర్యం లేకపోవడం వలన గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని ప్రతి సోమవారం సబ్ ప్లాన్ మండలాలు నుంచి నేరుగా సీతంపేటకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రతినెల నాలుగో సోమవారం గ్రీవెన్స్‌కు సబ్ ప్లాన్ మండలాల్లో నిర్వహించడానికి చర్యలు తీసుకుంటానని పిఒ హామీ ఇచ్చారు. ఐటిడిఏ పిఒలను తరచూ బదిలీలు చేయడం వలన పాలనా పరమైన ఇబ్బందులు వస్తున్నాయని రెండు సంవత్సరాలకు ఒకసారి పిఒలను బదిలీ చేస్తే బాగుంటుందని ఎమ్మెల్యే కూన రవికుమార్ స్పష్టం చేశారు. రెగ్యులర్ పీవో నియమించాలని కోరారు. అన్నదాత సుఖీభవ నిధులు చాలామంది రైతులు ఖాతాలో డబ్బులు జామ కావడం లేదని వీటిపై దృష్టి పెట్టాలని ఎమ్మెల్యేలు కోరారు. చాలా జిపిఎస్ పాఠశాలకు శాశ్వత భవనాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వాటిని పరిష్కరించాలని ఎమ్మెల్యే జయకృష్ణ కోరారు. ప్రతి ఆశ్రమ పాఠశాలలో ఆర్ఓ ప్లాంట్ టాయిలెట్లు తప్పనిసరిగా ఉండాలని మంత్రి సంధ్యారాణి అధికారులు ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ వైశాలి, ఐటిడిఏ పిఒ పవర్ స్వప్నిల్ జగన్నాథ్, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, ఎమ్మెల్సీ శ్రీనివాసరావు, అరకు పార్లమెంట్ టిడిపి అధ్యక్షురాలు తేజావతి టిడిపి ఇన్చార్జ్ పడాల భూదేవి, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



మంగళవారం మంత్రి సంధ్యారాణి అధ్యక్షతన సీతంపేట ఐటిడిఎ పాలకవర్గ సమావేశం

# న్యాయవాదుల ర్యాలీలో అపశ్రుతి

### - పోలీసులు, న్యాయవాదులకు మధ్య తోపులాట

### - నేడు, రేపు విధుల బహిష్కరణ, రిలే నిరాహారదీక్షలకు న్యాయవాదుల తీర్మానం



న్యాయవాదులను అడ్డుకుంటున్న పోలీసులు

**విజయవాడ,సెప్టెంబరు 29,ప్రభాతవార్త:** బెజవాడ బార్ న్యాయవాదులైన ఒగ్గు గవాస్కర్,సుభాని, పలగాని రవిబాబులపై విజయవాడ పోలీసులు కేసులు బనాయించి,అక్రమంగా రౌడీషీట్లు తెరవడాన్ని నిరసిస్తూ బెజవాడ బార్ న్యాయవాదులు మంగళవారం ర్యాలీగా బార్ అసోసియేషన్ నుండి బయలుదేరి బందరు రోడ్డు లోని అంబేద్కర్ స్మృతివనం వద్దకు వినతిపత్రం సమర్పించడానికి రాగా అక్కడ ఉన్న పోలీసులు నిరసన కార్యక్రమాన్ని అడ్డుకున్నారు. శాంతియుతంగా ర్యాలీని నిర్వహిస్తున్న న్యాయవాదులకు పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. న్యాయవాదులపై పోలీసులు దాడి చేయడమే కాక,మహిళా న్యాయవాదులపై పురుష పోలీసులు దురుసుగా ప్రవర్తించడాన్ని న్యాయవాదులు ఈ సందర్భంగా విమర్శించారు. ఈ ఘటనతో అక్కడ తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా పోలీసుల చర్యలను వారు దుయ్యబట్టారు. ఈ సందర్భంగా బెజవాడ బార్ అధ్యక్షులు వి.లక్ష్మీనారాయణ,ప్రధాన కార్యదర్శి వలిబోయిన కిరణ్‌కుమార్‌లు మాట్లాడుతూ తమ న్యాయవాదులపై అక్రమంగా కేసులు బనాయించడమే కాక రౌడీషీట్లు తెరవాలనుకోవడం దారుణమన్నారు. అంబేద్కర్ స్మృతివనం వద్దకు శాంతియుతంగా ర్యాలీని నిర్వహిస్తూ,అంబేద్కర్ విగ్రహం వద్దకు వినతిపత్రం సమర్పించేందుకు వెళ్ళిన న్యాయవాదులపై పోలీసులు కక్షపూరితంగా అడ్డుకోవడంతో ఉద్రిక్తవాతావరణం నెలకొందన్నారు. తాము శాంతియుతంగా ర్యాలీని నిర్వహిస్తుంటే పోలీసులు తమపై విచక్షణారహితంగా దాడిచేయడమే కాక మహిళా న్యాయవాదులపై కూడ పురుష పోలీసులు దురుసుగా ప్రవర్తించారని వారు పేర్కొన్నారు. వీధి రౌడీలకంటే దారుణంగా బార్ అధ్యక్షులు వి.లక్ష్మీనారాయణ,కార్యదర్శి కిరణ్‌కుమార్, మానవ హక్కుల కమిటీ న్యాయవాది ఎఎస్ఎస్ రాంప్రసాద్,గిరి, రాజశేఖర్,మహిళా న్యాయవాదులు శ్రీదేవి,సిహెచ్ చైతన్యలపై పోలీసులు జులుం ప్రదర్శించడాన్ని వారు దుయ్యబట్టారు. విషయం తెలుసుకున్న న్యాయవాదులు భారీ సంఖ్యలో అక్కడకు చేరుకుని,పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇటీవల కాలంలో న్యాయవాదులపై పోలీసుల దుశ్చర్యలు ఎక్కువగా పెరిగాయని వారు విమర్శించారు.

**నేడు రేపు న్యాయవాదుల విధుల బహిష్కరణ**

ఈ సంఘటనను నిరసిస్తూ బెజవాడ బార్ అధ్యక్షులు లక్ష్మీనారాయణ,కార్యదర్శి కిరణ్‌కుమార్,ఇతర సభ్యుల నేతృత్వంలో బెజవాడ బార్ సర్వ సభ్య సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశంలో సదరు పోలీసులపై చర్యలు తీసుకోవాలని, న్యాయవాదుల రక్షణ చట్టం త్వరగా అమలు చేయాలని పేర్కొంటూ సర్వ సభ్యసమావేశంలో తీర్మానించారు. దానికనుగుణంగా నేడు రేపు న్యాయవాదులు విధుల బహిష్కరణకు నిర్ణయించారు.

అనంతరం రిలే నిరాహారదీక్షలు కొనసాగించాలని తీర్మానించారు. ఏది ఏమైనప్పటికి శాంతియుతంగా నిరసన చేస్తున్న న్యాయవాదులపై పోలీసులు దౌర్జన్యం చేయడం తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. దీంతో బార్‌కు నగర పోలీసులకు మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది.

# నిర్ణీత గడువులోగా దసరా ఉత్సవ ఏర్పాట్లు: ఇఒ


తెలంగాణ మాజీ సిఎస్‌కు దుర్గమ్మ చిత్రపటం అందిస్తున్న దృశ్యం

**ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 29, ప్రభాతవార్త :** దుర్గమ్మవారి ఆలయంలో 2026 సంవత్సరంలో అక్టోబర్ 11 నుండి జరగబోయే దసరా ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లను నిర్ణిత గడువులోగా పూర్తి చేస్తామని ఇఒ వికె శీనా నాయక్ తెలిపారు. ఆయన ఇంద్రకీలాద్రిపై జరగనున్న దసరా శరన్నవరాత్రి మహోత్సవాల నేపథ్యంలో మంగళవారం క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి నూతన లడ్డూ పోటు మరియు అన్నదాన భవనాలను నిశితంగా తనిఖీ చేశారు. ఉత్సవాల నాటికి చిన్న చిన్న పనులన్నీ పూర్తి చేసి భక్తులకు పూర్తి స్థాయిలోకి అందుబాటులోకి తీసుకురావాలని దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. భక్తులకు అందజేసే ప్రసాదాలు అత్యంత రుచికరంగా, నాణ్యతా ప్రమాణాలతో తయారు కావాలని, అన్నప్రసాద వితరణలో ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. అనంతరం కనకదుర్గ నగర్‌ను సందర్శించి, అక్కడ జరుగుతున్న డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకరణ పనులను పరిశీలించారు. పారిశుద్ధ్య లోపాలు తలెత్తకుండా డ్రైనేజీ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సంబంధిత ఇంజినీరింగ్, పారిశుద్ధ్య అధికారులకు మార్గదర్శనం చేశారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ దసరా శరన్నవరాత్రులకు తరలివచ్చే లక్షలాది మంది భక్తుల సౌకర్యార్థం దేవస్థానం అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ పనులు వేగవంతం చేస్తోందన్నారు. క్యూలైన్లు, తాగునీరు, పారిశుద్ధం, ప్రసాదాల పంపిణీ వంటి అన్ని విభాగాల్లో ఎక్కడా చిన్న లోపం కూడా రాకుండా సిబ్బంది అంకితభావంతో పనిచేసి ఏర్పాట్లను నిర్ణిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ఈ పర్యటనలో దేవస్థానం కార్యనిర్వాహక ఇంజినీర్, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

**- దుర్గమ్మవారి సేవలో విఐపి:** మంగళవారం నాడు దుర్గమ్మవారిని తెలంగాణ పూర్వ ప్రభుత్వప్రధాన కార్యదర్శి శాంతికుమారి దర్శించుకున్నారు. శ్రీ అమ్మవారి దర్శనం అనంతరం అమ్మవారి ప్రసాదం, చిత్రపటంను దేవస్థానం అధికారులు అందజేశారు.

# భీమిసింగిలో ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం

### షుగర్ ఫ్యాక్టరీ ఉద్యోగులు, కార్మికులు హర్షం - రైతులు షేర్ హోల్డర్స్‌తో త్వరలో సమావేశం

### అభినందన సభలో పాల్గొన్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, డిసిఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ



**గజపతినగరం, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త:** నియోజకవర్గంలోని జామీ మండలం భీమసింగి షుగర్ ఫ్యాక్టరీ ఉద్యోగులకు, కార్మికులకు 9 కోట్ల 12 లక్షల రూపాయలు నిధుల మంజూరుకు జీవో జారీ చేయడంతో రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. షుగర్ ఫ్యాక్టరీ ఉద్యోగులు కార్మికులు ఆహ్వానం మేరకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మంగళవారం శ్రీవిజయ రామ గజపతి సహకార చక్కెర కర్మాగారం (భీమసింగి షుగర్ ఫ్యాక్టరీ) వద్దకు వెళ్లారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, కార్మికులు థాంక్యూ సీఎం సార్ థాంక్యూ కొండపల్లి సార్ అంటూ ప్లకార్డులతో హర్షాతిరేకాలతో స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సమావేశంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలోనే షుగర్ ఫ్యాక్టరీ మూసివేసి రైతులను, కార్మికులను, ఉద్యోగులను రోడ్డున పడవేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే స్థానిక శాసన సభ్యురాలు కోళ్ల లలిత కుమారి, మంత్రిగా నేను అసెంబ్లీలో భీమసింగి షుగర్ ఫ్యాక్టరీ గురించి మాట్లాడి న్యాయం చేయాలని కోరగా, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేడు కార్మికులు, ఉద్యోగులు పడుతున్న ఇబ్బందులను గమనించి జీతాలు, విఆర్ఎస్ బకాయిలకు నిధులు మంజూరుకు జీవో విడుదల చేయటం జరిగిందన్నారు. దశలవారీగా ఫ్యాక్టరీకి సంబంధించిన సమస్యలను పరిష్కరించడం కోసం కూటమి ప్రభుత్వం ప్రయత్నం చేస్తుంటే వైసీపీ పార్టీ బురద జల్లుతుందన్నారు. ప్రస్తుతం వచ్చిన జీవో కారణంగా 300 కుటుంబాలకు పైగా న్యాయం జరగడంతో పాటు ఆర్థికంగా నిలదొక్కుకుంటారన్నారు. బకాయిలు చెల్లిస్తున్న కూటమి ప్రభుత్వంపై అబాండాలు వేస్తూ, అపోహలు సృష్టిస్తున్న వైసీపీ నాయకుల మాటలను నమ్మవద్దని, త్వరలోనే రైతులు, షేర్ హోల్డర్స్‌తో సమావేశాలు నిర్వహించి తదనగుణంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంత్రి ఉద్ఘాటించారు. ఎస్ కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి మాట్లాడుతూ మూతపడిన ఫ్యాక్టరీల జీతభత్యాల కోసం ఏళ్ల తరబడి చూడాల్సి వస్తుందని, మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చొరవతోనే ఇంత వేగవంతంగా ఉద్యోగులకు, కార్మికులకు వేతనాల జీవో రావడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల వారి ఆకాంక్షలను నెరవేర్చటమే ధ్యేయంగా పని చేస్తుందన్నారు. డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం అధికారంలో ఫ్యాక్టరీ సమస్యలను పెడచెవిన పెట్టిందన్నారు. రాష్ట్రంలో ఆర్థికపరమైన ఇబ్బందులు చాలా ఉన్నప్పటికీ చక్కెర కర్మాగార ఉద్యోగులకు న్యాయం చేయాలనే సంకల్పంతో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే లలిత కుమారి కృషితోనే నిధులు మంజూరు కోసం జీవో రావడం జరిగిందన్నారు. ఉద్యోగుల కార్మికులు కుటుంబాలకు కూటమి ప్రభుత్వం చేసిన మేలు మరవ కూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పివివి గోపాల రాజు పాల్గొన్నారు.

## ప్రభుత్వ శాఖల సమన్వయంతో బాలల హక్కుల పరిరక్షణ

### - రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమీషన్ చైర్మన్ వేటుకూరి ఎవిఎస్ఎస్‌న్ రాజు



బాలల హక్కుల పరిరక్షణపై జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కమీషన్ చైర్మన్

**చిత్తూరు, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త:** ప్రభుత్వ శాఖలు సమన్వయంతో బాలల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, అభివృద్ధికి పని చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమీషన్ చైర్మన్ వేటుకూరి ఎవిఎస్ఎస్‌న్ రాజు అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో మంగళవారం రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమీషన్ చైర్మన్ వేటుకూరి ఎవిఎస్ఎస్‌న్ రాజు, సభ్యురాలు కెజి వెంకట పద్మలత, డిఆర్ఓ మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో జిల్లా అధికారులతో బాలల హక్కులు, రక్షణ, సంక్షేమం, విద్య, ఆరోగ్యం తదితర అంశాలపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కమీషన్ చైర్మన్ మాట్లాడుతూ బాలల కోసం పని చేయడం ప్రత్యేక బాధ్యతగా భావించాలని, బాలల హక్కులు పరిరక్షించడంతో పాటు వారి సమగ్ర అభివృద్ధికి అన్ని శాఖలు కలిసికట్టుగా పని చేయాలన్నారు. బాలల సంక్షేమం కేవలం మహిళా శిశు సంక్షేమ శాఖకు మాత్రమే సంబంధించిన విషయం కాదని, ప్రతి ప్రభుత్వ శాఖకు ఇందులో బాధ్యత వుందన్నారు. చిత్తూరు జిల్లా రాష్ట్ర సరిహద్దు జిల్లా కావడంతో బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, బాలల అక్రమ రవాణా, మాదకద్రవ్యాల వినియోగం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం వుందన్నారు. బాలల భవిష్యత్తును దృష్టిలో వుంచుకుని ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. పిల్లలు పాఠశాలలకు ఎందుకు దూరం అవుతున్నారు! ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నాయా! ఇతర ప్రాంతాలకు పిల్లలు పనుల కోసం తరలి వెళ్తున్నారా! అనే అంశాలపై గ్రామ స్థాయిలో సమాచారం సేకరించి సమస్యలను ప్రారంభ దశలోనే పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే విద్య, వైద్యం, అంగన్‌వాడీ,

రెవెన్యూ, పోలీసు, మహిళా శిశు సంక్షేమం తదితర శాఖలు తమ పరిధిలోని గ్రామ స్థాయి బాలల పరిరక్షణ కమిటీల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలన్నారు. బాలల హక్కుల పరిరక్షణతో పాటు వారికి మంచి విద్య, విలువలతో కూడిన సంస్కారం, ఆరోగ్యకరమైన వాతావరణం, అవసరమైన మౌలిక సదుపాయాలు అందేలా చూడాల్సిన బాధ్యత అందరిపై వుందన్నారు. డిఆర్ఓ మోహన్‌కుమార్ మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణకు సంబంధించిన అంశాల్లో అన్ని శాఖలను సమన్వయం చేసుకుని నిరంతరం సమీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. వైద్యం, అంగన్‌వాడీ, విద్య తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులను సమన్వయం చేసుకుని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఓటు భద్రతపై ప్రజా ఉద్యమం

### సిడబ్ల్యుసి సభ్యుడు రఘువీరారెడ్డి

**అమరాపురం సెప్టెంబర్ 29 ప్రభాతవార్త** ఓటు భద్రత పై ప్రజా ఉద్యమాన్ని పెద్ద ఎత్తున నిర్మించాలని సి డబ్ల్యు సి సమావేశంలో నిర్ణయం తీసుకోనట్లు సిడబ్ల్యుసి సభ్యుడు రఘువీరారెడ్డి పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం" తీరు పై ప్రజా ఆందోళన నిర్వహించాలని నిర్ణయం. తీసుకున్నట్లు తెలిపారు. ఓటు భద్రత, సక్రమమైన ఓటర్ల జాబితా అనే ఏకైక అంశం పై సమావేశంలో చర్చ జరిగింది. ఓటు హక్కుకు భద్రత లేకపోతే ప్రజాస్వామ్యం, రాజ్యాంగం నవ్వుల పాలవుతుంది. ఓటు భద్రత పై దేశంలోని ప్రజలను అప్రమత్తం చేస్తూ, పూర్తి అవగాహన కల్పించేలా దీర్ఘకాలం క్షేత్ర స్థాయిలో కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయం.ఎన్నికల సంఘాన్ని నిర్వీర్యం చేస్తున్నారన్న అంశంపై చర్చించాం. కేంద్ర ఎన్నికల సంఘం" పనితీరు, ఓటు చోరి ఏ విధంగా జరుగుతుందో, ప్రజాస్వామ్యం ఏ విధంగా కూని అవుతుందో చర్చించాం. ఈవీఎంలు రద్దు కావాలి, పేపర్ బ్యాలెట్ విధానంలో ఎన్నికలు జరగాలి. 2025 జూన్ తర్వాత ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా రూపొందించిన ఓటర్ల సవరణ జాబితాను రద్దు చేయాలి.

కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి. కేంద్ర ఎన్నికల సంఘం పూర్తి పారదర్శకతతో బాధ్యతలు నిర్వర్తించేలా ప్రజా ఉద్యమం చేయాలి.


సిఎం చంద్రబాబు చేతుల మీదుగా ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్ కుమార్

### ప్రభుత్వ ఉద్యోగుల కెపాసిటి బిల్డింగ్‌లో

## ఉత్తమ రాష్ట్రంగా ఎపి

**విజయవాడ, సెప్టెంబరు 29,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వ ఉద్యోగుల కెపాసిటి బిల్డింగ్‌లో అత్యుత్తమ రాష్ట్రంగా మొదటి స్థానంలో ఆంధ్రప్రదేశ్ నిలిచింది. విజయవాడలోని అంబేద్కర్ కళావేదికలో జరిగిన మిషన్ కర్మయోగి వర్క్‌షాప్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వ ఉద్యోగుల కెపాసిటి బిల్డింగ్‌లో అత్యుత్తమ రాష్ట్రంగా ఏపీ మొదటి స్థానంలో నిలిచిన నేపథ్యంలో రాష్ట్ర అధికారులు ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్ కుమార్, ఏపీఎస్ డీపీఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అలపర్తి వెంకటేశ్వర రావుకు అవార్డును అందజేశారు. ఈ వర్క్‌షాప్‌కు ఏపీతో పాటు తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళ నాడు, ఒడిశా, పుదుచ్చేరి రాష్ట్రాలకు చెందిన అధికారులు హాజరయ్యారు. రెండో స్థానంలో నిలిచిన కర్ణాటక, మూడో స్థానంలో ఒడిశా రాష్ట్రాలకు కూడా సీఎం చంద్రబాబు అవార్డులు అందించారు.

# స్వర్ణ రథంపై విహారించిన గణపయ్య


స్వర్ణరథంపై ఊరేగుతున్న వరసిద్ధుడు

**కాణిపాకం, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త:** కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో మంగళవారం రాత్రి సిద్ధి బుద్ధి సమేతుడైన గణనాధుడు సర్వాలంకృతుడై స్వర్ణరథంపై అధిరోహించి ఆలయ మాడా వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతి నెలా పౌర్ణమి అనంతరం సంకటహర చతుర్ధి రోజున రాత్రి స్వామివారికి స్వర్ణ రథోత్సవం నిర్వహిస్తుంటారు. ఈమేరకు ప్రధాన ఆలయంలోని అలంకార మండపంలో ఉదయం 9,11, గంటలకు, సాయంత్రం 3, 5 గంటలకు నాలుగు దఫాలుగా సంకటహర చతుర్థి వ్రతంను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే రాత్రి స్వామివారికి స్వర్ణ రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా సిద్ధి, బుద్ధి సమేత గణనాధుని ఉత్సవమూర్తులను అలంకార మండపంలో వుంచి సర్వాంగ సుందర ంగా అలంకరించి వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం మంగళవాయిద్యాల నడుమ మిరమిట్లు గొలుపుతున ్న అలంకరించిన స్వర్ణరథంపై వుంచి మరోమారు అర్చకులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల గణేష్ నామస్మరణలు, మంగళ వాయిద్యాల నడుమ ఆలయ మాడా వీధుల్లో స్వామి, అమ్మవార్లను ఘనంగా ఊరేగించారు.

ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్, ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్‌లు వాసు, కోదండపాణి,టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడు, రవి, అర్చకులు,వేదపండితులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## వేధింపులు ఎదురైతే మహిళలు వెంటనే ఫిర్యాదు చేయాలి

### మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డా. రాయపాటి శైలజ


మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డా. రాయపాటి శైలజను ఆహ్వానిస్తున్న దృశ్యం

**తిరుపతి కలెక్టరేట్, సెప్టెంబరు 29 ప్రభాతవార్త:** ఒకప్పుడు ఫిజికల్ స్టాకింగ్ ఎక్కువగా ఉండేదని, ప్రస్తుతం సాంకేతికత వినియోగం పెరగడంతో సైబర్ స్టాకింగ్ ఎక్కువవుతోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డా. రాయపాటి శైలజ అన్నారు. సోషల్ మీడియా, ఫోన్‌లు, మెసేజ్‌ల ద్వారా మహిళలను నిరంతరం సంప్రదించడం, వెంటపడటం, వ్యక్తిగత సమాచారాన్ని దుర్వినియోగం చేయడం వంటి వాటిపై మహిళలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) సహకారంతో రాష్ట్ర మహిళా కమిషన్ ఆధ్వర్యంలో మంగళవారం తిరుపతిలోని ఎస్వీ విశ్వవిద్యాలయం సెనేట్ హాల్‌లో 'స్టాకింగ్ నివారణ'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ.. ఒక నంబర్‌ను బ్లాక్ చేసినా మరో నంబర్ నుంచి పదేపదే కాల్స్, మెసేజ్‌లు చేయడం కూడా స్టాకింగ్‌లో భాగమేనన్నారు. అనుమతి లేకుండా గిఫ్ట్‌లు, బొకేలు పంపడం, మహిళల డీపీలు, ఫొటోలతో నకిలీ సోషల్ మీడియా ఖాతాలు సృష్టించడం, వ్యక్తిగత ఫొటోలు, సమాచారాన్ని దుర్వినియోగం చేసి వేధించడం వంటి చర్యల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. సోషల్ మీడియా ద్వారా పరిచయం పెంచుకుని నిరంతరం సంప్రదించడం, వెంటపడటం వంటి ఘటనలను తొలిదశలోనే గుర్తించాలని సూచించారు. మహిళల భద్రతకు చట్టాలు, పోలీసు వ్యవస్థతో పాటు మానసిక బలం కూడా అవసరమని శైలజ అన్నారు. మహిళలు అత్యవసర సమయంలో 181 మహిళా హెల్ప్‌లైన్, 112 అత్యవసర సేవలు, 1930 సైబర్ నేరాల హెల్ప్‌లైన్ నంబర్లను గుర్తుంచుకోవాలని సూచించారు. మహిళల భద్రత కోసం శక్తి యాప్‌ను వినియోగించుకోవాలని తెలిపారు. జీరో ఎఫ్ఐఆర్‌పై కూడా మహిళలకు అవగాహన అవసరమన్నారు. ఈవ్‌టీజింగ్, లైంగిక వేధింపులు, స్టాకింగ్ వంటి ఘటనలను సాధారణంగా తీసుకోరాదని శైలజ అన్నారు.కార్యక్రమంలో తిరుపతి అదనపు ఎస్పీ శ్రీలత, ఎస్ఐ ఏ. జయస్వాములు, న్యాయ నిపుణురాలు డా. కె. శ్రావణి, ఎస్వీ విశ్వవిద్యాలయం సైకాలజీ విభాగం సైకాలజిస్ట్, కౌన్సిలర్ డా. ఎస్. విశ్వనాథ్‌రెడ్డి, మహిళా కమిషన్ సలహాదారు ఆర్. సూయజ్ తదితరులు పాల్గొన్నారు.

# 2047 నాటికి రూ.80 లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థగా తిరుపతి జోన్

**తిరుపతి,సెప్టెంబర్ 29ప్రభాతవార్తప్రతినిధి:** స్వర్ణాంధ్ర 2047 విజన్‌లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తిరుపతి ఎకనామిక్ రీజియన్ సమగ్ర ప్రణాళిక రూపకల్పనకు కీలక ముందడుగు పడనుంది. తిరుపతి, చిత్తూరు, నెల్లూరు జిల్లాలకు చెందిన ప్రజాప్రతినిధులు, పరిశ్రమల ప్రతినిధులు, విద్యావేత్తలు, ప్రభుత్వ శాఖల అధికారులు, వివిధ సంస్థల ప్రతినిధులతో భాగస్వామ్యుల సదస్సును బుధవారం తిరుపతిలో నిర్వహించనున్నారు. ఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ సదస్సులో ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి అవసరమైన కీలక ప్రాజెక్టులు, విధానాలు, మౌలిక వసతులు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలపై విస్తృతంగా చర్చించనున్నారు. తిరుపతి ఎకనామిక్ రీజియన్ సిఇఒ రెవెన్యూ-ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్ కుమార్ మీనా నేతృత్వంలో ఈ ఒక రోజు సమావేశం నిర్వహిస్తున్నారు. రాష్ట్రాన్ని 2047 నాటికి 308 లక్షల కోట్ల రూపాయలు ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడంతోపాటు తలసరి ఆదాయాన్ని 55 లక్షలకు చేర్చాలన్న స్వర్ణాంధ్ర 2047 లక్ష్యం మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పని చేస్తున్నారు. దీనిలో భాగంగా రాష్ట్రాన్ని మూడు ఆర్థిక ప్రాంతాలుగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. విశాఖపట్నం, అమరావతి, తిరుపతి ఎకనామిక్ రీజియన్లను దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధికి ఇంజిన్లుగా తీర్చిదిద్దే దిశగా ప్రణాళికలు రూపొందిస్తోంది. ఇందులో భాగంగా తిరుపతి ఎకనామిక్ రీజియన్‌ను 2047 నాటికి రూ.80 లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యాన్ని నిర్దేశించారు. తిరుపతి ఎకనామిక్ రీజియన్ పరిధిలో తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, శ్రీ సత్యసాయి, వైఎస్సార్ కడప, ఎస్పీఎస్ఆర్ నెల్లూరు, అనంతపురము, నంద్యాల, కర్నూలు జిల్లాలు ఉన్నాయి. పారిశ్రామిక, తయారీ రంగాలు, రవాణా-లాజిస్టిక్స్, పర్యాటకం, వ్యవసాయం, ఉద్యానవనం, సేవల రంగాలు, విద్యా-పరిశోధనా సంస్థలు, నైపుణ్యవంతమైన మానవ వనరులు ఈ ప్రాంతానికి ప్రధాన బలాలుగా ఉన్నాయి. ప్రత్యేకంగా తిరుపతి, చిత్తూరు, నెల్లూరు జిల్లాలు పరిశ్రమలు, తయారీ రంగం, లాజిస్టిక్స్, రవాణా కారిడార్లు, పర్యాటకం, వ్యవసాయ-ఉద్యాన ఉత్పత్తులు, విద్యా సంస్థల పరంగా కీలకమైన ఆర్థిక భౌగోళిక ప్రాంతంగా గుర్తించారు. ప్రాంతీయ ఆర్థిక ప్రణాళిక ప్రాధాన్యంపై ప్రారంభోపన్యాసం చేస్తారు. నిపుణులు తిరుపతి జోన్ ప్రణాళిక, తిరుపతి, చిత్తూరు, నెల్లూరు జిల్లాల ఆర్థిక పరిస్థితి, పారిశ్రామిక వ్యవస్థ, భవిష్యత్ అవకాశాలపై సమగ్ర అవగాహన కల్పించనున్నారు.

## మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి అదనపు వాహనం ధ్వంసం

## గుర్తు తెలియని వ్యక్తులంటూ పోలీసులు కేసు నమోదు


దుండగులు ధ్వంసం చేసిన పెద్దారెడ్డి వాహన అద్దాలు

**తాడిపత్రి, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** తాడిపత్రిలోని స్వగృహం వద్ద ఉంచిన తాజా మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అదనపు వాహనాన్ని కొందరు ఆకతాయిలు ధ్వంసం చేశారు. పెద్దారెడ్డి ఇంటి ముంగిట ఉంచిన మూడు అదనపు వాహనాల్లో ఒకదాని వద్దకు బొలెరోలో వచ్చిన ఇద్దరు దుండగుల్లో ఒకరు దిగి ఇనుప చువ్వతో వాహన అద్దాలు ధ్వంసం చేశారు. మాజీ ఎమ్మెల్యే ఇంటి వద్ద అమర్చిన సీసీ కెమెరాల్లో కనిపించకుండా దుండగులు జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిసింది. సమాచారమందుకున్న పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి పరిస్థితిని పరిశీలించారు. ఫిర్యాదు చేయడానికి పెద్దారెడ్డి ఆసక్తి చూపకపోవడంతో పోలీసులే కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. దుండగులు పెద్దారెడ్డి ఇంటి వద్దకు వచ్చి ఆకతాయి చేష్టలకు పాల్పడటం ఇది రెండసారి కావడం గమనార్హం.

## గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి :మంత్రి లోకేష్

**విజయవాడ,సెప్టెంబరు 29,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో రూ.11,085 కోట్లతో చేపట్టనున్న పల్లె పండుగ 3.0 కార్యక్రమం ప్రారంభం కావడం సంతోషంగా ఉందని ఆయన తెలిపారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా మంత్రి నారా లోకేశ్ స్పందించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తోందని ఆయన పేర్కొన్నారు.పల్లె పండుగ 3.0 ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో సర్వతోముఖ అభివృద్ధికి సంబంధించిన కార్యక్రమాలను చేపట్టనున్నట్లు మంత్రి లోకేశ్ తెలిపారు. డిప్యూటీ సీఎం ఆలోచన, కార్యాచరణతో పల్లెలు ప్రగతిపథంలో ముందుకు సాగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా, గ్రామీణ మౌలిక వసతులు, ప్రజలకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడంలో పల్లె పండుగ కార్యక్రమం కీలకంగా ఉంటుందని ప్రభుత్వం చెబుతోంది. రూ.11,085 కోట్ల భారీ వ్యయం తో చేపడుతున్న ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రం లోని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి మరింత ఊతం లభించనుంది. లోకేష్ తన పోస్టులో సీఎం, డీసీఎంలు కలిసున్న ఫోటోను ట్యాగ్ చేసారు.

## వివేకా హత్య కేసులో ఇడి విచారణ ముమ్మరం

### నిఘా కెమెరాల దృశ్యాలపై ఉమాశంకర్‌రెడ్డిని ప్రశ్నించిన అధికారులు

**పులివెందుల సెప్టెంబర్ 29 ప్రభాత వార్త :** మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ విచారణ రెండో రోజూ కొనసాగుతోంది. కేసులో నిందితులుగా ఉన్న ఏ1 ఎర్ర గంగిరెడ్డి, ఏ3 గజ్జల ఉమాశంకర్‌రెడ్డిని అధికారులు విడివిడిగా ప్రశ్నిస్తున్నట్లు సమాచారం.ప్రధానంగా 2019 మార్చి 15న ఎర్ర గంగిరెడ్డి ఇంట్లో జరిగినట్లు పేర్కొంటున్న సమావేశానికి సంబంధించిన అంశాలపై అధికారులు ఆరా తీస్తున్నట్లు తెలిసింది. సమావేశానికి ఎవరు హాజరయ్యారు, అక్కడ జరిగిన చర్చలు ఏమిటి, అనంతరం చోటుచేసుకున్న పరిణామాలపై వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం.అలాగే వివేకానందరెడ్డి హత్య అనంతరం ఉమాశంకర్‌రెడ్డి గోడ దూకి వెళ్లినట్లు పేర్కొంటున్న దృశ్యాలకు సంబంధించిన నిఘా కెమెరాల రికార్డులపైనా అధికారులు ప్రశ్నలు సంధిస్తున్నట్లు తెలుస్తోంది. ఆ సమయంలో జరిగిన పరిణామాలు, అక్కడ ఉన్న వ్యక్తుల వివరాలు, అనంతరం జరిగిన చర్యలపై విచారణ సాగుతున్నట్లు సమాచారం.ఇటీవల ఆగస్టులో హైదరాబాద్, కడప ప్రాంతాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు నిర్వహించిన సోదాల్లో లభించిన పత్రాలు, ఇతర ఆధారాలకు సంబంధించి కూడా నిందితులను ప్రశ్నిస్తున్నట్లు తెలిసింది. ఈ విచారణలో సేకరించిన వివరాలను గతంలో నమోదైన వాంగ్మూలాలు, లభించిన ఆధారాలతో అధికారులు సరిపోల్చుతున్నట్లు సమాచారం.విచారణలో వెలుగులోకి వచ్చే అంశాల ఆధారంగా మరికొందరిని ప్రశ్నించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే అధికారికంగా విచారణకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది.

### ఎఎంసి వైద్య విద్యార్థిని

# బలవన్మరణం

### వారంలోనే రెండో ఘటన

**విశాఖపట్నం, సెప్టెంబర్ 29: ప్రభాత వార్త** విశాఖలో మరో వైద్య విద్యార్థిని బలవన్మరణానికి పాల్పడిన ఘటన ఆంధ్రా వైద్య కళాశాల (ఏఎంసీ) లో విషాదం నింపింది. వారం రోజుల వ్యవధిలోనే ఇలాంటి ఘటన ఆంధ్ర వైద్య కళాశాల లో చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. నగరంలోని త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ని చినవాల్తేరు లో ఈ ఘటన సోమవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. త్రీ టౌన్ పోలీస్లు తెలిపిన వివరాలు ప్రకారం హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ శ్రావణి విశాఖలోని ఆంధ్రా మెడికల్ కళాశాలలోమొదటి సంవత్సరం ఇఎన్టీ పీజీ వైద్య విద్యను అభ్యసిస్తోంది. సోమవారం ఆమె తన గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికిచేరుకునివివరాలుసేకరించారు. డాక్టర్ శ్రావణి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించిన పోలీసులు, వారి సమక్షంలో తదుపరి చర్యలు చేపట్టారు. ఘటనకు గలకారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.శ్రావణి ఆంధ్రా మెడికల్ కళాశాలలో ఈఎన్‌టీ విభాగంలో పీజీ మొదటి సంవత్సరం లో తొమ్మిది నెలల క్రితం చేరింది.అయితే ఈఎన్‌టీ వైద్య విద్యను కొనసాగించడంపై తనకు ఆసక్తి లేదని, తల్లి కోరిక మేరకే ఈ కోర్సులో చేరినట్లు ఆమె కళాశాల హెచ్ఓడీ, ప్రిన్సిపాల్‌కు తెలిపినట్లు సమాచారం. తనకు సాఫ్ట్‌వేర్ కోర్సులో చేరి ఆ రంగంలో కొనసాగాలనే ఆసక్తి ఉన్నట్లు కూడా ఆమె సహా విద్యార్థినులతో చెప్పినట్లు వెల్లడించారు. సంఘటనా స్థలం లోదొరికిన ఆమె రాసిన సూసైడ్ నోట్‌లో తనతో పాటు సమాధి కావాల్సిన ఒక ముఖ్యమైన విషయం ఉందని, దానిని తనతోనే సమాధి కావాలి అని పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు.

తన మృతికి ఎవరూ బాధ్యులు కారని కూడా ఆమె నోట్‌లో పేర్కొన్నట్లు సమాచారం. తన తల్లిని, అలాగే 'స్కై' అనే తన పెంపుడు పిల్లిని జాగ్రత్తగా చూసుకోవాలని ఆమె కోరినట్లు పోలీసులు వెల్లడించారు.

### వర్షంతో మలేసియా, నేపాల్ 2 మ్యాచ్‌లు రద్దు
## సెమీఫైనల్స్‌కు బంగ్లాదేశ్, శ్రీలంక

**నిస్షిన్:** మలేషియా, నేపాల్‌తో జరగాల్సిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు ఎడతెరిపి లేకుండా వర్షం కారణంగా రద్దు కావడంతో, బంగ్లాదేశ్, శ్రీలంక జట్లు మైదానంలోకి దిగకుండానే 2026 ఆసియా క్రీడల పురుషుల క్రికెట్ సెమీఫైనల్స్‌కు చేరుకున్నాయి. ఈ మ్యాచ్‌ను నాలుగో క్వార్టర్ ఫైనల్‌గా షెడ్యూల్ చేసినప్పటికీ, మంగళవారం కొరోగి స్పోర్ట్స్ పార్క్‌లో ఉదయం





అంతా కురిసిన ఎడతెరిపి లేని వర్షం టాస్ వేయకుండా అడ్డుకుంది. చివరికి అధికారులు ఆటను రద్దు చేయవలసి వచ్చింది. టోర్నమెంట్ నిబంధనల ప్రకారం, వర్షం కారణంగా మ్యాచ్‌లు రద్దయిన పక్షంలో ఐసీసీ ర్యాంకింగ్స్‌లో ఉన్నత స్థానంలో ఉన్న జట్లు సెమీఫైనల్స్‌కు చేరుకుంటాయి. దీని ఫలితంగా, శ్రీలంక, బంగ్లాదేశ్, భారత్, పాకిస్తాన్ ముందంజ వేయగా, నేపాల్, మలేషియా, ఆఫ్ఘనిస్తాన్, హాంగ్ కాంగ్ నిష్క్రమించాయి. సోమవారం నాడే వాతావరణం కారణంగా పోటీకి అంతరాయం ఏర్పడింది. పాకిస్థాన్, హాంగ్‌కాంగ్‌ల మధ్య జరగాల్సిన క్వార్టర్ ఫైనల్ వర్షం కారణంగా రద్దయింది. ఆ తర్వాత జరగాల్సిన భారత్, ఆఫ్ఘనిస్తాన్‌ల క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ కూడా ఒక్క బంతి కూడా వేయకుండానే రద్దయింది. తొలి సెమీఫైనల్‌లో భారత్ శ్రీలంకతో తలపడనుండగా, రెండో సెమీఫైనల్‌లో పాకిస్థాన్ బంగ్లాదేశ్‌తో తలపడుతుంది. ఈ రెండు మ్యాచ్‌లు గురువారం జరగనున్నాయి.

## బాక్సింగ్ ఫైనల్‌కు అంకుష్, పర్వీన్

**నిషియో:** ఆసియా క్రీడలు 2026లో భారత బాక్సర్లు తమ అద్భుతమైన ప్రదర్శనను కొనసాగిస్తూ, అంకుష్ ఫంఘల్, మహిళల విభాగంలో పర్వీన్ హుడా ఫైనల్‌కు చేరుకోగా, నరేందర్ బెర్వాల్ కాంస్య పతకాన్ని దక్కించుకున్నాడు. మంగళవారం జరిగిన ఈ పోటీల్లో ఉజ్బెకిస్తాన్‌కు చెందిన ప్రస్తుత 75 కేజీల ప్రపంచ ఛాంపియన్ ఫజ్లిద్దీన్ ఎర్కిన్‌బోయెవ్‌పై 4-1 తేడాతో పునరాగమన విజయంతో అంకుష్ పంఘల్ పురుషుల 80 కేజీల ఫైనల్‌కు చేరుకున్నాడు. తొలి రౌండ్ తర్వాత 1-4తో వెనుకబడిన అంకుష్, బలంగా పుంజుకుని, రెండో రౌండ్‌ను 3-2తో గెలుచుకుని, చివరి రౌండ్‌లో 5-0తో ఆధిపత్యం చెలాయించాడు. నలుగురు న్యాయనిర్ణేతలు ఈ పోరులో అతనికి అనుకూలంగా 2928 స్కోరు ఇవ్వగా, ఒక న్యాయనిర్ణేత ఎర్కిన్‌బోయెవ్‌కు 2928 తీర్పు ఇచ్చాడు. అయితే, పురుషుల +90 కేజీల సెమీఫైనల్‌లో కజకిస్తాన్‌కు చెందిన ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ ఐబెక్ ఓరల్‌బే చేతిలో 0-5 తేడాతో ఓడిపోవడంతో నరేందర్ బెర్వాల్ కాంస్య పతకంతో సరిపెట్టుకోవలసి వచ్చింది. ఓరల్‌బే శక్తివంతమైన పంచ్‌లతో పోటీని నియంత్రించి, మొదటి రెండు రౌండ్లను 5-0తో గెలుచుకోగా, తదుపరి ఏకగ్రీవంగా 5-0 విజయాన్ని పూర్తి చేశాడు. అలాగే పర్వీన్ హుడా కూడా చైనాకు చెందిన లీ షుపై 5-0 తేడాతో సమగ్ర విజయం సాధించి మహిళల 65 కేజీల ఫైనల్‌లో తన స్థానాన్ని ఖరారు చేసుకుంది. పర్వీన్ తొలి రౌండ్‌ను 3-2తో గెలుచుకోగా, ఆ తర్వాత రెండో, మూడో రౌండ్లలో 5-0తో ఆధిపత్యం చెలాయించింది.






# భారత్‌కు 2 గోల్డ్ మెడల్స్

### షూటింగ్‌లో నీరు ధాండా గోల్డ్

### వ్యక్తిగత విభాగంలో స్వర్ణం... టీమ్ ఈవెంట్‌లో రజతం

### రిలేలో మహిళల బృందానికి మరో స్వర్ణం

### భారత్‌కు మొత్తంగా 52 పతకాలు

**నగోయా, సెప్టెంబరు 29:** ఆసియా క్రీడల్లో మంగళవారం జరిగిన మహిళల వ్యక్తిగత ట్రాప్ షూటింగ్ ఈవెంట్‌లో స్వర్ణం గెలిచి నీరు ధాండా చరిత్ర సృష్టించారు. ఈ ఈవెంట్‌లో స్వర్ణం సాధించిన భారతీయ మహిళగా ఆమె నిలిచారు. మనీషా కీర్, ఆషిమా అహ్లావత్‌లతో కలిసి మహిళల టీమ్ ఈవెంట్‌లో రజతం గెలిచిన కొద్ది గంటలకే నీరు ధాండా 'గోల్డ్ మెడల్' కైవసం చేసుకోవడం గమనార్హం. ఐచినగోయా వేదికగా జరుగుతున్న ఈ ఆసియా క్రీడల్లో భారత్‌కు ఇది మొత్తం మీద ఐదవ స్వర్ణ పతకం. 26 ఏళ్ల నీరు, ఎనిమిది మంది షూటర్లు పాల్గొన్న ఫైనల్‌లో 28 పాయింట్లు సాధించి స్వర్ణాన్ని గెలుచుకున్నారు. ఈ క్రమంలో ఆమె 24 పాయింట్లుగా ఉన్న గత ఆసియా రికార్డును బద్దలు కొట్టారు. 26 పాయింట్లు సాధించిన చైనాకు చెందిన యునాంగ్ సన్‌ను ఆమె అధిగమించారు. ట్రాప్ ఈవెంట్‌లో భారత్‌కు చివరిసారిగా వ్యక్తిగత స్వర్ణం 1978లో లభించింది. అప్పట్లో ఒలింపిక్ కౌన్సిల్ ఆఫ్ ఆసియా మాజీ అధ్యక్షుడు రణధీర్ సింగ్ (ఈ యేడాది ప్రారంభంలో ఆయన కన్నుమూశారు) బ్యాంకాక్‌లో జరిగిన పురుషుల ట్రాప్ ఈవెంట్‌లో స్వర్ణ పతకాన్ని గెలుచుకున్నారు. ఈ ఏడాది ప్రారంభంలో, ఇటలీలోని లోనాటోలో జరిగిన ఐఎస్ఎస్ఎఫ్ షాట్‌గన్ వరల్డ్ కప్ 2026లో మహిళల ట్రాప్ ఈవెంట్‌లో నీరు ధాండా స్వర్ణం గెలుచుకున్నారు. ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్‌లో నీరుకు అది తొలి వ్యక్తిగత పతకం కాగా, ఆమె కెరీర్‌లో మొత్తం మీద రెండవ పతకం. హర్యానాలోని జింద్ జిల్లాకు చెందిన నీరు ధాండా ప్రస్తుత జాతీయ ఛాంపియన్. ఫైనల్‌లో కేవలం మూడు షాట్లు మాత్రమే గురి తప్పి, స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నారు. మాజీ ప్రపంచ ఛాంపియన్ అయిన ఫ్రాన్స్‌కు చెందిన కరోల్ కోర్మెనియర్ 25 పాయింట్లతో రజత పతకానికి పరిమితం కాగా, ఇటలీకి చెందిన ఎరికా సెసా కాంస్య పతకాన్ని గెలుచుకున్నారు. ఆసియా క్రీడల్లో భాగంగా మంగళవారం జరిగిన వివిధ పోటీల్లో భారత అథ్లెట్లు అద్భుతంగా రాణించారు. 11వ రోజు రెండు స్వర్ణ పతకాలతోపాటు, రజతం, రెండు కాంస్యం పతకాలను కైవసం చేసుకున్నారు. షూటింగ్‌లో నీరు ధాండా గోల్డ్ మెడల్ సాధించగా, ఉమెన్స్ 4-400 మీటర్ల రిలేలో కిరణ్, మచెట్టిర పూవమ్మ, పరాచి, విథ్య రామ్‌రాజ్ బృందం మరో గోల్డ్ మెడల్ కైవసం చేసుకున్నారు. షూటింగ్‌లో నీరు ధాండా, మనీషా కీర్, ఆషిమా బృందం రజతం గెలిచింది. పురుషుల 5వేల మీటర్ల విభాగంలో గుల్వీర్ సింగ్ కాంస్య పతకాన్ని సాధించి రికార్డు సృష్టించాడు. బాక్సింగ్‌లో నరేందర్ బెర్వాల్ కాంస్య పతకం కైవసం చేసుకున్నాడు. ఆసియా క్రీడల్లో భారత్ మొత్తంగా 6 గోల్డ్ మెడల్స్, 21 సిల్వర్, 25 బ్రాంజ్ మెడల్స్‌లతో 52 పతకాలు సాధించి పతకాల పట్టికలో భారత్ 6వ స్థానంలో నిలిచింది. మెడల్స్ సాధించిన అథ్లెటిక్స్‌కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్రమోడీ 'ఎక్స్' వేదికగా అభినందనలు తెలిపారు.

## పరుగులో గుల్వీర్‌కు కాంస్యం

**నగోయా:** భారత క్రీడాకారుడు గుల్వీర్ సింగ్, మంగళవారం జరిగిన పురుషుల 5000 మీటర్ల ఫైనల్‌లో కాంస్య పతకం సాధించి, 2026 ఆసియా క్రీడలలో అద్భుతమైన పతకాల హ్యాట్రిక్‌ను పూర్తి చేశారు. తద్వారా, ఈ ఖండాంతర క్రీడల ఒకే ఎడిషన్‌లో ఇది మూడో పతకం గెలిచిన గత 40 ఏళ్లలో తొలి భారతీయ అథ్లెట్‌గా నిలిచాడు. హోరాహోరీగా సాగిన రేసులో గుల్వీర్ 13:32.75 సమయంతో మూడవ స్థానంలో నిలిచాడు. దీనితో, ఈ క్రీడలలో అంతకుముందు పురుషుల 10,000 మీటర్లు, 1500 మీటర్ల ఈవెంట్లలో తాను సాధించిన రజత పతకాలకు అతను కాంస్య పతకాన్ని జోడించాడు. దీంతో ఒకే ఆసియా క్రీడల్లో మూడు పతకాలు సాధించిన ఉష తర్వాత మొదటి భారత క్రీడాకారుడుగా గుల్వీర్ నిలిచాడు. ఇక ప్రస్తుత 5000 మీటర్ల ఫైనల్‌లో, గుల్వీర్ ప్రారంభ దశలలో ముందు వరుసలో ఉన్న




పరుగువీరులలో ఒకడిగా నిలిచి, మొదటి 2000 మీటర్ల తర్వాత మూడవ స్థానానికి పడిపోయాడు. రేసు నిర్ణయాత్మక దశలోకి ప్రవేశించినప్పుడు కూడా అతను తన స్థానాన్ని నిలబెట్టుకున్నాడు, కానీ మొదటి రెండు స్థానాలలో దేనికోసమూ పోటీపడలేకపోయాడు.

## హైజంప్‌లో పూజకు కాంస్యం

### పురుషుల జట్టుకు కాంస్యం

**నాగోయా:** జపాన్‌లోని ఐచినగోయాలో మంగళవారం జరిగిన ఆసియా గేమ్స్ 2026 మహిళల హైజంప్‌లో, భారత జాతీయ రికార్డు హోల్డర్ పూజ కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. అలాగే అథ్లెటిక్ స్టేడియంలో జరిగిన పురుషుల 4న400 మీటర్ల రిలేలో భారత బృందం 3:01.61 సమయాన్ని నమోదు చేసి, కాంస్య పతకంతో 2026 ఆసియా క్రీడల్లో భారత్ తన అథ్లెటిక్స్ ప్రచారాన్ని ముగించింది. ఫైనల్‌లో పూజ 1.84 మీటర్లఅత్యుత్తమ ఎత్తును అధిగమించి 3వ స్థానంలో నిలిచింది.






19 ఏళ్ల పూజ 1.84 మీటర్ల ఎత్తును అధిగమించి కొద్దిసేపు ఆధిక్యంలోకి వెళ్లినప్పటికీ, మూడు ప్రయత్నాల్లోనూ 1.87 మీటర్ల ఎత్తును అధిగమించడంలో విఫలమై, చివరికి కాంస్య పతకంతో సరిపెట్టింది. ఇక ధరమ్‌వీర్ చౌదరి, మను తీక్కినిల్, జయ కుమార్, విశాల్ తెన్నరసులతో కూడిన భారత పురుషుల జట్టు హోరాహోరీగా జరిగిన ఫైనల్‌లో మూడో స్థానంలో నిలిచి కాంస్యం సాధించింది. ధరమ్‌వీర్ చౌదరి నిలకడైన ఆరంభాన్ని అందించిన తర్వాత, జట్టు పతకం రేసులో నిలవగా, బాటన్‌ను మను తీక్కినిల్‌కు అప్పగించాడు. రెండవ లెగ్‌లో జయ్ అద్భుతంగా పరుగెత్తి భారత్‌ను పతక స్థానాలకు చేర్చాడు. చివరి దశలో భారత్ నాలుగో స్థానానికి పడిపోయినప్పటికీ, విశాల్ తెన్నరసు చివరి అంచెలో బలంగా పరుగెత్తి, వెనుకబడిన స్థానాన్ని పూడ్చి కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు.

## నేడు రెండో వన్డే

### వెస్టిండీస్, భారత్‌కు కీలక మ్యాచ్

### టీమిండియాలో సిరాజ్ రీ ఎంట్రీ







**న్యూఢిల్లీ:** వెస్టిండీస్, భారత్ మధ్య తదుపరి రెండో వన్డే మ్యాచ్ గువాహటి వేదికగా ఈ నెల 30వ తేదీన జరగనుంది. ఈ మ్యాచ్ ఇరు జట్లకు ఎంతో కీలకం. మొదటి వన్డే గెలిచిన టీమిండియాకు ఇది సిరీస్ నిర్ణయాత్మక మ్యాచ్ కానుంది. ఈ మ్యాచ్ గెలిస్తే టీమిండియా చివరి మ్యాచ్ మిగిలి ఉండగానే మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-0తో వశం చేసుకుంటుంది. ఇది జట్టుకు గొప్ప ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుంది. మరోవైపు, సిరీస్‌లో నిలవాలంటే వెస్టిండీస్ ఈ మ్యాచ్ తప్పనిసరిగా గెలవాల్సి ఉంది. ఈ మ్యాచ్‌లో ఓడిపోతే సిరీస్‌ను కోల్పోయి, వారి పరాజయాల పరంపర కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో రెండో వన్డే టీమిండియా, వెస్టిండీస్‌కు ఎంతో కీలకంగా మారింది. ఇక ఈ కీలక రెండో వన్డేలో టీమిండియాలో ఒక కీలక మార్పు చోటు చేసుకునే అవకాశం ఉంది. ఫాస్ట్ బౌలర్ గున్నార్ బార్ స్థానంలో మహమ్మద్ సిరాజ్ రీఎంట్రీ ఇవ్వనున్నాడు. తొలి మ్యాచ్‌లో గున్నార్ బార్ 10 ఓవర్లలో 60 పరుగులు ఇచ్చి ఒక్క వికెట్ కూడా తీయలేకపోవడం, వికెట్లు పడగొట్టడంలో విఫలం కావడం దీనికి ప్రధాన కారణం. సిరాజ్‌ను తొలి వన్డేలో పక్కన పెట్టిన మేనేజ్‌మెంట్, ఈ రెండో వన్డేలో అతడికి చోటు కల్పించనున్నట్లు తెలుస్తుంది. జట్టులోకి సిరాజ్ వస్తే పవర్ ప్లేలో వికెట్లు దక్కే అవకాశం ఉంది. సిరాజ్ తన స్వింగ్‌తో ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్‌ను ఇబ్బంది పెట్టి, ఆరంభంలోనే వికెట్లు తీయగల సమర్థుడు. దీంతోనే టీమిండియా ఈ మార్పుతో బరిలోకి దిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇది జట్టు బౌలింగ్ విభాగాన్ని మరింత బలోపేతం చేయగలదు. కాగా దాదాపు నాలుగేళ్ల తర్వాత భారత గడ్డ మీద వన్డే మ్యాచ్ ఆడిన వెస్టిండీస్ క్రికెట్ జట్టుకు చేదు అనుభవం ఎదురైంది. గత వైఫల్యాలను కొనసాగిస్తూ టీమిండియాతో ఈ నెల 27న జరిగిన తొలి వన్డేలో కరేబియన్ జట్టు ఎనిమిది వికెట్ల తేడాతో చిత్తుగా ఓడిపోయింది. ఈ మ్యాచ్‌లో విండీస్ ఓపెనర్లు శుభారంభం అందించినప్పటికీ, మిడిల్ ఆర్డర్ దానిని కొనసాగించలేకపోయింది. భారత్ కేవలం 41.4 ఓవర్లలోనే రెండు వికెట్లు మాత్రమే నష్టపోయి విజయాన్ని నమోదు చేసింది. వెస్టిండీస్ బౌలింగ్ విభాగం కూడా తేలిపోవడంతో టీమిండియా ఈ మేరకు సునాయాస విజయం సాధించింది. ఈ నేపథ్యంలో రెండో వన్డేను చేజిక్కించుకునేందుకు భారత్, సిరీస్ దక్కించుకునేందుకు వెస్టిండీస్ పట్టుదలతో బరిలోకి దిగనున్నాయి.

## రెపోరేట్లపై ఆర్బీఐ వేచిచూసే ధోరణి

### అక్టోబరు,డిసెంబరులోనే పెంపు?

### నోమురా బ్రోకరేజి సంస్థ అంచనాలు

**ముంబై, సెప్టెంబరు 29:** ద్రవ్యోల్బణం, ఆర్థిక వృద్ధికి సంబంధించిన పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని భారతీయ రిజర్వ్ బ్యాంక్ మార్కెట్లు అంచనా వేస్తున్నంత స్థాయిలో దూకుడుగా వడ్డీ రేట్లను పెంచకపోవచ్చని అంతర్జాతీయ బ్రోకరేజ్ సంస్థ నోమురా పేర్కొంది. పరిమిత స్థాయిలో మాత్రమే ద్రవ్య విధానాన్ని కఠినతరం చేసే అవకాశం ఉందని తెలిపింది. ఆర్‌బీఐ ద్రవ్య విధానం ప్రస్తుతం కీలక దశలోఉందని పేర్కొంది. వచ్చే ఏడాది కాలంలో దాదాపు 125 బేసిస్ పాయింట్ల మేర రెపో రేటు పెంపును మార్కెట్లు ఇప్పటికే అంచనా వేస్తున్నాయని తెలిపింది. ఇంతటి భారీ రేట్ల పెంపు అవసరం లేకపోవచ్చని, విధానంలో అవసరమైన సర్దుబాట్లపైనే ఆర్‌బీఐ దృష్టి పెట్టే అవకాశం ఉందని అంచనా వేసింది.దేశంలో ట్రెండ్ ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టిందని, ఆర్థిక వ్యవస్థలోని వివిధ రంగాలకు ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు విస్తరిస్తున్న సంకేతాలు కనిపించడం లేదని నోమురా తెలిపింది. మరోవైపు, నోమురా రూపొందించిన ముందస్తు సూచిక సమీప భవిష్యత్తులో ఆర్థిక వృద్ధి సాధారణ స్థాయి కంటే తక్కువగా ఉండే అవకాశాన్ని సూచిస్తోందని పేర్కొంది. వచ్చే ఆరు నెలల్లో ఆహారం, ఇంధన ధరల కారణంగా వినియోగదారుల ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం ఉందని నోమురా అంచనా వేసింది. అదే సమయంలో ఈ ధరల ఒత్తిళ్ల చివరకు డిమాండ్‌పై ప్రభావం చూపవచ్చని, దీంతో ద్రవ్యోల్బణం మళ్లీ తగ్గుముఖం పట్టి ఆర్‌బీఐ నిర్దేశించిన లక్ష్యానికి చేరుకునే అవకాశం ఉందని తెలిపింది.2026-27 ఆర్థిక సంవత్సరంలో రిటైల్ ద్రవ్యోల్బణం 5.2 శాతంగా ఉండొచ్చని నోమురా అంచనా వేసింది. అనంతరం 2027-28లో ఆర్‌బీఐ నిర్దేశించిన 4 శాతం మధ్యకాలిక లక్ష్యానికి చేరువగా తగ్గే అవకాశం ఉందని పేర్కొంది. ఆర్‌బీఐ అక్టోబర్, డిసెంబర్ సమావేశాల్లో రెపో రేటును 25 బేసిస్ పాయింట్ల చొప్పున పెంచవచ్చని నోమురా అంచనా వేసింది. దీంతో తుది రెపో రేటు 5.75 శాతానికి చేరుకోవచ్చని తెలిపింది. ఆర్‌బీఐని రేట్ల పెంపు వైపు నడిపించే అవకాశం ఉన్నప్పటికీ, ఆహారం, ఇంధన రంగాలకే ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు పరిమితమై, ఆర్థిక వృద్ధి మందగిస్తే దీర్ఘకాలికంగా భారీ స్థాయిలో రేట్ల పెంపు అవసరం ఉండకపోవచ్చని నోమురా అభిప్రాయపడింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను పెంచిన నేపథ్యంలో ఆర్‌బీఐ కూడా రానున్న ఏడాది కాలంలో భారీ స్థాయిలో రెపో రేటును పెంచుతుందన్న మార్కెట్ అంచనాలు పెరిగిన నేపథ్యంలో నోమురా అంచనాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

## రెండో రోజూ నష్టాల్లో స్టాక్ మార్కెట్లు




**ముంబై, సెప్టెంబరు 29:** ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ గడువు ముగింపు రోజు నెలకొన్న తీవ్ర ఒడిదుడుకుల మధ్య దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో సెషన్‌లోనూ నష్టాలతో ముగిశాయి. ఇరాన్ యుద్ధం, శాంతి ఒప్పందంపై నెలకొన్న అనిశ్చితి, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల విక్రయాలు, రూపాయి బలహీనత, పెరుగుతున్న ముడి చమురు ధరలు, అమెరికా ట్రెజరీ రిటర్నులు అధిక స్థాయిలో ఉండటం వంటి అంశాలు మార్కెట్ సెంటిమెంట్‌పై ఒత్తిడిపెంచాయి. దీంతో చాలా వరకు రంగాల సూచీలు నష్టాల్లో ముగిశాయి. ఐటీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఆటో షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించగా మెటల్, ఫార్మా షేర్లు లాభపడ్డాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 242.65 పాయింట్లు పతనమై 72,529.07 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 సూచీ 64.05 పాయింట్లు తగ్గి 22,716.20 వద్ద స్థిరపడింది. వరుసగా రెండు సెషన్లలో సెన్సెక్స్ 1.85 శాతం, నిఫ్టీ 1.83 శాతం చొప్పున నష్టపోయాయి.నిఫ్టీలో టైటాన్ కంపెనీ 3 శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.30 శాతం, ఐసీఐసీఐ బ్యాంక్ 0.75 శాతం చొప్పున పడిపోయి సూచీపై అధిక ఒత్తిడి తెచ్చాయి. బీఎస్ఈ 150 మిడ్‌క్యాప్ సూచీ 0.74 శాతం, బీఎస్ఈ 250 స్మాల్‌క్యాప్ సూచీ 0.49 శాతం చొప్పున క్షీణించాయి.ఎన్ఎస్ఈలో 1,529 షేర్లు లాభాల్లో ముగియగా, 2,038 షేర్లు నష్టాల్లో ముగిశాయి. మరో 112 షేర్లలో ఎలాంటి మార్పు లేదు. బ్రెంట్ క్రూడ్ నవంబర్ 2026 ఫ్యూచర్స్ 25 సెంట్లు తగ్గి బ్యారెల్‌కు 105.03 డాలర్లకు చేరింది. అమెరికా 10 ఏళ్ల బాండ్ ఈల్డ్ 0.08 శాతం తగ్గి 5.241 శాతంగా నమోదైంది. భారత్ 10 ఏళ్ల బెంచ్‌మార్క్ ప్రభుత్వ బాండ్ ఈల్డ్ 0.14 శాతం తగ్గి 7.173 శాతానికి చేరింది. గత సెషన్‌లో ఇది 7.111 శాతంగా ఉంది. రూపాయి స్వల్పంగా బలపడింది. ఫారెక్స్ మార్కెట్‌లో డాలర్‌తో పోలిస్తే రూపాయి స్వల్పంగా బలపడింది. పాక్షికంగా కన్వర్టబుల్ రూపాయి 95.9500 వద్ద ట్రేడవగా, గత సెషన్ ముగింపు 95.9700గా ఉంది. ఎంసీఎక్స్‌లో అక్టోబర్ 5, 2026 డెలివరీ బంగారం ఫ్యూచర్స్ 0.11 శాతం తగ్గి 10 గ్రాములకు రూ.1,46,645 వద్ద నమోదయ్యాయి. బీఎస్ఈలో వర్మోరా గ్రానిటో షేర్ రూ.152.80 వద్ద ట్రేడైంది. ఇది ఇష్యూ ధర రూ.148తో పోలిస్తే 3.24 శాతం ప్రీమియం. షేర్ బీఎస్ఈలో రూ.152 వద్ద లిస్ట్ అయింది. ఇష్యూ ధరతో పోలిస్తే ఇది 2.7 శాతం ప్రీమియం. ఇంట్రాడేలో రూ.163.45 గరిష్ఠాన్ని, రూ.148 కనిష్ఠాన్ని తాకింది. బీఎస్ఈలో కంపెనీకి చెందిన 56.73 లక్షలకు పైగా షేర్లు చేతులు మారాయి.స్టాక్ స్పాట్‌లైట్ ఫిన్‌టెక్: మంగళవారం పీబీ ఫిన్‌టెక్ షేర్ 6.11 శాతం క్షీణించి రూ.1,081కు చేరింది. దీంతో వరుసగా నాలుగు ట్రేడింగ్ సెషన్లలో ఈ షేర్ 42.69 శాతం నష్టపోయింది. బీమా పంపిణీ రంగ ఆర్థిక విధానంలో మార్పులకు ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రతిపాదించిన సంస్కరణల నేపథ్యం లో ఈ షేర్‌పై ఒత్తిడి కొనసాగుతోంది.రేసెస్ ఆఫ్ బిలీఫ్ షేర్ 13.27 శాతం దూసుకెళ్లింది. ఆజాద్ ఇంజినీరింగ్ సంస్థ జీఈ వెర్నోవా గ్యాస్ పవర్ వ్యాపారం కోసం రెండు ప్రత్యేక లీన్ మ్యానుఫ్యాక్చరింగ్ కేంద్రాలను ప్రారంభించినట్లు కంపెనీ ప్రకటించడంతో షేర్ 7.04 శాతం పెరిగింది. కొత్తగాఏర్పాటు చేసిన రెండు కేంద్రాలు ఒక్కొక్కటి7,600 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్నాయి.

## అమెరికాలో ఎస్సార్‌గ్రూప్ రూ.1.4 కోట్ల పెట్టుబడి

### అయోవాలో భారీ స్టీల్ ప్లాంట్ నిర్మాణం



**వాషింగ్టన్, సెప్టెంబరు 29:** అమెరికా చరిత్రలోనే అతిపెద్ద పారిశ్రామిక ప్రాజెక్టుగా భారీ ఉక్కు కర్మాగారానికి ఆమోదం లభించింది. భారత్‌కు చెందిన ప్రముఖ ఎస్సార్ గ్రూప్ యాజమాన్యంలోని మెసాబి మెటాలిక్స్ కంపెనీ, అమెరికాలోని అయోవా రాష్ట్రంలో 15 బిలియన్ డాలర్ల సుమారు రూ. 1.4 లక్షల కోట్లు భారీ వ్యయంతో స్టీల్ ప్లాంట్‌ను నిర్మించనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వయంగా ప్రకటించారు. ఇది అమెరికా చరిత్రలోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్‌గా నిలవనుందని వైట్‌హౌస్ పేర్కొంది. వైట్‌హౌస్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ట్రంప్ ఈ కీలక ప్రకటన చేశారు. ఈ సమావేశంలో మెసాబి మెటాలిక్స్ ఛైర్మన్ రేవంత్ రుయా, ఎస్సార్ గ్రూప్ సహ వ్యవస్థాపకుడు రవి రుయాతో పాటు ఇతర కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ, ఈ ప్లాంట్ అత్యంత అధునాతన టెక్నాలజీతో, నాణ్యమైన స్టీల్‌ను అందుబాటు ధరలలో ఉత్పత్తి చేస్తుందని తెలిపారు. ముడిసరుకు సేకరణ నుంచి ఉక్కు ఉత్పత్తి వరకు పూర్తిగా అమెరికాలోనే జరిగేలా ఒక సమీకృత సరఫరా వ్యవస్థను ఈ ప్రాజెక్ట్ ఏర్పాటు చేస్తుందని వివరించారు. ఈ భారీ స్టీల్ ప్లాంట్‌ను అయోవా రాష్ట్రంలోని లీ కౌంటీలో ఏర్పాటు చేయనున్నారు. దీనికి అవసరమైన ముడి ఇనుమును మిన్నెసోటాలోని నాష్‌వాక్‌లో కొత్తగా అభివృద్ధి చేసిన గని నుంచి సేకరిస్తారు. గత 50 ఏళ్లలో అమెరికాలో ఏర్పాటైన మొట్టమొదటి కొత్త ఇనుప ఖనిజం గని ఇదే కావడం విశేషం.

మిన్నెసోటాలోని ఈ గని ప్రాజెక్టుపై ఎస్సార్ గ్రూప్ ఇప్పటికే 2.5 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడి పెట్టింది. గని, స్టీల్ ప్లాంట్‌లను కలిపి ఈ మొత్తం ప్రాజెక్ట్ విలువ సుమారు 18 బిలియన్ డాలర్లకు చేరుకుంటుంది. 2030 నాటికి ఉక్కు ఉత్పత్తిని ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్న ఈ ప్లాంట్, తొలి దశలో ఏటా 7.5 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. భవిష్యత్తులో దీనిని 10 మిలియన్ టన్నులకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా అమెరికాలో భారీగా ఉద్యోగాల కల్పన జరగనుంది. నిర్మాణ దశలో సుమారు 6,000 మందికి, ప్లాంట్ కార్యకలాపాలు మొదలయ్యాక 1,750 మందికి శాశ్వత ఉత్పాదక ఉద్యోగాలు లభిస్తాయి. ఈ ప్రాజెక్ట్ నిర్మాణం, కార్యకలాపాల మొదటి దశాబ్దంలో అమెరికా ఆర్థిక వ్యవస్థపై సుమారు 95 బిలియన్ డాలర్ల సానుకూల ప్రభావం చూపుతుందని వైట్‌హౌస్ అంచనా వేసింది. దిగుమతి చేసుకునే ఉక్కుపై తన ప్రభుత్వం విధించిన అధిక సుంకాల (టారిఫ్‌లు) వల్లే కంపెనీలు అమెరికాలో ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు ముందుకొస్తున్నాయని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఈ ప్లాంట్‌తో గని నుంచి ఉక్కు తయారీ వరకు 100 శాతం అమెరికన్ సరఫరా వ్యవస్థ పూర్తవుతుందని మెసాబి మెటాలిక్స్ పేర్కొంది.



### అదానీకి సెబీ నుంచి ఊరట
## రూ.1.48 కోట్లకు సెటిల్‌మెంట్

**ముంబయి, సెప్టెంబరు 29:** అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీకి మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నుంచి ఊరట లభించింది. కనీస పబ్లిక్ షేర్‌హోల్డింగ్ నిబంధనల ఉల్లంఘన ఆరో పణలపై అదానీ గ్రూప్‌నకు చెందిన నాలుగు కం పెనీలపై చేపట్టిన చర్యలను సెబీ ముగించింది. ఈ కేసు పరిష్కారం కోసం గౌతమ్ అదానీ సహా మొత్తం 18 మంది రూ.1.48 కోట్ల సెటి ల్‌మెంట్ మొత్తాన్ని చెల్లించారు. అదానీ గ్రూప్ లోని కొన్ని కంపెనీలు కనీస పబ్లిక్ షేర్‌హోల్డింగ్ నిబంధనలను పాటించడం లేదంటూ 2020 జూన్, జులై నెలల్లో సెబీకి ఫిర్యాదులు అం దాయి. వీటిపై ప్రాథమిక విచారణ చేపట్టిన సెబీ అదే ఏడాది అక్టోబర్ 23న పూర్తిస్థాయి దర్యాప్తు ప్రారంభించింది. దర్యాప్తు పూర్తయిన తర్వాత 2024 సెప్టెంబర్ 27న సెబీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. 2025 మార్చి 3న మరో అను బంధ నోటీసు ఇచ్చింది. కనీస పబ్లిక్ షేర్‌హో ల్డింగ్ నిబంధనల ఉల్లంఘనకు సంబంధించి ఈ నోటీసులు జారీ అయ్యాయి. అదానీ ఎం టర్‌ప్రై జెస్, అదానీ పవర్, అదానీ పోర్ట్స్, అదానీ ట్రాన్స్‌మిషన్ కంపెనీలు ఈ కేసులో ఉన్నాయి. ఈ వ్యవహారాన్ని పరిష్కరించుకునేం దుకు సం బంధిత వ్యక్తులు సెబీకి ప్రతిపాదన పంపారు. ఆరోపణలను అంగీకరించకుండా, తిరస్కరిం చకుండా కేసును ముగించుకునేందుకు అంగీకరిం చారు. ఈక్రమంలో మొత్తం రూ. 1.48 కోట్లను సెటిల్‌మెంట్ కింద చెల్లించారు. దీంతో గౌతమ్ అదానీ, నాలుగు కంపెనీలు, మరో 13 మందిపై కొనసాగుతున్న చర్యలను ముగిస్తున్నట్లు సెబీ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

## బ్యాంకులకు 16 రోజులు సెలవులు

**ముంబయి, సెప్టెంబరు 29:** దేశవ్యాప్తంగా అక్టోబరులో వివిధ రాష్ట్రాల వారీగా బ్యాంకులకు మొత్తం 16 రోజులు సెలవులు వస్తున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన జాబితా ప్రకారం అక్టోబర్ 2026 నెలలో బ్యాంకులకు సాధారణ సెలవులతో కలిపి మొత్తంగా 16 సెలవులు ఉన్నాయి. ఇది రాష్ట్రాల వారీగా మారుతుంది. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా అక్టోబరు 2 బ్యాంకులకు నేషనల్ హాలీడే ఉంటుంది. మహాలయ అమావాస్య సందర్భంగా కర్ణాటక, పశ్చిమ బెంగాల్‌లో 10వ తేదీ బ్యాంకులకు సెలవు ఉంటుంది.మహా సప్తమి ఫెస్టివల్ సందర్భంగా త్రిపురలో 17వ తేదీ బ్యాంకులు మూసి ఉంటాయి. దసరా, మహా నవమి, ఆయుధ పూజ, దుర్గ పూజ, విజయ దశమి, దుర్గాష్టమి వంటి పండగల నేపథ్యంలో దేశంలోని త్రిపుర, మిజోరాం, ఒడిశా, తమిళనాడు, అసోం, మణిపూర్, అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్, వెస్ట్ బెంగాల్, బిహార్, జార్ఖండ్, మేఘలయలో బ్యాంకులకు సెలవు ఉంటుంది. దసరా, దుర్గపూజ, విజయ దశమి సందర్భంగా మణిపూర్, సిక్కింమినహా దాదాపు అన్ని రాష్ట్రాల్లో సెలవు ఉంటుంది. 21వ తేదీ త్రిపుర, కర్ణాటక, సిక్కి, అసోం, కేరళ, వెస్ట్ బెంగాల్ లో దుర్గ పూజ, విజయ దశమి సందర్భంగా సెలవు ఉంటుంది. 22వ తేదీ సిక్కింలో దుర్గ పూజ సందర్భంగా సెలవు ఉంటుంది. 23వ తేదీ సిక్కింలో దుర్గ పూజ సందర్భంగా బ్యాంకులకు సెలవు ఉంటుంది. అక్టోబర్ 26వ తేదీ మహా రుషి వాల్మీకి జయంతి, లక్ష్మీ పూజ సందర్భంగా త్రిపుర, చండీగఢ్, జమ్మూ కశ్మీర్, శ్రీనగర్, హిమాచల్ ప్రదేశ్ వంటి ప్రాంతాల్లో బ్యాంకులు మూసి ఉంటాయి. 29వ తేదీ కర్వా చౌత్ సందర్భంగా హిమాచల్ ప్రదేశ్‌లో బ్యాంకులు మూసి ఉంటాయి. 31వ తేదీ సర్దార్ వల్లాభ్ భాయ్ పటేల్ జయంతి సందర్భంగా గుజరాత్‌లో బ్యాంకులకు హాలీడే ఉంటుంది. వీటితో పాటుగా ఆదివారాలు, నెలలో రెండో,నాలుగో శనివారాలు బ్యాంకులకు సాధారణ సెలవు ఉంటుంది. బ్యాంకులు మూసిఉన్నా నెట్ బ్యాంకింగ్,యూపీఐ, మొబైల్ బ్యాంకింగ్ వంటి సేవలు అం దుబాటులో ఉంటాయి.

## ఒకటో తేదీ వస్తోంది..మార్పులున్నాయి జాగ్రత్త..

**ముంబయి, సెప్టెంబరు 29:** పండగల సందడితో పాటు మన జేబులపై ప్రభావం చూపే కొన్ని ముఖ్యమైన మార్పులు అక్టోబరు ఒకటినుంచే అమల్లోకి రాబోతున్నాయి. బ్యాంకింగ్, స్మాల్ సేవింగ్స్, గ్యాస్ సిలిండర్, ఐటీఆర్ మాత్రమే కాదు పండగకి కొత్త కార్లు లేదా టీవీ, ఏసీలు కొందామనుకునే వారికి కూడా ఈ మార్పులు అవసరమే.పీపీఎఫ్, ఎన్ఎస్‌సీ, సుకన్య సమృద్ధి యోజన, సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్, పోస్టాఫీస్ డిపాజిట్లపై ఇచ్చే వడ్డీ రేట్లను ప్రభుత్వం ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్షిస్తుంది. అక్టోబర్ డిసెంబర్ కాలానికి గాను కొత్త వడ్డీ రేట్లను ప్రకటించనున్నారు. ఇక ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ సమావేశం అక్టోబర్ 5 నుంచి 7 వరకు జరగనుంది. చివరి రోజైన అక్టోబర్ 7న రెపో రేటుపై ప్రకటన వెలువడుతుంది. ప్రస్తుతం రెపో రేటు 5.25 శాతంగా ఉంది. ఎస్‌బీఐ రీసెర్చ్ అంచనా ప్రకారం ఈసారి రెపో రేటును 0.25 శాతం పెంచే అవకాశం ఉంది. ఒకవేళ ఆర్‌బీఐ ఈ నిర్ణయం తీసుకుంటే రాబోయే రోజుల్లో బ్యాంక్ లోన్లు, ఎఫ్‌డీలపై వడ్డీ రేట్లలో మార్పులు వచ్చే అవకాశం ఉంటుంది. అలాగే ఎస్‌బీఐ శాలరీ ప్యాకేజ్ అకౌంట్ వాడుతున్న వారికి అక్టోబర్ 1 నుంచి ఒక కీలక మార్పురాబోతోంది.ఇప్పటివరకు వేరే బ్యాంక్ ఏటీఎంలు లేదా ఏడీడబ్ల్యూఎంల నుంచి నెలకు 10 సార్లు ఉచితంగా క్యాష్ తీసుకునే వెసులుబాటు ఉండగా, దాన్ని ఇప్పుడు 5 సార్లకు తగ్గించారు.

# కాకర రసంతో కుదుర్లు గట్టిగా!



కాకరకాయ కేవలం ఆరోగ్యాన్ని పెంపొందించడమే కాదు.. కురుల అందాన్ని ఇనుమడింపజేస్తుంది.. కాకర రసం తరచూ కుదుళ్లు, జుట్టుకు పట్టించడం వల్ల జుట్టు రాలే సమస్య తగ్గుముఖం పడుతుందం టున్నారు నిపుణులు. మరి, ఇది వివిధ రకాల జుట్టు సమస్యలను ఎలా దూరం చేస్తుందో తెలుసుకుందాం.. అరకప్పు కాకర రసాన్ని తీసుకొని దానిలో చెంచా కొబ్బరి నూనెను కలపాలి. ఈ మిశ్రమాన్ని కుదుళ్లకు, జుట్టు మొత్తానికి పట్టించాలి. ఆపై పది నిమిషాల పాటు మర్దన చేసుకోవాలి. అరగంటయ్యాక గోరువెచ్చని నీటితో తలస్నానం చేయాలి. ఈ మిశ్రమాన్ని వారంలో రెండుసార్లు అప్లై చేయడం వల్ల జుట్టు రాలే సమస్య అదుపులోకి వచ్చే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. గోడ తోడు కొద్దిగా జీలకర్ర తీసుకొని మెత్తటి పేస్ట్లా తయారు చేసుకోవాలి. దీన్ని కాకర రసంలో కలిపి కుదుళ్లకు పట్టించాలి. కాసేపు ఆరనిచ్చి ఆ తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి రెండు నుంచి మూడుసార్లు చేయడం వల్ల చుండ్రు సమస్య నుంచి విముక్తి కలిగే అవకాశం ఉంటుందంటున్నారు నిపుణులు. పొడిబారిన జుట్టుకు.. కాకర రసం, పెరుగు అరకప్పు చొప్పున తీసుకోవాలి. వీటికి రెండు చెంచాల నిమ్మరసం జత చేసి బాగా కలుపుకోవాలి. ఈ మిశ్రమంలో కొంత వరకు కుదుళ్లకు పట్టించి కాసేపు మునివేళ్లతో మృదువుగా మర్దన చేసుకోవాలి. మిగిలిన వాటి వెంట్రుకలకు పట్టించి అరగంటపాటు ఆరనివ్వాలి. ఆ తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేసుకోవాలి. ఇలా తరచూ చేస్తుంప జుట్టు పొడిబారే సమస్య తగ్గే అవకాశం ఉంటుంది. ▫

# ఒక అడుగు ముందుకే !

అనుకున్న పనిని వేగవంతంగానూ కచ్చితంగా పూర్తి చేయడం అమ్మాయిలు ముందుంటారు. ఉద్యోగంలో తమ వందశాతం ఇచ్చేందుకు అన్నివిధాల కృషి చేస్తారు. అందుకే, కొన్ని కంపెనీల అమ్మాయిలకే ప్రాముఖ్యత ఇస్తాయి. కానీ, చాలామంది మహిళలు నాయకత్వ పదవులను తీసుకోవడాన్ని ఆలస్యంగా బిహేవియరల్ డేటా చెబుతోంది. కెరియర్లో ముందుకు వెళ్లేందుకు ఏదైనా అవకాశం వస్తే... అమ్మో! మావల్ల కాదంటూ చేతులెత్తేస్తున్నారట అమ్మాయిలు. నేను ఇప్పుడే ఆ బాధ్యతలు



తీసుకోవడానికి సిద్ధంగా లేను... మొదట వాళ్లు చెప్పే కారణం ఇదే. కాబట్టే కెరియర్లో ముందుకు వెళ్లలేకపోతు న్నారన్నది సైకాలజిస్టులు చెప్పే మాట. హెచ్పీ సంస్థ నిర్వహించిన ఓ అధ్యయనం ప్రకారం... ఏదైనా కొత్త అవకాశం వచ్చినప్పుడు అబ్బాయిలకు 60 శాతం అర్హత ఉన్నా, వారు ఆ బాధ్యతలు తీసుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. అదే అమ్మాయిలైతే మేం వందశాతానికి చేరుకునే వరకు ఆ బాధ్యత తీసుకోం అంటూ వెనక్కి తగ్గుతున్నారు. అయితే, న్యూరోసైన్స్ ప్రకారం... మెదడు దీనికి వ్యతిరేకంగా పనిచేస్తుంది. ఈ సంకోచాన్ని ప్రమాదంగా భావిస్తుంది. దాంతో మనం కంఫర్ట్ జోన్ ను దాటి బయటకు రాలేం, అదే ఆత్మవిశ్వాసనీ తగ్గిపోతుంది. మనం అనుకునే ఆ వందశాతానికి ఎప్పుడూ చేరుకోకుండా చేస్తుంది. అందుకే, నాపై నాకు నమ్మకం వచ్చాక బాధ్యత తీసుకుంటా అనుకోకుండా, ముందు ధైర్యంగా రిస్క్ తీసుకుంటే, ఆపై ఆత్మవిశ్వాసం అదే వస్తుందంటున్నారు అధ్యయనాలు. మరి మీరు ఎలా ఆలోచిస్తారో మరి. ▫

# బ్రేకప్ అయితేనేం !



ప్రేమ.. ఇది ఎంతటి మధురానుభూతులను పంచు.. విఫలమైతే అంతకంటే ఎక్కువగా బాధ పెడుతుంది. కొంతమంది ఇలాంటప్పుడు మానసికంగా కుంగిపోతుంటారు. ఇదిగో ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లోనే ఆచితూచి అడుగేయాల రిలేషన్ షిప్ నిపుణులు. అప్పుడే జీవితంలో ముందుకెళ్లచ్చంటున్నారు. అలాకాకుండా క్షణికావేశానికి లోనైనా జీవితమే ప్రశ్నార్థకమవుతుందం టున్నారు. మరి, విఫలమైన ప్రేమ నుంచి పాఠాలు నేర్చుకొని ముందుకు సాగాలంటే ఏం చేయాలో తెలుసుకుందాం రండి.. ప్రేమలో విఫలమైన అమ్మాయిల్లో చాలామంది తమలో లోపాలు వెతుక్కుంటారంటున్నారు నిపుణులు. ఇలాంటి ప్రతికూల ఆలోచనలు వారిని మరింతగా కుంగదీసి క్షణికావేశానికి లోనయ్యేలా చేస్తాయి. వారిని మరింత డిప్రెషన్లోకి నెట్టేస్తాయి. ఇలాంటి సమయంలో ఎలాంటి ప్రమాదకర నిర్ణయం తీసుకోవడానికైనా మనసును ఉసిగొల్పుతాయి. కాబట్టి ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లో సానుకూల ఆలోచనలు చేయాలని నిపుణులు భావిస్తున్నారు. నిజానికి మీలోని శారీరక లోపాలే బ్రేకప్ కి కారణమైతే.. అది మీ తప్పు కాదని, అందుకు బాధపడాల్సిన అవసరం అంతకన్నా లేదంటున్నారు. ఎవరూ ఏ విషయంలోనూ సంపూర్ణం కాదని... మిమ్మల్ని మీరుగా ప్రేమించే వ్యక్తి భవిష్యత్తులో తప్పకుండా తారసపడతారన్న సానుకూల దృక్పథం, స్వీయ ప్రేమను అలవర్చుకోమంటున్నారు. క్షమిస్తే పోయేదేముంది. మనల్ని వద్దని వదిలేసి వెళ్లిపోయిన వాళ్ల గురించి కోపం తోనైనా ఎక్కువగా ఆలోచించడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉంటాదు. అదే జరిగిందేదో జరిగిపోయింది. క్షమించేశారనుకోండి.. ఆలోచనలు క్రమంగా మనసు నుంచి దూరమవుతాయి. కాబట్టి ఇలాంటి సానుకూల దృక్పథం వల్ల కొన్నాళ్లకు మీరు మీకు నచ్చిన దృష్టి పెట్టగలుగుతారు. భవిష్యత్తులో ముందుకెళ్లడానికి ఇంతకంటే ఇంకేం కావాలి చెప్పండి?! మనసు మాట వినండి! బ్రేకప్ తర్వాత ఇద్దరూ కలిసి వెళ్లిన చోటికే పదే పదే వెళ్లి గత జ్ఞాపకాలను గుర్తు చేసుకునే కొంతమందికి అలవాటు! దీనివల్ల వీగిపోయిన బంధం తిరిగి కలుస్తుందా? అంటే అది అసాధ్యమే అని చెప్పచ్చు. పైగా ఇలాంటి సమయంలో కొన్ని రోజుల పాటు ఎక్కడికైనా వెళ్తే బాగుంటుంది. అనిపించడం సహజం! నిజానికి ఈ ఆలోచన మంచిదే. నచ్చిన చోటికి వెళ్తే ఆ రిలీఫే వేరు.. అలాగే ప్రాణ స్నేహితులు, నచ్చిన కుటుంబ సభ్యులతో గడిపితే ఎంతో ఉపశమనంగా అనిపిస్తుంది. వీలుంటే ఇంతకు ముందు చోటు నుంచి కొత్త చోటికి మకం మార్చడం, నచ్చకపోతే ఉద్యోగం మారడం. గత జ్ఞాపకాలు వేదించకుండా కొత్త జీవితం ప్రారంభించవచ్చు. దినచర్యే.. గొప్ప రిలీఫ్! మనసు బాగోలేనప్పుడు ఏ పని పైనా దృష్టి పెట్టలేం. అలాగని రోజూ గత జ్ఞాపకాలను తలచుకుంటూ కూర్చుంటే జీవితంలో ముందుకెళ్లలేం. కాబట్టి ఇలాంటి ప్రతి కూలతల నుంచి బయటపడాలంటే చక్కటి దినచర్యను అలవర్చుకోవాలి. ఇక మనసును ప్రశాంతపరిచే యోగా, ధ్యానం వంటి అలవాట్లకు మీ జీవనశైలిలో చోట్కు కల్పించండి. ▫

# విటమిన్ సి అందుతోందా ?



శరీరానికి అత్యవసరమైన పోషకాల్లో విటమిన్ సి ఒకటి. మహిళల ఆరోగ్యానికి ఇది ఎంతో మేలు చేస్తుంది. అయితే, దీన్ని శరీరం నిల్వ ఉంచుకోలేదు. కాబట్టి రోజువారీ ఆహారంలో క్రమం తప్పకుండా తీసుకోవాలి. నిమ్మ, బత్తాయి, ఉసిరి, క్యాప్సికం, జామ, స్ట్రాబెర్రీ, కివీ, టొమాటోలతోపాటు తాజా ఆకుకూరల్లోనూ ఈ పోషకాలు పుష్కలంగా లభిస్తాయి. సాధారణంగా మహిళల్లో కనిపించే రక్తహీనతను తగ్గించడంలో సి విటమిన్ ప్రధాన పాత్ర తీసుకునే ఆహారంలోని ఐరన్ను శరీరం పూర్తిగా గ్రహించేలా ఇది సహకరిస్తుంది. అంతేకాదు, వృద్ధాప్య ఛాయలను త్వరగా దరి చేరనివ్వదు. హార్మోన్ల మార్పుల వల్ల కలిగే అలసటను తగ్గించి, మానసిక ఒత్తిడిని అదుపు చేయడంలో తోడ్పడుతుంది. తగిన శక్తిని అందించి ఉత్సాహంగానూ ఉంచుతుంది. ▫

# మొండి మరకలు 'ఉఫ్'!



తెలుపు రంగు దుస్తులు వేసుకోవడం చాలామందికి ఇష్టమే. కానీ, వాటిని ఉతకడం, రంగు మారకుండా కాపాడుకోవడం చాలా కష్టంగా అనిపించింది. అలాంటివాళ్ల కోసమే ఈ చిట్కాలు... తెలుపు దుస్తులను ఎప్పుడూ విడిగానే ఉతకాలి. వేరే కలర్ డ్రెస్లో, కలిపితే... రంగు అంటుకునే అవకాశం ఉంది. ఇక, వీటిని చల్లని నీళ్ల కంటే గోరువెచ్చగా ఉన్న నీళ్లలో నానబెట్టి ఉతికితేనే మురికి సులువుగా పోతుంది. తెలుపు రంగువి నీడలో కాకుండా మంచి ఎండలో ఆరబెట్టాలి. సూర్యరశ్మిలోని అతినీలలోహిత కిరణాలు దుస్తులపై ఉన్న సూక్ష్మక్రిములను నాశనం చేయడంతో పాటుసహజ బ్లీచ్ పనిచేస్తాయి. దాంతో మరకలు పోయి, మరింత తెల్లగా కనిపిస్తాయి. బ్లీచ్ వాడేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి. వీలైతే ఆక్సిజన్ బ్లీచ్ వాడటం మంచిది. క్లోరిన్ బ్లీచ్ తరచుగా వాడితే బట్టలు త్వరగా దెబ్బతిని పసుపు రంగులోకి మారిపోతాయి. ఉతికే నీళ్లలో రెండు టేబుల్ స్పూన్ల బేకింగ్ సోడా లేదా కొద్దిగా నిమ్మరసం కలపాలి. ఇవి దుస్తులపై ఉన్న మొండి మరకలను తొలగించి, వాటి అసలైన తెలుపురంగుని తిరిగి తెస్తాయి. లేదంటే బట్టలు ఉతికాక చివరగా నీటిలో ఒక కప్పు వైట్ వినెగర్ వేస్తే, దుస్తులపై ఉన్న సబ్బు అవశేషాలు పోయి కొత్తవాటిలా మెరుస్తాయి. ▫

# పుష్పయాగం

భగవంతుడికి వివిధ రకాల పూలతో పూజ చేయడం జరుగుతూ ఉంటుంది. తాజా పూలతో .. సువాసన వెదజల్లే పూలతో భగవంతుడిని పూజించడం వలన ఆయన ప్రీతి చెందుతాడు. తెలుపు .. పసుపు రంగు పూలు శ్రేష్ఠమైనవనేది మహర్షుల మాట. ఆయా క్షేత్రాల్లో భగవంతుడికి పుష్పయాగం చేస్తుంటారు. వివిధ రకాల పూలు ఈ పుష్పయాగంలో ఉపయోగిస్తుంటారు. జాజులు .. మెట్ట తామరలు .. ఎర్ర కలువలు .. తెల్ల కలువలు .. సంపెంగలు .. బక పుష్పాలు మొదలైనవి పుష్పయాగంలో ఉపయోగి స్తుంటారు. పుష్పయాగం చేయడం వలన అశ్వమేథ యాగం చేసిన ఫలితం దక్కుతుందని ఆధ్యాత్మిక గ్రంథాలు చెబుతున్నాయి. ఏ ప్రాంతంలో అయితే పుష్పయాగం జరుగు తుందో, ఆ ప్రాంతంలో కరువుకాటకాలు ఉండనే వుండవు. సిరి సంపదలతో అక్కడి ప్రజలు తులతూగుతారు .. అనారోగ్యాలు దరిచేరవు. పుష్పయాగాన్ని దర్శించడం వలన సమస్త పాపాలు నశిస్తాయి .. సకల శుభాలు చేకూరతాయి. ముందు తరాల వారు ... వెనుక తరాల వారు సైతం తరిస్తారు. ▫

## తెర

# రణ్‌బీర్ బర్త్‌డే సందర్భంగా 'రామాయణ'లో స్పెషల్ గ్లింప్స్ రిలీజ్



రణ్‌బీర్ కపూర్ పుట్టినరోజు సందర్భంగా 'రామాయణ' మేకర్స్ స్పెషల్ బిహైండ్ ది సీన్స్ (బిటిఎస్) గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఇందులో శ్రీరాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్ కనిపించడంతో పాటు.. ఈ అత్యంత ప్రతిష్ఠాత్మక పాత్ర కోసం ఆయన చేసిన ప్రిపరేషన్, ట్రాన్స్ఫర్మేషన్‌కు సంబం ధించిన ఆసక్తికరమైన విషయాలను చూపి ంచారు. ఈ బిటిఎస్ వీడియోలో దర్శకుడు నితేశ్ తివారీ మాట్లాడుతూ.. 'రామాయణం' లాంటి సినిమాకు సరైన నటుడిని ఎంపిక చేయడం ఎంత ముఖ్యమో వివరించారు. శ్రీరాముడిగా నటిస్తున్న రణ్‌బీర్ కపూర్ కూడా ఈ పాత్ర గురించి తన అనుభవాలను పంచుకున్నారు. ఈ పాత్రను తాను మరో సినిమా లేదా మరో క్యారెక్టర్‌లా చూడలేదని.. శ్రీరాముడి పాత్రకు న్యాయం చేయడం ఒక బాధ్యతగా భావించానని రణ్‌బీర్ తెలిపారు. ప్రొడ్యూసర్ నమిత్ మల్హోత్రా 'రామాయణం' కోసం ఈస్ట్‌లోని అత్యుత్తమ ప్రతిభను, వెస్ట్‌లోని అత్యుత్తమ టెక్నికల్ టాలెంట్‌ను ఒకే ఆలోచనతో కలిపిన విధానాన్ని కూడా ఈ బిటిఎస్ వీడియోలో చూపించారు. 'రామాయణం'ను ప్రపంచస్థాయి చిత్రంగా తీర్చిదిద్దేందుకు అంతర్జాతీయ ప్రతిభావంతులను కూడా భాగం చేశారు. రామాయణంలోని సాంస్కృతిక అంశాలను హైలైట్ చేస్తూనే.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ యాక్షన్, స్టంట్ నిపుణులు తమ నైపుణ్యాన్ని అందిస్తున్న తీరును కూడా ఈ బిటిఎస్ గ్లింప్స్‌లో చూపించారు. దీంతో ఈ ప్రాజెక్ట్ ఏ స్థాయిలో తెరకెక్కుతోందో మరోసారి అర్థమవుతోంది.

# ఘనంగా 'మయూఖ' ట్రైలర్ లాంచ్



పాయల్ చెంగప్ప ప్రధాన పాత్రలో నటిస్తున్న సినిమా "మయూఖ". ఈ చిత్రాన్ని ప్రశ్విత ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్ పై శశిధర్ నల్ల నిర్మిస్తున్నారు. శ్రీ తేజ్ ఎస్.కె. దర్శకత్వం వహిస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న 'మయూఖ' సినిమా అక్టోబర్ 9న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు'రాబోతోంది. మాస్టర్ షణ్ముఖ చరణ్ మాట్లాడుతూ 'మయూఖ' చిత్రంలో వీరు పాత్రలో నటించాను. ఈ క్యారెక్టర్ మీ అందరికీ నచ్చుతుంది. బేబి మది నస్రీన్ మాట్లాడుతూ "మయూఖ" చిత్రంలో నేను మయూఖ చిన్నప్పటి రోల్ చేశాను. ట్రైలర్ మీకు నచ్చిందని భావిస్తున్నాం. ఈ సినిమాను తప్పకుండా థియేటర్స్ లోనే చూడాలి. నటుడు నానానీ క్రి మాట్లాడుతూ ఈ చిత్రంలో సెక్యూరిటీ రవి క్యారెక్టర్ లో నటించాను. "మయూఖ" నా కెరీర్ లో వచ్చిన మంచి అవకాశంగా భావిస్తున్నా. మయూఖగా పాయల్ పర్ ఫార్మెన్స్ మీ అందరినీ ఆకట్టుకుంటుంది. అన్నారు. నటుడు దేవ్ డి మాట్లాడుతూ 'మయూఖ' ట్రైలర్ చాలా బాగుంది. ట్రైలర్ ను ఆకట్టుకునేలా కట్ చేశారు. ఈ సినిమాలో ఎస్ ఐ దేవ్ గా మీ అందరి ముందుకు రాబోతున్నా. నటుడు రఘు వాసిరెడ్డి మాట్లాడుతూ ఈ చిత్రానికి పనిచేసిన ప్రతి ఒక్కరూ ప్యాషనేట్‌గా వర్క్ చేశారు. నటుడు అభిలాష్ అడ్డ మాట్లాడుతూ మా 'మయూఖ' సినిమాకు అన్నీ తానై మా డైరెక్టర్ గారు తెరకెక్కించారు. ప్రొడ్యూసర్ శశిధర్ నల్ల మాట్లాడుతూ మా సినిమా ఈవెంట్ కు వచ్చిన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్. "మయూఖ" సినిమా అద్భుతంగా వచ్చింది. ట్రైలర్ లాగే సినిమా కూడా మీ అందరినీ ఆకట్టుకుంటుందని నమ్ముతున్నాం. హీరోయిన్ పాయల్ చెంగప్ప మాట్లాడుతూ 'మయూఖ' ఫీమేల్ ఒరియెంటెడ్ థ్రిల్లర్ మూవీ. ఇప్పుడు సినిమాల పరిస్థితి ఎలా ఉందో మనం చూస్తున్నాం. ఇలాంటి పరిస్థితుల్లో ఒక ఫీమేల్ ఒరియెంటెడ్ మూవీ చేయాలంటే ధైర్యం ఉండాలి.

# 'తత్వం' విజయంతో మా కష్టాలన్నీ మరిచిపోతాం: అర్జున్ కోలా



'తత్వం' విజయంతో మా కష్టాలన్నీ మరిచిపోతాం: అర్జున్ కోలా

అర్జున్ కోలా దర్శకత్వం లో దినేష్ తేజ్, దష్వీక.కె హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'తత్వం' త్రయతి ఇషాని క్రియేషన్స్, ఎస్.కె.ప్రొడక్షన్స్ సంయుక్త నిర్మాణంలో శీమకుర్తి వంశీ కృష్ణ , శ్వేత పసుపులేటీ ఈ చిత్రాన్ని నిర్మించారు. అక్టోబర్ 2న చిత్రం థియేటికల్ విడుదలకు సిద్దమైంది. ఈ సందర్భంగా ఈ చిత్రం ప్రీరిలీజ్ వేడుక మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సంగీత దర్శకుడు చేతన్ భరద్వాజ్ మాట్లాడుతూ తత్వం సినిమాను ఎవరు మిస్ కాకండి. ఖచ్చితంగా అందరికి నచ్చుతుంది. పాషనేటెడ్ పీపుల్ అంతా లైఫ్ పెట్టి ఈ సినిమా చేశారు. దర్శకుడు అర్జున్ కోలా మాట్లాడుతూ ఈ సినిమా సమయంలో చాలా స్ట్రగుల్స్ ఫేస్ చేశాం. మేము ఫేస్ చేసిన స్ట్రగుల్స్‌కు మళ్లీ మేము వచ్చి సినిమా విడుదల చేస్తాం అని ఎవరూ అనుకోలేదు. నిర్మాత శీమకుర్తి వంశీ కృష్ణ మాట్లాడుతూ చాలా స్ట్రగుల్స్ ఫేసి చేసి ఇక్కడికి వచ్చాం. మేము వెండితెరపై ఈ సినిమా చూసి, ఆడియన్స్ ఆదరణ చూసి ఈ కష్టాలు మరిచిపోతాం. తప్పకుండా సినిమా ఈ సినిమా ప్రమోషన్ స్టార్ట్ చేసిన సమయంలో హీరో, హీరోయిన్‌కు కారు యాక్సిడెంట్‌కు గురయ్యారు. మళ్లీ వాళ్లు కోలుకునే సరికి టైమ్ పట్టింది. అందుకే మళ్లీ డిలే అయ్యింది. ఇప్పుడు మళ్లీ ప్రమోషన్స్ స్టార్ట్ చేసి అక్టోబర్ 2న విడుదల తేది ప్రకటించాం. దినేష్ తేజ మాట్లాడుతూ.. ఈ సినిమాకు జరిగిన నెగెటివ్‌లతో అన్నీ ఈ సినిమాకు దిష్టి పోయింది అనుకుంటున్నాం. మా సినిమా కంటెంట్ చాలా గట్టిది. ఈ సినిమా ప్రమోషన్ టైమ్‌లో నాకు హీరోయిన్‌కు యాక్సిడెంట్ జరిగింది. ఈ సినిమాను కూడా అదే కోవలో విజయాన్ని ఇస్తారని అనుకుంటున్నాను. హీరోయిన్ దష్వీక మాట్లాడుతూ తప్పకుండా ఈ సినిమా అందరికి నచ్చుతుందని, మా అందరికి మీ సపోర్ట్ ఉంటుందని అనుకుంటున్నాను అన్నారు.

# 'కామ్రేడ్ కళ్యాణ్' 'సాంగ్ ఎత్తర ఎత్తు' సాంగ్ లాంచ్

కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ శ్రీ విష్ణు పీరియడ్ ఎలి మెంట్స్, హ్యూమర్, రొమాన్స్, ఎమోషనల్ ఎంటం టైనర్‌గా 'కామ్రేడ్ కళ్యాణ్'తో అలరించబోతు న్నారు. జనకిరామ్ మారెళ్ల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని కోన వెంకట్ సమర్పిస్తున్నారు. స్కంద వాహన మోషన్ పిక్చర్స్ ఎల్ఎల్‌పీ బ్యానర్‌పై వెంకట కృష్ణ కర్నాటి, సీతా కర్నాటి నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, టీజర్ పాటలతో సినిమాపై అంచనాలు పెరిగాయి. తాజాగా హిట్ మిషన్ అనిల్ రావిపూడి 'కామ్రేడ్ కళ్యాణ్' నుంచి ఎత్తర ఎత్తు సాంగ్ లాంచ్ చేశారు. విజయ్ బుల్గానిన్ రివల్యూషనరీ ఫ్లేవర్ ఉన్న పాటను కంపోజ్ చేశారు. నల్గొండ గద్దర్ నర్సన్న తన ప్రత్యేకమైన వాయిస్‌తో పవర్‌ఫుల్ ఎనర్జీని అందించగా, భాస్కరభట్ల రాసిన లిరిక్స్ పాటకు రివల్యూషనరీ ఫీల్‌ను తీసుకొచ్చాయి. శ్రీ విష్ణు పవర్ ఫుల్ పర్ఫార్మెన్స్, పాటలోని బీట్, లిరిక్స్ కలిసి ఎత్తర ఎత్తు ఫుల్ ఎనర్జిటిక్ స్ఫూర్తి నింపే పాటగా ఆకట్టుకుంది. ఈ సాంగ్ కి సోషల్ మీడియాలో అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. ఈ చిత్రంలో రాధికా శరత్‌కుమార్, షైన్ టామ్ చాకో, ఉపేంద్ర లిమాయే కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి విజయ్ బుల్గానిన్ సంగీతం అందిస్తుండగా, సాయి శ్రీరామ్ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. చోటా కె. ప్రసాద్ ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. 'కామ్రేడ్ కళ్యాణ్' అక్టోబర్ 9న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.



# 'రణబాలి' అక్టోబరు 9న విడుదల



విజయ్ దేవరకొండ, రశ్మిక మందన్న జంటగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా మూవీ 'రణబాలి'. ఈ సినిమాకు రాహుల్ సంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్నారు. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై 'రణబాలి' సినిమాను ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ హ్యూజ్ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. అక్టోబర్ 16న విజయదశమి పర్వదినం సందర్భంగా 'రణబాలి' సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. 'రణబాలి' నెవర్ ఫర్ గెట్ ది ట్రూత్ పేరుతో రూపొందించిన 4 ఎపిసోడ్స్ డాక్యుమెంటరీ సిరీస్ లో ఫస్ట్ ఎపిసోడ్ 'ది ఫెమైన్ వి ఫర్ గాట్' ఈ రోజు స్ట్రీమింగ్ కు వచ్చేసింది. ఈ ఎపిసోడ్‌లో 1876 -78 మధ్య కాలంలో బ్రిటీషర్స్ సృష్టించిన కరువు కోటి మంది భారతీయుల ప్రాణాలు తీసిన విషాధ ఘటనను వెల్లడించారు. డైరెక్టర్ రాహుల్ సంకృత్యన్ మాట్లాడుతూ మేము బ్రిటీషర్స్, వారి సామ్రాజ్య చరిత్ర గురించి వందలాది చిత్రాల చూశాం. ఎక్కడా కరువు గురించి వాళ్లు పేర్కొనలేదు. హిస్టరీలో 1876 -78 మధ్య కాలంలో ది గ్రేట్ మద్రాస్ కరువు ఏర్పడింది అని ఉంది. ఈ రెండేళ్ల కాలంలో కరువు కారణంగా కోటి మంది భారతీయులు చనిపోయారు. ఆ కాలంలో భారతీయుల మొత్తం జనాభా 2530 కోట్లుగా ఉండేది. వారిలో కోటి మంది చనిపోవడం అంటే ఎంత విషాధమో అర్థం చేసుకోవచ్చు. హీరోయిన్ రశ్మిక మందన్న మాట్లాడుతూ ఈ కరువు ఘటన గురించి విన్నప్పుడు చాలా బాధగా అనిపించింది. వారు చేసిన త్యాగాలను, పడిన బాధను అర్థం చేసుకునేం దుకు ప్రయత్నించాను. హీరో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ ఈ కరువు కాలంలో మన భారతీయులు ఆకలితో చనిపోతుంటే, మరోవైపు బ్రిటీషర్స్ లక్షలాది టన్నుల ధాన్యం బ్రిటన్‌కు, వారు యుద్ధాలు చేస్తున్న ప్రాంతాలకు తరలించేవారు. 150 ఏళ్ల క్రితం ఈ ఘోర ఘటన జరిగింది. ఆకలితో అలమటిస్తూనే బ్రిటీషర్స్ కోసం ప్రజలు ధాన్యం మోసేవారు. ఈ నెల 30న సెకండ్ ఎపిసోడ్ ది హిస్టరీ వి ఫర్ గాట్, అక్టోబర్ 2న మూడో ఎపిసోడ్ ది మెన్ వి ఫర్ గాట్ స్ట్రీమింగ్‌కు రాబోతున్నాయి.

# 'ఎమో ఎమో ఇది' టైటిల్ సాంగ్ విడుదల



ఈ సీజన్‌లో సరికొత్త బ్రీజీ లవ్ ఆంథమ్‌గా అలరిస్తున్న పాట! యువ కథానాయకుడు రోషన్ మేకా, ప్రీతి ముకుందన్ జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'ఎమో ఎమో ఇది'. డా. శైలేష్ కొలను రచన, దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంపై ఇప్పటికే ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. చిత్ర ప్రకటన సమయంలో విడుదల చేసిన ది ఫస్ట్ బ్రీజ్ ఆఫ్ వీడియోకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. ఆ వీడియోతో సినిమాలోని ఆహ్లాదకరమైన ప్రేమకథా ప్రపంచాన్ని పరిచయం చేసిన మేకర్స్.. ఇప్పుడు మరింత అందమైన అనుభూతిని పంచేందుకు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ˇఎమో ఎమో ఇద్ది టైటిల్ సాంగ్‌ను విడుదల చేశారు. ఈ పాటకు హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందించగా, కార్తీక్, రమ్య బెహరా తమ మధురమైన గాత్రాల తో ఆలపించారు. కృష్ణకాంత్ సాహిత్యం అందించారు. ప్రేమ, భావోద్వేగాలు, ఆహ్లాదకరమైన అనుభూతులతో తెరకెక్కుతున్న ˇఎమో ఎమో ఇద్ది చిత్రం అక్టోబర్ 30, 2026న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఎమో ఎమో ఇద్ది టైటిల్ సాంగ్ విడుదలఈ సీజన్‌లో సరికొత్త బ్రీజీ లవ్ ఆంథమ్‌గా అలరిస్తున్న పాట! యువ కథానాయకుడు రోషన్ మేకా, ప్రీతి ముకుందన్ జంటగా నటిస్తున్న తాజా చిత్రంˇఎమో ఎమో ఇద్ది. డా. శైలేష్ కొలను రచన, దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంపై ఇప్పటికే ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. చిత్ర ప్రకటన సమయంలో విడుదల చేసిన ది ఫస్ట్ బ్రీజ్ ఆఫ్ వీడియోకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Plot Nos, 56,27,28, Block GXX, Auto Nagar, VIJAYAWADA-520007. Cellphone : 9848041146, RNI No.64861/96, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.